ఆంధ్రసచిత్రవార
పత్రిక





ఐరోపా ఫొటో ప్రదర్శన 1964లో పోర్చుగీసు ఫొటోగ్రాఫరు ప్రదర్శించిన చిత్రం; ఇది స్త్రీలు పురుషులు కలి
పడవ తాడు లాగే దృశ్యం ఫొటోగ్రాఫ్, పెయింటింగ్‌లా వుండటం దీని ప్రత్యేకత.

ఉత్తరాలు

స్టూడియోపై చర్చ

గతంలో పి. వి. ఆర్. ప్రసాద్ గారు వ్రాసిన లేఖ, 10—7—64 తేది వారపత్రికలో పి. గంగాధరరావుగారి సమాధానం లేఖ చదివాము. ఇందులో ఎంతవరకు నిజానిజాలు తెలియవు. ఒకరిపై ఒకరు వ్రాసుకున్నారు. పి. వి. ఆర్. ప్రసాద్‌గారు వ్రాసినది నిజమా ? పి. గంగాధరరావు గారు వ్రాసినది నిజమా ? ఈ విషయాలు ఏ ఒక్కరికి తెలియవు. ఈ పరిశ్రమ ఒక్క రామారావు, ఒక్క నాగేశ్వరరావు గార్లతో అయ్యేది కాదు. ప్రభుత్వ సహాయం, నిర్మాతల అండ, నటులు, పరిశ్రమలోని ప్రతి ఒక్కరిసహాయం కావాలి. అంతేగాని ఫలానవుడు నన్ను పిలువలేదు. అని విమర్శించటానికిప్పుడు సమయం కాదు. ఆంధ్ర పరిశ్రమను వృద్ధిలోకి తేవటానికి నాగేశ్వరరావు గారు ఎంతో కృషి చేస్తున్నారని కొన్ని పత్రికలు వ్రాశాయి. ఒక్క నాగేశ్వరరావు వల్ల తయారయ్యేది కాదు. సినీ పరిశ్రమలోని ప్రముఖులు అందరూ పాల్గొన్నప్పుడే మన ఆంధ్ర సినీ పరిశ్రమ మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతుంది.

ఎ. బాలకేశవులు (కర్నూలు)

కథలు

"చిన్నారి చిలిపితునకలు" నన్ను ఎక్కువ ఆకర్షించింది. చిన్న పిల్లల మనస్తత్వాలు, వారి చిలిపి చేష్టలు చక్కగా రచించారు. పిల్లలు అల్లరి, పెంకితనం (ఒక్కొక్కప్పుడు మితిమీరి) చేయడం సహజం. అంత మాత్రాన పెద్దవారు ఓపిక పట్టలేక పిల్లల మీద చేయి చేసుకోవడం తరువాత ఎందుకు కొట్టినామా అని చింతించని వారు లేక పోలేదు. పిల్లలు ఆడుతూ పాడుతూ ఉన్న ఇల్లే కళకళలాడుతుంది. వారికి ఏదైన కొంచెం నొప్పి, అనారోగ్యం చేస్తే, ఇల్లు చిన్న బోయి మన మనస్సు ఆందోళన చెందడం కూడా కద్దు. అన్నిటికన్న ముఖ్యంగా చేరికైన వారి దగ్గర పిల్లలకు ఎడబాటు (తాత్కాలికమైనావానరే) కలిగిన ఎడల కలిగిన బాధ అనుభవించిన వారికే తెలుస్తుంది. మొత్తానికి రచయిత్రి పేరు ప్రచురించక పోవడం పొరబాటు అయి ఉండవచ్చు! శోచనీయం.

వ్యాయపతి వెంకట రాఘవరావు (ఖర్గపూర్)

* అదే సంచికలో మనలోమాట చూడండి సందేహం తీరుతుంది.

సినిమా

సినీ నటుడు శ్రీ అక్కినేని నాగేశ్వరరావుగారు అమెరికా పర్యటించి మన దేశానికి ఎప్పుడు వస్తారని నిరీక్షించుచున్న మేమందరము అనుకోకుండా జూన్ 28వ తేదీన వచ్చినట్లు మా (మీ) ఆంధ్ర సచిత్ర వారపత్రిక ద్వారా తెలిపినందుకు మేమెంతో ఆనందించాము. మరియు అక్కినేని గారు సమాధానాలు చదువుచున్నప్పుడు మాకందరికీ అతని దగ్గరకు వెళ్లి నిలనియున్నట్లుంది.

వ్యాయపతి శ్రీనివాసరావు (ఖర్గపూర్)

ఆంధ్రసచిత్రవారపత్రిక

రానున్న సంచికల్లోని కొన్ని

ఆకర్షణలు!

31–7–'64 సంచికలో

మద్రాసు వీధుల్లో సాముద్రికం

ప్రత్యేక సచిత్ర వ్యాసం!

●

7–8–'64 సంచికలో

వనితాలోకం శీర్షిక

నరకానికి ప్రయాణం

యదార్థగాథ ప్రారంభం!

●

14-8-'64 సంచికలో

ప్రాచీన గోవా

బొమ్మల వ్యాసం!

●

21–8–'64 సంచికలో

గరుడపంచమి: వరలక్ష్మి వ్రతం

చిన్న సచిత్ర వ్యాసం!

●

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం : 24—7—'64
క్రోధినామ సం॥ ఆషాఢ మాఘం పౌర్ణమి
సంపుటము 56 సంచిక : 47

స్థాపితము :
1908

*

ముఖ్య సంపాదకుడు :
శివలెంక శంభుప్రసాద్

*

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

*

ఒక సంవత్సరం చందా వివరాలు

ఇండియా రూ. 15.60. ఇతర దేశాలు ఓడమీద (Sea Mail) రూ. 28 60. విమానం ద్వారా (Air Mail) బ్రిటన్ జర్మనీ, ఇతర యూరోప్, ఆఫ్రికా దేశాలు రూ. 120.00. అమెరికా రూ. 176.80. ఆస్ట్రేలియా రూ. 148.20.

విడిప్రతి 30 పై.
సంవత్సర చందా 15 60 పై.
6 మాసాల చందా 7.80 పై.

*

ఆంధ్రపత్రిక కార్యాలయము
7. తంబుచెట్టి వీథి, మద్రాసు-1



"మనకొంపలు తగలెడతాయనే భయం మనకి లేదు ఎందుకంటే మనకి ఇళ్లులేవుగా."

మనలో మాట

విజ్ఞాన చరిత్రలో కొత్త అధ్యాయమనిపించుకున్న "హాయిల్-నర్లేకర్" సమీకరణాల మీద ప్రత్యేక చర్చ చేసిన సైన్స్ వ్యాసం యీ సంచిక 7వ పేజీలో ప్రారంభించాము. ప్రొఫెసర్ హాయిల్‌తో కలిసి భారతీయ యువకుడైన డా॥ నర్లేకర్ 'గురుత్వాకర్షణ' తత్వానికి చెందిన కొత్త సిద్ధాంతాలను ప్రతిపాదించి గత 50సం॥లుగా భౌతిక, ఖగోళ, శాస్త్రాలను ఆక్రమించుకున్న అయిన్‌స్టీన్ సిద్ధాంతాలపై ఒక రకంగా 'తిరుగుబాటు' చేయడం- 'విశ్వవిద్యాలయ'; 'విశ్వశాస్త్ర' విద్యార్థులకే గాక తదభిరుచి గల అందరికీ ఎంతేనా కుతూహలం కలిగించవచ్చును. ఈ 'వ్యాసావళి'లోని ప్రత్యేకతను విజ్ఞులైన పాఠకులు హర్షించగలరని నమ్ముతున్నాము.

శ్రీ శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారి గురించి, డా॥ జయంత్ విష్ణునర్లేకర్ గురించి వ్యాసం వేసిన పేజీలలోనే పేర్కొన్నాము.

* * *

'ఉపాధ్యాయినిగా స్త్రీ' వ్యాసం రాసిన 'ఆనందిని'గారు పత్రికలకు కొత్తవారేగాని, వారు ప్రస్తావించిన వృత్తికి కొత్తవారు కాదు. ఈ వారం వేసిన 'పంజాబ్ పకోడా' వ్యాసం కూడా వనితాలోనికి నచ్చుతుందని అనుకుంటున్నాము. త్వరలో మరికొన్ని 'ఉత్తరాది వంటలు' యీ శీర్షికలో మా పఠితలకు అందిస్తాము.

* * *

పోయినవారం అన్నట్టే యీ వారం మూడో పేజీలో రానున్న సంచికలలోని కొన్ని ఆకర్షణలు పేర్కొన్నాము. జాబితా యింకా చాలా పెద్దదే అయింది. కొత్త సీరియల్ వివరాలతో సహా మరికొన్ని 'విశేషాలు' స్థలాభావం చేత పైవారానికి వాయిదా వేశాము.

చోటులేకనే యీవారం 'దేశదేశాల జానపద కథలు' శీర్షిక క్రింద వెళ్ళవల్సిన జపాన్‌కథ 'నాలుక తెగిన పిచ్చుక' పైవారానికి ఉండిపోయింది.

విషయానుక్రమణిక

ముఖచిత్రం: రాజసులోచన.



ధరవరల స్వరూపం
చిన్నచిన్న లాభాల్లు
ధరల పెరుగుదల
విచిత్రశిశోదయం!
పార్టీ చీలికల ఫలితం
కమ్యూనిస్టు పార్టీ అతివాదులు
చైనా
దాస్ నివేదిక ఫలితం
కైరాన్
దోమలన్ను ఉత్పత్తి చేస్తున్న మురికిగుంటల వైపుకూడా కాస్త చూడండి సార్!
అవినీతి
అవినీతికి మూలకారణాల్లు

హాయిల్-నర్లేకర్ సమీకరణాలు [ప్రత్యేక వ్యాసం]

గురుత్వాకర్షణా?

ఆకాశానికి వొంకరా?

భౌతికశాస్త్రంలో న్యూటన్ నించి నర్లేకర్ దాకా ఒక పరిశీలనాత్మక ప్రస్తావన

శ్రీపాద గోపాలకృష్ణమూర్తి

[వివిధ కళాశాలలో, విశ్వవిద్యాలయాలలో ఫిజిక్స్ ప్రొఫెసర్‌గా ప్రసిద్ధిపొందిన డాక్టర్ గోపాల కృష్ణమూర్తిగారు ప్రస్తుతం బాపట్లలో కాలేజికి ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నారు. తెలుగు పత్రికా పాఠకలోకానికి సాహిత్య విమర్శకులుగానే ఎక్కువ పరిచితులయిన వీరిచేత తమ 'స్వవిషయం' మీదనే వ్యాసం వ్రాయించగలిగినందుకు సంతోషిస్తున్నాము!

విశ్వంలో సగం 'మాయ'మైపోతుందనుకోండి-ఏం జరుగుతుంది? న్యూటన్ నుంచి ఐన్‌స్టీన్‌ల దాకా వస్తున్న చాలా మంది మహా మేధావుల దృష్టిలో అటువంటి 'సంభవం' వల్ల 'సౌర' కుటుంబానికి ఏమీ హానిజరగదు. కాని 'హాయిల్-నర్లేకర్'ల సిద్ధాంతం ప్రకారం, సూర్యుడు యిప్పటికంటే నూరు రెట్లు ఎక్కువగా ఉండుతూంటాడు. 'భూమి' ఆ వేడికి 'మసి' అయిపోతుంది. అది జరిగేలోగా 'మనిషి' బరువు రెట్టింపు ఐపోతుంది!

పైగా ఐన్‌స్టీన్ చెప్పిన తీరుగా ఐతే కాంతి కన్నా 'వేగం' అనేది అసంభవం కాని హాయిల్ సిద్ధాంతరీత్యా దూర విశ్వంలోని నక్షత్రమండలాలు భూమి నించి ఎడంగా కాంతిని మించిన వేగంతో పోతోవుండొచ్చుట!

ఇలాంటి విషయాలను ప్రతిపాదించే హాయిల్-నర్లేకర్‌ల సమీకరణాలను పరిచయం చేయడం యీ ప్రత్యేక వ్యాసావళిలో జరిగింది. ఇందులో (1) ఐన్‌స్టీన్ వాద విమర్శ (2) విశ్వ స్వభావము (3) క్వాసార్లూ-సమీకరణాలూ (4) హాయిల్-నర్లేకర్ సమీకరణాలూ: ప్రత్యేకత అనే విభాగాలు ఆ క్రమంలో వేస్తాము. సం॥]

1. అయిన్‌స్టీను వాదవిమర్శ

గురుత్వాకర్షణను వివరించడానికని హాయిల్ వైజ్ఞానికుడూ, భారతీయ (మహారాష్ట్ర) యువక గణిత శాస్త్రజ్ఞుడు నర్లేకర్ జూన్ మాస ప్రారంభంలో నిర్మించిన సమీకరణాలు అన్ని పత్రికలలోనూ వచ్చినవి: విజ్ఞాన వికాసములో వాద ప్రతివాదాలు చేసే పండిత పరంపర తమ నమ్మకాలకు అనుకూల సాక్ష్యము చేకూరినప్పుడు దానిని గట్టిగా వివరించి ఖ్యాతికి వస్తూంటారు. ఇప్పుడు హాయిల్ నర్లేకర్లు హాయిల్ వాదములో ఒక పెద్ద మెట్టు పైకి ఎక్కేరు. హాయిల్ వాదానికి— చంద్ర రేఖకువలె— రెండు కొమ్ములు. ఒకటి గురుత్వాకర్షణ, రెండు విశ్వ స్వభావవర్ణనము. స్థూల దృష్టికి రెండూ ఒకే విశ్వానికి చెందినవైనప్పటికీ వివరించే పట్ల రెండుగా గణించడము అనుకూలము. నేను గణిత శాస్త్రము నెరిగిన వాడను కాను. అయినా సంపాదకుల అనురోధము వల్ల, విబుధ జనుల వలన విన్నంత, కన్నంత, తెలియ వచ్చినంత తేటపరచే యత్నము చేస్తాను.

న్యూటన్ ఆపిల్

జడ పదార్థాలకు లక్షణాలు రెండు: ఉంటే ఉన్న చోటనే ఉండడము, చలిస్తే ఒకే దిక్కుకి ఒకే వేగంతో చలిస్తూండడము. భూమ్యాది గ్రహాలు సూర్యుని చుట్టూ దీర్ఘ వృత్త మార్గములో తిరుగుతున్నాయి. తిన్నగా బుజు రేఖలో పోవలసినవి దీర్ఘవృత్త మార్గానికి మళ్ళిన కారణమేమి? వాటి దారిని వాటిని పోనియ్యక సూర్యుని వైపు వాటిని లాగుతూండే శక్తే కారణమన్నాడు న్యూటన్ మహావిజ్ఞాని. అమావాస్యా పౌర్ణమీ దినములలో సముద్రము బాగా పొంగుతుంది; సూర్య చంద్రులు సముద్రపు నీటిని ఆకర్షించడము వల్ల. ఈ ఆకర్షణలు అయస్కాంతము ఇనుము నాకర్షించినట్లే ఉన్నవని లెక్కలు తేల్చినవి. "సముద్రపు నీటిలో ఇనుమున్నదా? లేదే, మరి ఈ ఆకర్షణ ఏమిటి?" అని తోటలో కూర్చుని ఆలోచించే న్యూటన్ ఎదుట ఆ అదృష్టవంతపు ఆపిలు పండు పడింది. ఆపిలులో ఇనుము లేదు, కనుక "ఈ ఆకర్షణ జగత్తులో ఉన్న వస్తువులన్నిటికీ నైసర్గిక లక్షణము," అని న్యూటన్ తీర్మానించి దానికి "గురుత్వాకర్షణము" అని పేరు పెట్టాడు. రెండు వస్తువుల నడుమ ఎంత ఆకర్షణ శక్తి ఉంటుందో లెక్కగట్టు వీలిచ్చే సమీకరణము ఇచ్చాడు. ఇది గ్రహగతుల దగ్గర నుంచి, 'ఒక కొండ పార్శ్వములో వ్రేలాడ గట్టిన గుండు ఆ కొండవైపు మొగ్గుతుంది' అన్న సూక్ష్మ వర్తనము వరకూ చక్కగా వ్యాఖ్యానము చేసి సర్వపదార్థ లక్షణమైన గురుత్వాకర్షణను సమర్థించింది.

అయితే, ఈ గురుత్వాకర్షణ మన్నది వస్తువుల సాంద్రత, నిర్మాణమూ వంటి విశిష్ట గుణముల పైన కాకుండా కేవలము వాటి బద్ధకము— తమ గమన స్థితి మార్పునకు అవి కల్పించే నిరోధము— మీదనే ఆధారపడి ఉండడమూ, రెండు వస్తువుల నడుమకు ఏ పదార్థము ప్రవేశించినా ఆ రెండింటికీ గల గురుత్వాకర్షణ మారకపోవడము అన్న విపరీత గుణాల వల్ల సంశయాస్పద మైనది. ఏయే వైజ్ఞానికులు ఏ ప్రయత్నాలు చేశారో నాకు ప్రసిద్ధముగా తెలియలేదు కాని అయిన్‌స్టీను మేధావసు తన సార్వత్రిక సాపేక్ష సిద్ధాంతముతో ఆకర్షణ సిద్ధాంతానికి స్వస్తి చెప్పేడు. ఒక చిన్న వస్తువు పెద్ద వస్తువు వైపు మొగ్గడమూ ఆపిలు భూమి మీద పడడమూ నిజము. దీనికి కారణము ఆకర్షణ అని అనుకుని, న్యూటన్ ఆ ఆకర్షణ ఎంత ఉంటుందో కనుక్కోడానికి సూత్రాలు ఇచ్చాడు. ఈ సూత్రాలు ఆధారంగా కట్టిన లెక్కలు అనుకున్నంత కచ్చితంగానూ ఫలితాలిచ్చాయి. అయితే 'ఆకర్షణ' అన్నది నిజమా? అన్న ప్రశ్నకు నమ్మకంగా జవాబు రాలేదు. లెక్కలు సాగిపోయాయీ, ఆకర్షణ ఉన్నదనుకోడము వల్ల పెద్ద ఇబ్బందులు లేవుకదా అని వైజ్ఞానికులు 'గురుత్వాకర్షణ' అన్న పదాన్ని నమ్మకంతో వాడేశారు.

అయిన్‌స్టీను, స్థిరంగా ఉన్నవారికీ వారికీ సాపేక్షం (Relative) గా సమ వేగంతో బుజు

'ఆంధ్రసచిత్ర వారపత్రిక'లో ప్రచురణకు ఇండియన్ ఇంక్‌తో చేసిన కార్టూనులు మాత్రమే పంపాలి. సాధారణంగా 4" X 2", 4" X 4" చిత్రాలు పత్రికలో పడుతూ ఉంటాయి.

ఈ ప్రత్యేక వ్యాసావళి లో మీరు తెలుసుకోగల కొన్ని విశేషాలు:

- ఆపిల్ చెట్టు నించి రాలి క్రింద పడక పైకి ఎందుకు పోకూడదు? 'గురుత్వాకర్షణ' అంటే న్యూటన్ ఏమనుకున్నాడు?
- ఐన్‌స్టీన్ యీ గురుత్వాకర్షణ అన్న పేరు ధరించిన భౌతిక దృశ్యానికి కారణాలు ఏమన్నాడు?
- హాయిల్-నర్లేకర్‌లు వస్తువు ద్రవ్యరాశికీ, దృశ్యామా నజగద్వ్యాప్త రాశికీ గల సంబంధమును వివరించే సమీకరణముల నెలా నిర్మించారు?

రేఖలో గమించేవారికీ, భౌతిక సూత్రాలు ఒకే రూపంతో వర్తిస్తాయన్న పరిమిత సాపేక్షతా సూత్రాన్ని (Restricted Principle of Relativity) ప్రస్తరించి, ద్రవ్యశక్తి సమతా సూత్రము (Principle of Equivalence of Mass and Energy) వంటి కొత్త ఫలితాల్ని కనిపెట్టాడు. సూత్రాల పరిమిత సాపేక్షతను సార్వత్రిక సాపేక్షతగా (General Theory of Relativity) విస్తరింప జేయాలన్న ఉదాత్తాశయంతో వస్తువులు సమవేగంతోకాక వేగవృద్ధితో గమించే క్షేత్రములను [illegible]ంచాడు. ఆ క్షేత్రము లన్నిటా త్వరణము (Ac[illegible]ration) ఉండుటతో పాటు దూరములూ—కాలములూ—కొలతలు వికృతి చెందుతున్నాయి అని గుర్తించాడు.


ఆకాశానికి వంకర?

ఇంకొక దారిలో పరిశోధనలు సాగించినందుకు ప్రతిఫలముగా, మనమున్న ఈ అంతరాళము (Space)లో దూరపు కొలతలు (Co-ordinates) మూడు మాత్రమే కాక కాలపు కొలత ఒకటి, నాలుగోది, అదనంగా చేర్చవలసి ఉన్నదని తేలింది. అటువంటి కాలాంతరాళములో వర్తించే క్షేత్రగణిత (Geometric) సూత్రాలూ, తిన్ననైనవి (Straight) మూడే కొలతలు గల యూక్లిడియను అంతరాళములో వర్తించే సూత్రాలకు భిన్నముగా ఉండుటచే, (కాలము అదనముగా చేరిన) కాలాంతరాళము వక్రమైనదని నిర్ణయించాడు. ఈ రీతిగా, మనమున్న కాలాంతరాళము వక్రమైనది (Curved Space) అని తేలింది. ప్రతీ ఖగోళము చుట్టూ ఉండే త్వరణ క్షేత్రము (Accelerating Field)లో కొలతలు మడత పడుతున్నాయని ఎరిగిన అయిన్‌స్టీను, వక్రతగల విశ్వాంతరాళము, ఖగోళముల సమీపములో ఎట్టి వికృతిని పొందుతున్నదో లెక్క వేశాడు. అంటే అంతరాళమే వక్రమని, ఒక సంగతి, ఖగోళ సమీపాంతరాళము అదనపు వక్రతను పొందునని రెండో సంగతి, తేలుతున్న వన్నమాట. ఈ రెండు కొత్త విషయాల ఆధారంగా అయిన్‌స్టీను లెక్కవేసిన భౌతికఫలితాలు— అదివరకు ఎవరూ చెప్పనివి— సరికొత్తవి విజమై, ఆయన లెక్కలకూ సిద్ధాంతాలకూ బలమైన మద్దతు నిచ్చాయి. వీటి ప్రకారము ఒక వస్తువు బరువైన ఇంకొక వస్తువు వైపు మొగ్గడము ఆకర్షణ శక్తి (Gravitational Force) ఉండడము వల్ల కాదు. అలాటి శక్తి లేనే లేదు. వక్రమైన అంతరాళము ఖగోళ వస్తు పరిసరములో అదనపు వక్రత పొందుతుంది. ఈ వక్రక్షేత్రములో ప్రయాణించేటివి వక్రపు దారుల్లో సాగుతాయి, తిన్నని దారుల్లో సాగవు కనక ఇవి ఆకర్షించ బడినట్లు కానవస్తాయి కాని అలాంటి ఆకర్షణ అన్నది ఏదీ లేదు. అయిన్‌స్టీను సార్వత్రిక సాపేక్షతా వాదాన్నిబట్టి "గురుత్వాకర్షణ" అని ఇది వరకు న్యూటను అనుకున్నది. సుదూర గామిప్రభావము (Action at a distance) కాకుండా కాలాంతరాళ క్షేత్ర వికృతి (Geometrical Distortion) యొక్క ప్రభావముగా రూపొందుతున్నది. ఈ వ్యాఖ్యానానికి ఉపపత్తి ఈ వాదము కొత్తగా కనిపెట్టిన భౌతిక ఫలితాలు (బుధగ్రహ భగణ భ్రమణమూ ఖగోళాల వర్ణపట రేఖలు అరుణ వర్ణము వైపు మొగ్గడమూ సూర్యుణ్ణి దాదాపు స్పృశిస్తూ వచ్చే నక్షత్ర కాంతి రేఖల వక్రతాను.)

ఈ వాదముయొక్క విజయములు మాత్రమే కాక గురుత్వాకర్షణ వాదాన్ని కాదనే వాదనలు ఒకటి రెండున్నవి. గురుత్వాకర్షణయే పనిచేస్తూ వున్నట్లైతే జ్యోతిర్మేఘాలనే వాయురూపపు నెబ్యులాలు క్రమంగా ఘనీభవించాలి. అవి అలాగ ఘనీభవిస్తున్న ఉదృష్టాంతము ఖగోళ శాస్త్రవేత్త లెవరూ కనిపెట్టలేదు. కనుక గురుత్వాకర్షణ శక్తి అనుమానపదమే అవుతున్నది.

పరిధులు

ఇప్పటికి, "గురుత్వాకర్షణ" అన్న పేరు ధరించిన భౌతిక దృశ్యానికి కారణాలు రెండుగా ప్రతిపాదించ బడినవి. మొదటిది న్యూటను ఆకర్షణయే కాబోలనుకున్న సుదూరప్రభావ వాదము (Theory of Action at distance) రెండోది — అయిన్‌స్టీనుది—కాలాంతరాళ క్షేత్ర వికృతియే కారణమనే వాదము. అయిన్‌స్టీను, అయస్కాంత క్షేత్రమున్నది అయస్కాంతము చుట్టూ అయస్కాంత శక్తి రేఖలతో విస్తరించి యున్న క్షేత్రమనీ, విద్యుత్ క్షేత్రమూ అలాటిదేనని భౌతిక శాస్త్రవేత్తలు చెప్పిన క్షేత్రవాదములను చక్కగా గుర్తించే తన కాలాంతరాళ క్షేత్ర వాదాన్ని పెంచాడు. అయితే మహదాకాశాన్నీ, ఖగోళ పరిసరాకాశములోని గురుత్వాకర్షణ క్షేత్రాన్నీ ఆక్రమించి, పెద్ద ఫాయిలో కొత్త ఫలితాల్ని పట్టి చూపిన కాలాంతరాళ క్షేత్రవాదము; విద్యుత్ క్షేత్రాన్నీ, పరమాణువు గర్భములోని కేంద్రకములోని శక్తి క్షేత్రాన్నీ కూడా ఆకళించుకుని ఏకైక క్షేత్ర వాదముగా అయిన్‌స్టీను చేతులలో రూపొందలేక పోయింది. విశ్వాంతరాళ వక్రతా వాదములోనికి అంతవరకూ గురుత్వాకర్షణ అనిపించుకొంటూండిన దానిని ఖగోళ సమీపపు అదనపు వక్రతగా అన్వయించి గురుత్వాకర్షణ ఫలితాలన్నిటినీ తన క్షేత్ర వాదము న సాధించిన అయిన్‌స్టీను విద్యుత్ క్షేత్ర ఫలితాల్ని పరమాణు కేంద్రక క్షేత్ర ఫలితాల్ని తన క్షేత్ర వాదములోనికి లాక్కొని అన్వయించలేదు. జగత్తు నంతటినీ ఏకైక క్షేత్ర వాదము (Unified Field Theory) లోనికి లాగే యత్నము చేస్తూనే ఆయన దేహము చాలించాడు. కనుక విద్యుత్—కేంద్రక—శక్తి క్షేత్రవాదాలు



జయంత్ విష్ణునర్లేకర్ 1938 జూలై 19న కొల్హాపూర్‌లో జన్మించాడు. 1957లో బి.ఎస్.సి పట్టం పుచ్చుకున్నాడు. ఆ తర్వాత కేంబ్రిడ్జ్‌కి పై చదువులకి వెళ్లాడు. 1963 లోనే అక్కడి 'కింగ్స్ కాలేజ్'కి 'ఫెలో'గా ఎన్నికయ్యాడు.

తండ్రి శ్రీ వి. వి. నార్లేకర్ కాశీవిశ్వవిద్యాలయంలో గణిత శాస్త్రంలో ఆచార్యులుగాఉండి ప్రస్తుతం రాజస్థాన్ పబ్లిక్ సర్వీస్‌కమిషన్ అధ్యక్షులుగా ఉంటున్నారు.

ఇప్పటికీ తండ్రిని 'గురువు' గానే చూస్తున్నానని నార్లేకర్ 'స్టేట్స్‌మన్' ప్రతినిధితో ఇటీవలే అన్నాడుట. జయంత్ విష్ణునార్లేకర్‌కి పి. జి. ఉడ్ హౌస్ పుస్తకాలంటే చాలా ఇష్టంట... నడకహాబీ.

అయిన్‌స్టీను వాదములో ఇమడలేదన్నది అతని వాదానికి ఒక లోపముగా తీరి కూర్చున్నది.

ప్లస్సా, మైనస్సా?

ఇంత మాత్రమే కాదు. కాలాంతరాళములో

నార్లేకర్...

అతడు ఖగోళ పరిసర క్షేత్రానికి ఆరోపించిన అదనపు వక్రత అతడు తలచినట్లు ఆ ఖగోళానికి చేరువగా ఒక వస్తువును తీసుకు పోయేటట్టే ఉండడానికి కారణమేదీ అతడు చెప్పలేదు. కారణమ్మే చెప్పకుండానే అతడు ఉపయోగించిన మైనసు చిహ్నాన్ని ప్లస్సుగా మార్చి లెక్కలు వేయవచ్చును గదా ? అలా వేసినప్పుడు ఫలితము 'ఆకర్షణ' కాక వికర్షణ అవుతుంది, అంటే ఆపిలు పండు కింద పడక ఆకాశంలోకి వెళ్లిపోవాలన్న మాట ? వాస్తవంగా జరిగేది అది భూమి మీద పడడము. అంటే ఆపిలు మీద భూమియొక్క వస్తు ప్రభావమున్న దన్నమాట. అయిన్‌స్టీను, ఈ పతనానికి భూమి చుట్టూ ఉన్న (కాలాంతరాళ) క్షేత్ర వికృతి మాత్రమే కారణమని చెపుతూ, ఆ వికృతి వల్ల ఆపిలు భూమికి విముఖంగా వెళ్లిపోవడమూ కూడా వీలేనన్న సత్యాన్ని స్పృశించక, భూమిమీదపడడాన్నే వ్యాఖ్యానించాడు. హోయిల్ విమర్శిస్తాడు గదా, "కారణము క్షేత్ర వికృతే అయితే వస్తువు భూమి మీదపడా లని సూచించే మైనస్సే వాడడానికి కారణమేమిటి?" అని. అయిన్‌స్టీను క్షేత్ర వాదము వస్తువుని విస్మరించానంటూ వస్తువు వైపే వేలు చూపిస్తోంది అంటాడు.

ఈ విమర్శ ఇంకొక వైపునించీ ఢీకొంది క్షేత్ర నిక్షత వాదాన్ని. మన సూర్యకుటుంబము మాత్రమే విశ్వములో వున్నదనుకుందాం. అప్పుడు ప్రస్తుతము జరుగుతూన్న ఘటనలే జరుగుతూ వుంటాయా ? అని అడిగితే అయిన్ స్టీను వాదము "అవే" అంటుంది. ఆ వాదము క్షేత్ర వికృతిని చెప్పేటప్పుడు, "వస్తు శూన్యత వల్ల, కాలాంతరాళానికి నైసర్గికంగా వున్న వక్రత మాత్రము నిలిచి వుంటుంది. వస్తువంటూ వుంటే ఆ వస్తుసత్తు వల్ల అధిక వక్రత ఏర్పడుతుంది. అదే లేకపోతే, మామూలే" అంటుంది. హోయిల్ "ఇదేమిటో లాగున్నది నాకు. నమ్మకము కలిగించడము లేదు. శూన్య విశ్వములో వున్నప్పటి వస్తువుకీ, చుట్టూ — దూరంగా అయితే ఆగు గాక— ఖగోళాలూ, నెబ్యులాలూ వున్నప్పటి వవస్తువు తేడాయేమీ వుండదా ? ఇది విడ్డూరము కాదా ?" అంటాడు.

ఈ ఆశ్చర్యాన్నే (యువక) నర్లేకర్ తండ్రి, వి. వి. నర్లేకరు గారు "విశ్వములో భౌతిక శాస్త్రము ఉండడానికి అవసరమైన కణాలు రెండే (ఒకటి కాలాంతరాళ వక్రత ఏర్పరచడానికీ, రెండోది ఆ వక్రమార్గంలో పడడానికీ మాత్రమే నా ?") అని చమత్కరించారు. రెండో వస్తువన్నది లేక పోయినా 'గురుత్వాకర్షణ' (అని అనిపించుకొన్న ఫలితము) ఉంటూనే ఉంటుంది అన్న తీర్మానము హోయిల్‌కు నచ్చ లేదు అది వస్తువు మీద ఫలితమే గదా, వస్తువే లేకపోతే ఎందుకుంటుంది అంటాడాయన. గురుత్వాకర్షణ ఏదో విధంగా వస్తువు గుణమే కావాలన్న నమ్మకంతో ఆయన విశ్వ పరిశీలన చేశారు. విశ్వమంతటా ధూమము కన్న పలాచగా వస్తు ధూళి ఉన్నదనీ, ఏ వస్తువు — అనగా ఖగోళము — ద్రవ్యరాశి అయినా విశ్వమంతటితోనూ సంబంధించే వుంటుందనీ నమ్మి ఆయన విశ్వ స్వభావ వాదాన్ని ఒకదాన్ని ఉద్ఘాటించారు. మొన్నటి గురుత్వాకర్షణ సూత్రాలు ఆ వాదానికి కడపల. (ఇంకా ఉంది.)

రాజధాని కబుర్లు

హైద్రాబాద్‌లో సిటీ బస్సు రేట్లు!

ధరలు మండి పోతున్నాయి రోజు రోజుకు, వాటిని అదుపులో పెట్టే పద్ధతేమిటో ఎవ్వరికీ అంతు పట్టి పట్టు కనబడటం లేదు. నాలుగు మూలల హాహా కారాలు వినబడుతున్నాయి, అందరూ కూడా ఈ అధిక ధరలవలన బాధలు పడుతున్న వాళ్ళే. పరిష్కార మార్గాలు ఏమిటో ఇంకా ఆలోచనల్లోనే ఉంది! ధరలేమో, సత్యాగ్రహాలు కాదు, ఇట్టే 'అరెస్టు' (అదుపులో పెట్టడం) చెయ్యటానికి అని చమత్కరించారు తెన్నేటి విశ్వనాధం గారు. కొత్త కేంద్ర ఆహారమంత్రి శ్రీ సి. సుబ్రహ్మణ్యం, హైదరాబాదు వచ్చి, పరిస్థితులను స్వయంగా చూశారు. అయినా దేశంమొత్తం మీద ఉన్న గొడవేగా ఇది. ఆహార ధాన్యాలు పండించే రైతులకు ప్రోత్సాహం ఇవ్వటానికి గాను గరిష్ట ధరలు నిర్ణయించాలని ఇంతవరకు కూడా మధ్య వర్తులు, వర్తకులు, ఉత్పత్తిదారులను మంచి ధర రాకుండా అడ్డు పడుతున్నారని అన్నారు. పైగా వర్తకులే ఆహార ధాన్యాలను ఎక్కువగా నిలవచేస్తూ ధరలు అధికంగా ఉండటానికి కారకులయ్యారు అని విమర్శించారు కేంద్ర మంత్రి. ఈ విధంగా కనక చేస్తూ ఉంటే, ప్రభుత్వం వారు ఇక సహించరు, ఆహారధాన్యాల వ్యాపారమంతా వారే తీసుకుని నిర్వహించాలసి వస్తుందని కూడా హెచ్చరించారు.

ఆహారధాన్యాలు నిలువ చేస్తూ, ప్రజలకు సరియైన పంపిణీ జరక్కుండా చేస్తున్న పెద్ద దొంగ ప్రభుత్వమే అని అంటున్నారు ఆచార్య రంగాగారు. సరిపడినన్ని ఆహార ధాన్యాలు మన దేశంలో లేక బాధ పడుతుంటే ఉన్నవాటిల్లోనే, కొంతవరకు ఇతర దేశాలకు ఎగుమతి చేయటం, సిగ్గు చేటని, శ్రీ యం ఆర్. మసాని గారు అంటున్నారు. స్వతంత్రపార్టీ సమావేశం సందర్భంగా వీరిద్దరు రాజధాని నగరానికి వచ్చినప్పుడు వెలిబుచ్చిన అభిప్రాయాలు.

తెల్లారేటప్పటికి బీదాబిక్కి జనం, సంచీలు పట్టుకుని, తిండి గింజలకోసం, షాపుల దగ్గర, క్యూలో గంటలు తరబడి గాపులు గాయటం చూస్తూనే ఉన్నాం. చిల్లర దుకాణాలు చాలినన్నిలేకపోవటం వలన ఈ ఇబ్బంది తప్పనిసరి అవుతూనే ఉంది. కేంద్ర ఆహార మంత్రి గారు ఈ అవస్థ చూసి చిల్లర దుకాణాలను రెండు రెట్లవరకు పెంచాలని ఆలోచన ఉన్నట్లు చెప్పారు. నిజమే, మనకు ఎన్నో ఆలోచనలున్నాయి. మరి అవి ఆచరణలోకి వచ్చేదెప్పుడో!

పంచాయితీసమితుల ఎన్నికల సంరంభం, ఎక్కడో గ్రామాదుల్లో ఉన్నప్పటికీ, వాటిని గురించి చర్చలు మాత్రం విపరీతంగా వినబడుతున్నాయి హైద్రాబాదులో. ఎన్నికలు చెల్లవంటూ ఎన్నో రిట్‌పిటీషన్లు హైకోర్టులో దాఖలవుతున్నాయి. తీర్పు వింటామని ఆదుర్దాగా చాలామంది జనం, వచ్చి కూర్చుంటున్నారు, చివరకు తీర్పు రానే వచ్చింది, ఉన్న పంచాయితీ సమితులను రద్దు చెయ్యటానికి గాను సరిహద్దులను మార్చటానికిగాను ప్రభుత్వం వారికి హక్కు లేదని అన్నారు హైకోర్టువారు. అందు వలన అట్లా మార్పిడి చేసిన వాటిల్లో జరిపిన ఎన్నికలు కూడా రద్దు అయినట్టేనని, దాదాపు దెబ్బంత

ఇంటింటి పజ్యాలు

ఆరుద్ర

పథేర్ పాంచాలి

సెలవు పెట్టి రమ్మంటున్నారు బంధువులు వాళ్ళవూరు
సెలవు పెట్టేదాకా మీ ఇంట్లోనూ వూరుకోరు
ఉన్న లీవు మురగ పెట్టలేవు కదా చూస్తూ చూస్తూ
ఒక మంచి రోజున పెట్టేస్తావు ధైర్యం చేసి దరఖాస్తూ
వెళ్లక తప్పదా అంటాడు హెడ్ క్లార్కు
వినిపించుకోదు నీ చెవి అతడి రిమార్కు
గ్రాంటు చేయించే ముందు పూర్తి చేయ మంటాడు ఎరియర్సు
కాదనలేక పని చేస్తావు రోజుకు ట్వెంటీ సిక్సు అవర్సు
చిట్ట చివరకు చిరునవ్వు నవ్వుతూ హుజూరు
చేస్తాడు పది రోజులు తగ్గించి సెలవు మంజూరు
ఇంకో గుమాస్తా వచ్చి చెయ్యాలి నిన్ను రిలీవు
ఇచ్చిన వెంటనే వాడుకో లేనిదే లీవు
తరువాత పడకుండా రైల్లో ఇక్కట్లు
తక్షణం రిజర్వు చేయిస్తావు స్లీపరు కోచీలో టిక్కెట్లు
రాస్తావు బంధువులకు వెంటనే జాబు
రాస్తారు వెను వెంటనే వాళ్ళు జవాబు
వల్ల మాలినంత కనబరుస్తారు ఆదరాభి మానాలు
వచ్చే టప్పుడు నిన్ను కొని తెమ్మంటారు రుబ్బురోలు
లేదా ఫలానా అంచున్న పట్టు చీరలు
లేదా మీవూళ్ళోనే దొరికే కొన్ని కూరలు
రాగానె ఇచ్చేస్తా మంటారా డబ్బులు
బాగుండదు పుచ్చుకోవడం తబ్బిబ్బులు
తెమ్మంటే మానేయడం తప్పు
చెయ్యవయ్యా మరి కాస్త అప్పు
ఒకప్పుడు నీకు సులభంగానే దొరకొచ్చు సెలవులు
ఒకంతట రావు కదా సమయానికి చాకింటి వలువలు
దేవుకీ వాడింటికీ పదిసార్లు తిరుగు
రేఖా మాత్రంగా మిగిలి కొత్త జోళ్ళ అరుగు
చిన్నా పెద్దా కలిపి కొంటావు నువ్వు ఆరు టిక్కెట్లు
స్లీపరు కోచ్‌లో ఇక్కడో బెర్తూ అక్కడో బెర్తూ ఇస్తే పరుస్తావు నీవు నీ పక్కట్లు
ఆగిన ప్రతి స్టేషన్లోనూ నువ్వు దిగు దిగు నాగన్నా
ఆరగించ డానికి యింట్లో ఎన్ని చేయించి
మూట కట్టించినా ఏవో టిఫిన్లు కొనాలి నువ్వేమన్నా
కావలసి నప్పుడు దొరకదు కదా ఉదకంబు
కాబట్టే ప్రతి స్టేషన్లో నింపాలి మర చెంబు
బంధువులవూరికి మారాలి రెండు రైళ్ళు
సందట్లో పోతయ్యి నువ్వు పట్టుకొచ్చిన ఆఫీసు ఫైళ్ళు
ఆ చుట్టాల యిళ్లల్లో తినక తప్పదు రోజుకు రెండు విందులు
ఆ రోజులు కాగానే తినాలి అజీర్ణానికి మందులు
హాయిగా ఉండాలంటే సెలవుల్లో ప్రాణాలు
పీ ఇంటాయనా పెట్టుకోరాదు ప్రయాణాలు. ★



రాజధాని కబుర్లు

వేల పంచాయతీలలో జరిపిన ఎన్నికలను మళ్ళీ జరపాలసి వస్తుందేమోనని అనుకుంటున్నారు. అయితే ప్రభుత్వం వారు, దీన్ని దృష్టిలో పెట్టుకుని, అవసమైన చర్యలు తీసుకో కలుగుతారని, కొంత మంది భావన. అయితే ఈ తీర్పు పెద్ద సంచలనం కలిగించిందన్న మాట వాస్తవమే!

హైద్రాబాదులో, బస్సు రేట్లు పెంచాలని అనుకోవటం వద్దని పెద్దగా ఆందోళన రావటం అది వరకు జరిగిన విషయాలు, కాని ఇప్పుడో చమత్కారం చేశారు, కనీసపు రేటు పది పైసలు పెట్టకుండా ఇప్పుడున్న ఆరు పైసల టిక్కెట్లను ఏడుపైసలు చేశారు. తొమ్మిది పైసలల్లా పదిపైలయినాయి. ఇప్పటి పన్నెండు పైసల రేటును కూడా పదిపైసలే చేశారు. పదహారు పైసల టిక్కెట్టును, ఒక పైసె తగ్గించి 15 పైసలు చేస్తే, 19 పైసల టిక్కెట్లను ఒకపైస పెంచి 20 పైసలు చేశారు. 20 పైసలకు మించిన టిక్కెట్ల రేట్లు మాత్రం తగ్గినాయి. నగరంలో ఎక్కువదూరం ప్రయాణం చేసేవారికి మాత్రం, ఈ రేట్ల మార్పిడి ఉపయోగకరంగానే ఉంటుంది. రోడ్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్‌వారు రూపొందించిన ఈ మార్పులను, రాష్ట్ర ప్రభుత్వం వారు అంగీకరించారు. ఇక అమలులోకి రావటమే ఆలస్యం.

రెండో స్టూడియో

ఇన్నాళ్లకు రాజధాని నగరంలో రెండో స్టుడియో అంటూ ఏర్పడింది. సదరన్ మూవిటోన్ లిమిటెడ్ వారు ముందుకొచ్చి, స్టుడియోను నెలకొల్పడానికి పూనుకొన్నందుకు వారిని ఎంతైనా అభినందించాల్సిందే! చార్‌మీనార్‌కు సూటిగా ఫలక్‌నామాపాలెస్ వైపుకు వెళుతుంటే అక్కడ దగ్గరలోనే 22 ఎకరాల వైశాల్యం గల స్థలంలో ఈ స్టూడియోకు, రాష్ట్ర ముఖ్యమంత్రి గారే ప్రారంభోత్సవం చేశారు, సినిమా పరిశ్రమ అభివృద్ధి చెందాలని మొదటినుంచీ ఆకాంక్షిస్తున్న కాసు బ్రహ్మానంద రెడ్డిగారే ఈ ప్రారంభోత్సవం జరపటం బాగావే ఉంది. అదివరలోనే ప్రభుత్వం వారు, సినీ పరిశ్రమాభివృద్ధికి ఎన్నో సౌకర్యాలు కల్పించటానికి గాను పథకాలు వేసి ఉంటారు. రాజధాని నగరంలోనే చిత్రాన్ని నిర్మిస్తూ, ప్రభుత్వ ఆదరాభిమానాలకు పాత్రులు కాదలచుకున్నవారికి ఇదొక మంచి అవకాశమే. సారథీ స్టుడియాలోవత్తిడివలన అవకాశం లేకపోయిన నిర్మాతలు, ఇతర కారణాలవలన విముఖులైన నిర్మాతలు కూడా, ఈ రెండో స్టుడియోను వీలైనంతవరకు ఉపయోగించుకోవచ్చు.

బి. ఎల్. ఎస్. ★

ఉపాధ్యాయినిగా స్త్రీ



విలువైన విద్యార్థినీ దశగడిపిన తర్వాత ఉద్యోగం చేయగోరే స్త్రీలు తాము చేయబోయే వృత్తి ధర్మాలను, అందలి సాధక బాధకాలనుగూర్చి తెలుసుకోవడం అవసరం.

శారద కూడా భవిష్యత్తులో తాను ఎన్నుకొనే వృత్తినిగూర్చి స్నేహితులతో సంప్రదించి, కొందరు పెద్దల సలహాలు తీసుకుంది. వారిలో ఉపాధ్యాయినిగా స్త్రీ జీవితాన్ని ప్రశంసించినవారు కొందరైతే విరసించినవారు మరికొందరు.

స్త్రీల విద్యా వికాసాలను గూర్చి, వారు నిర్వహించే వృత్తుల గూర్చి శారదకు కొన్ని నిర్దుష్టమైన అభిప్రాయాలున్నవి. గత శతాబ్దంగా స్త్రీ జనాభ్యుదయ వాదులు, సాంఘిక సంస్కర్తలు స్త్రీ జనోద్ధరణకు కృషిచేస్తున్నారు. ఫలితంగా ఎందరో మహిళలు ఉన్నత విద్యలను అభ్యసించి, వివిధమున శైవ కుటీర పరిశ్రమలలో శిక్షణపొంది వివిధ రంగాలలో తమ శక్తిసామర్థ్యాలను ప్రకటిస్తున్నారు. జీవనోపాధి కల్పించుకుంటున్నారు. ఒకవిధమైన ఆర్థిక స్వాతంత్ర్యం, వ్యక్తిత్వం పొంది నవ భారత నిర్మాణానికి చేయూత నివ్వగల్గుతున్నారు. అన్ని రంగాలలోను, అన్ని సమయాలలోనూ పురుషులతో పాటు స్త్రీలుకూడ ముందంజ వేసిననాడే మన దేశం సాటి దేశాలతో సమస్థాయినందగల్గుతుందని మహాత్ముడు బాపూ మొదలుకొని నవయుగ నిర్మాత నేహ్రూవరకుగల నాయకుల ఆశయం. వారి ఆశయ సంసిద్ధికై కృషిచేసి, దేశ, విదేశ విఖ్యాతిగాంచిన మహిళలు శారదకు ఆదర్శం. ఉత్తమ స్త్రీల అడుగుజాడల్లో తన జీవితం గడపాలని ఆమె ఆకాంక్ష.

ఉపాధ్యాయినిగా ప్రాచీన యుగంలో స్త్రీ ఎట్టి జీవితం గడిపి ఉంటుందనే విషయమై వివరాలినాడు మరుగుపడి ఉండవచ్చు. కాని పాణినీయాన్నిబట్టి వాటి సంఘంలో స్త్రీలు ఉపాధ్యాయినులుగా, అధ్యాపకులుగా వ్యవహరింపబడ్డవారున్నారు. వారి సంఖ్య స్వల్పమైనా వారు విదుషీమణులై, బ్రహ్మ విద్యావేత్తలై, పురాణేతిహాస శాస్త్రవిజ్ఞాన పరిజ్ఞానం కలవారై ఉంటారు.

బౌద్ధ యుగంలోకూడ బౌద్ధ ధర్మోపదేశికలుగా ప్రసిద్ధిచెందిన స్త్రీలెందరో ఉన్నారు. హిందూ, బౌద్ధమత ధర్మాల భేద సాదృశ్యాలను, ఆయా ఉద్గ్రంథాల ప్రాశస్త్యాన్ని, అందలి సారాంశాన్ని బౌద్ధ విశ్వవిద్యాలయాల్లోను, ఆరామాలలోను పండితపామర జనరంజకంగా బోధించిన నాటి అధ్యాపికల పాండిత్య ప్రతిభలు ప్రశంసనీయం. వారి ప్రజ్ఞాపారమితత్వం దేశ, విదేశాల మేధావులను సైతం చకితులను చేశాయంటే అతిశయోక్తి కాదు.

'తల్లే తన మొదటి గురువ'ని ఒక మహనీయుడు చెప్పిన సూక్తినిబట్టి ఉపాధ్యాయినిగా స్త్రీ రాణించడానికి చక్కని అవకాశం ఉంది—అనుకుంది శారద. ఈ వృత్తిలో ప్రవేశించే స్త్రీలు అనేక రకాలుగా ఉంటారు. జీవనోపాధికని కొందరు, చదివిన చదువు సద్వినియోగమవుతుందని కొందరు; విద్యార్థులతోను, ఉద్గ్రంథాలతోను సత్కాలక్షేపమని కొందరు; ఆశయమేదయినాకూడ బోధకురాలిగా జీవితం గడపాలనుకుంది శారద.

ఆధునికయుగానికి అనుగుణమైన విద్యావిధానం, అందుకు వలసిన బోధనా పద్ధతులు, విద్యార్థులు— వారి మనస్తత్వం, పాఠశాలలు వాటి లక్ష్యం— వంటి అనేక విషయాలను శారద శ్రద్ధగా పరిశీలించి తెలుసుకుంది. ఈనాటి ఉపాధ్యాయిని అనేక విద్యలలో ప్రావీణ్యం గడించాలి. వివిధ రకాల మనస్తత్వాలు, వయోభేదాలు, జ్ఞాన పరిమితిలో వైవిధ్యం గల విద్యార్థులకు బోధించాలి. ఆ బోధనా పద్ధతి విద్యార్థులకు సులభగ్రాహ్యం కావాలి. ఉపాధ్యాయుల ప్రసంగాలు, ప్రబోధాలు విద్యార్థులకు అపూర్వమైన విషయ పరిజ్ఞానం కలిగించి, వారి మానసిక వికాసానికి దోహదం చేసేవిగా ఉండాలి. ఉపాధ్యాయుల బోధనా పద్ధతి విద్యార్థులకు విద్యావ్యాసంగంపట్ల శ్రద్ధాసక్తులు కలిగించాలి. మేధాశక్తికి మించిన పరిశ్రమ, పరిమితికి మించిన విద్యాబోధ విద్యార్థులకు తగదు. ఈ విషయమై అధికారులు శ్రద్ధ చూపనిచో విద్యార్థుల విద్యాలయాలపట్ల, ఉపాధ్యాయులపట్ల విముఖత ఏర్పడవచ్చు.

విద్యార్థినిగానే నేటి విద్యాలయాలలో విద్యావిధా

'ఆనందిని'

వనితాలోకం 'ప్రత్యేక వ్యాసావళి'లో పదవవ్యాసం

ఇంటోగల లోపాలను గమనించింది శారద. విద్యాలయాల నిర్వహణలోను, విద్యార్థుల విద్యాభ్యాసంలోను, ఉపాధ్యాయుల బోధనా విధానంలోను, పాఠ్యగ్రంథ నిర్ణయంలోను విద్యార్థుల ప్రజ్ఞా పాటవాలను పరీక్షించడంలోను, లోపాలుండడం ప్రతి ఉపాధ్యాయునికి తెలిసిన విషయం. ఈ లోపాలను ఆమె శక్తి మేరకు అధ్యాపిక సవరించుకోగలదు. కాని విద్యాలయాధికారులు, విద్యావేత్తలు పూనుకున్ననాడు కాని తొలగని లోపాలు, పరిష్కరింపబడని సమస్యలు కొన్ని ఉంటాయి. అవి పరిష్కరింపబడినప్పుడుగాని విద్యార్థి— ఉపాధ్యాయుల మధ్య గురుశిష్య భావం, సామరస్యం పెంపొందదు. ఆ సమస్యలు పరిష్కరింపబడిననాడు స్త్రీలు మరింత దీక్షతో, ఉత్సాహంతో, కర్తవ్య పరాయణతతో తమ ఉద్యోగ బాధ్యతలను నిర్వహించగలుగుతారు. కేవలం పుస్తకాలలోని పాఠ్య విషయాలను నియమిత కాలంలో బోధించడమే పనిగాకాక విద్యార్థులకు విద్యాభ్యాసం పట్ల శ్రద్ధాసక్తులు కలిగించ గల్గుతారు. సాహిత్యం పట్ల, శాస్త్రవిజ్ఞానంపట్ల వారికి అభిరుచి కల్గించి, సాహిత్యవేత్తలు, విజ్ఞాన పారంగతులు కాగలగాలనే ఆశాంకురాలను వారి చిరు హృదయాలలో నాట గల్గుతారు. ప్రేమతో, అభిమానంతో విద్యా బోధ చేసి వారిని మేధావులను, ప్రతిభావంతులుగను తీర్చి దిద్ది, భావిభారత పౌరులుగా మలచగల్గుతారు.

అయితే గృహిణిగా, తల్లిగా కుటుంబ బాధ్యతలు నిర్వహించే స్త్రీలు, ఆర్థికమైన ఇబ్బందులతోను, కుటుంబంలోని కలతలతోను విద్యార్థుల తమ విద్యా వ్యాసంగంలో శ్రద్ధ చూపలేకపోవచ్చు. కనుక వారి వ్యక్తిగతమైన సమస్యలపట్ల సానుభూతి చూపడం విద్యాలయాధికారుల కనీస కర్తవ్యం. విద్యార్థులు, ఉపాధ్యాయునులు, అధికారులు పరస్పర సహకార, సంఘీభావంతో వ్యవహరించిననాడు విద్యార్థుల శీల స్వభావాలను తీర్చిదిద్దే ఆదర్శ కేంద్రాలుగా విద్యాలయాలు రూపొందగలవు. ఉపాధ్యాయునితోపాటు ఉపాధ్యాయినికూడ విద్యారంగంలో ముందంజ వేయగల్గుతుంది.

ఉపాధ్యాయినిగా పేరుప్రఖ్యాతులు వార్జింప గోరే స్త్రీలు మన ప్రాచీన భారతీయ విద్యలలో మంచి ప్రవేశం గల్గి, ఆధునిక యుగానుగుణమైన విద్యలలో ఆరితేరాలి. విద్యార్థులకు మెళకువలను చేయగోరే ప్రతి విద్యావతి తాను ముందుగా ఉత్తమ శిక్షణ పొందాలి. అప్పుడే అన్ని రంగాలలో వలెనే విద్యారంగంలోను స్త్రీల భవిష్యత్తు ఉజ్వలమవుతుంది.

ఇవి తాను స్వీకరింపబోయే ఉపాధ్యాయినీ వృత్తిని గూర్చి శారద హృదయ సరసిలో కదలాడిన భావనా తరంగాలు. ఏదో జీవితం గడుపడంగాకాక ఏవో ఆదర్శాలు, ఆశయాలకోసం జీవించే మహిళలు అరుదుగా కన్పిస్తారు.

ఏరి కోరి ఉపాధ్యాయినీ వృత్తిలో ప్రవేశించే శారద అమె ఊహాపోహల కనుగుణమైన జీవితం పడయగలదని ఆశించడం మేలుకదా! ★

పంజాబ్ పకోడీ

పంజాబ్, ఉత్తర ప్రదేశం అంతా పకోడీలు పలువిధాలుగా చేసుకుంటారు. ఇంక పకోడీల వ్యాపారం ఉన్న వాళ్ళకి బలేగిరాకీ.... ఈ పకోడీల షాపులు అడుగడుక్కీ కనిపిస్తుంటాయి. పెద్ద హోటలు దగ్గర్నుండీ, ఠేలా (తోపుడు బళ్ళు)లో పకోడీల సరంజామా అంతా కుదుర్చుకుని నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న వ్యాపారి వరకూ రకరకాల పకోడీలు ఘుమాకుటోర్లోచుయ్.... చుయ్.... మనివేస్తుండటమే పని.... ఆ వేడివేడి పకోడీలు అలా చూస్తుండగానే చెల్లిపోతాయి. ఠేలాతో వ్యాపారం అయిందా? ఇంక అంబరిల్లా విలాస్‌లు (గొడుగు క్రింద పకోడీల వ్యాపారం) కోకొల్లలు. వీళ్ళు ఎన్ని రకాల పకోడీలు చేస్తారో చెప్పలేను. ఆ ప్రక్క నుండి వెళ్ళిన వారికి ఘుమ ఘుమ వాసనలతో నోరూరించటమే కాకుండా, అయస్కాంతంలా ఆకర్షిస్తాయి. ఆ దేశం వారు మనలాగా నడిరోడ్డుమీద నిలబడి తినటానికి సిగ్గుపడరు. పెద్ద కార్లుకూడా ఆపి గరమ్ పకోడా తిని మరీ వెళ్తారు. పెద్ద పార్టీలతో ఈ పకోడీల వ్యాపారిని ఠేకా (కంట్రాక్టు) తీసుకుని ఇళ్ళల్లో చేయిస్తుంటారు. ఈ పకోడీలు మన ప్రక్కలా పొట్లాలు కట్టి అమ్మరు. ఎక్కువగా కావాలంటే తూచి అమ్ముతారు. చాలా రకాల పకోడీలన్నాను కదూ! నోరూరుతోందా? అయితే చేసి చూడండి క్రొత్త రకంగా ఉంటాయి.

గోబీ పకోడా (కాలీఫ్లవర్ పకోడీ)

గోబీ పకోడీలు రెండు రకాలుగా చేస్తారు. మొదటిరకం: కాలీఫ్లవరు తెచ్చి శుభ్రపరచి చిన్న ముక్కలు కోసి కడిగి కొద్దిగా నీళ్ళు చల్లి ఉడికించాలి. బాగా ఉడికేక ఒక స్టీలు పళ్ళెంలో వేసి కచ్చా పచ్చాగా, గరిటతో ఎనపాలి. అందులో తగినంత ఉప్పు, కారం, ఇష్టమున్నవారు గరమసాలా పొడి కొద్దిగా వేయాలి. కొత్తిమీర, చిన్న అల్లం ముక్క, వచ్చితే రెండు వెల్లుల్లిపలుకులూ దంచి గోబీ కూరలో వేసి బాగా కలిపి ఉంచుకోవాలి. ఈ కూరలో నీరు ఉండకూడదు. కాస్త గట్టిగా ఉండాలి. ఈ కూరంతా చిన్న నిమ్మకాయ సైజులో ఉండలు కట్టి ఉంచుకోవాలి. తాజా సెనగపిండి జల్లించి, కాస్త ఉప్పు, కారం వేసి గరిట జారుగా (బజ్జీలకి కలిపేటట్లు) కలుపుకోవాలి. స్టౌ మీద మూకుడు పెట్టి మూనె పోసి బాగా మరిగేక రెండు చెంచాల మూనె కలిపి ఉంచుకున్న సెనగపిండిలో వేసి కలిపి, కూరని ఉండలు కట్టి ఉంచుకున్నాంగా? అవి పిండిలో ముంచి బోండా చేసి కాస్త పచ్చగా ఉన్నప్పుడే అన్నీ తీసి పెట్టుకోవాలి. అంటే ఎర్రగా వేగ కూడదు. ఇలా అన్నీ బోండాలూ చేసేక ఒక్కొక్క బోండాని అరచేతితో పట్టుకుని వడలాగు మెల్లిగా తట్టి మూనెలో మళ్ళీ వేయాలి. ఇలా అరచేతిలో నొక్కుతాము కదూ! చుట్టూ చిగుర్లు పగిలి చూసేందుకు తమాషాగా ఉంటాయి. ఇవి వడలాగు తట్టేటప్పుడు మెల్లిగా చేయాలి. గట్టిగా నొక్కితే కూరంతా పైకి వచ్చేస్తుంది. ఇలా తట్టి మళ్ళీ మూనెలో వేసి ఎర్రగా వేయించి వేడిగా ఉన్నప్పుడు సర్వ్ చేయాలి. మధ్యాహ్నం అతిథులు వస్తారనగా ఉదయమే బోండాలు చేసుకుని అట్టే పెట్టుకుంటే వారూ, రాగానే చేత్తో తట్టి మరోసారి వేయిస్తే తొందరగా అయిపోతాయి. ఇటు వేడిగానూ ఉంటాయి. ఈ కూరలో పచ్చి పఠాణీలు కూడా బాగా ఉడికించి కలుపుకో వచ్చును.

రెండో రకం: తాజా కాలీఫ్లవరు తెచ్చి శుభ్రపరచి పెద్ద గుత్తులుగా ఉన్నట్లు చాకుతో కోయాలి. బాగా కడిగి ఉంచాలి. స్టౌ మీద పెద్ద గిన్నెలో నీరుపోసి మరుగుతున్నప్పుడు కడిగిఉంచుకున్న గోబీ గుత్తులు వేసి ఉప్పువేసి మూత పెట్టాలి. గోబీ కాస్త మెత్త పడ్డాక నీరువార్చి గోబీగుత్తులని ఒక పళ్ళెంలో ఉంచాలి. కొత్తిమీర, అల్లం, పచ్చిమిరపకాయలు మెత్తగా దంచి పెట్టుకోవాలి. స్టౌ మీద గిన్నె కాలేసి కొద్దిగా మూనె వేసి గోబీ గుత్తులు, కొత్తిమీరర అవీ నూరిన కారం, వేసి ఇష్టమైతే ఒక చెమ్చా గరమసాలా పొడి, కొద్దిగా ఉప్పువేసి గిన్నెని బాగా కుదిలించాలి. గరిట వాడకూడదు. ఈ మసాలా అంతా గోబీకి బాగా పట్టగానే దించి, మొదట చెప్పినట్లు బజ్జీలకి సెనగ పిండి కలిపి ఒక్కొక్క గోబీ గుత్తినీ తీసి బాగా మరుగుతున్న మూనెలో ఎర్రగా వేయించాలి. ఇవి చూసేందుకుపూలగుత్తిలా పెద్ద పకోడీ ఉంటుంది. పెద్దవిగా గుత్తులు తీసుకుని చితికి పోకుండా ఉడికించాలి. ఉడికించక పోతే లోపల పచ్చిగా, చప్పగా ఉంటాయి. ఈ పకోడీలకి సెనగపిండి కలుపుతాము కదూ అందులో కొంత మంది వాము వేస్తారు.

పచ్చిమిరపకాయ పకోడీలు

బజార్లో పకోడీల కని కాస్త లావుగా పొడుగ్గా ఉన్న పచ్చిమిరపకాయలు అమ్ముతారు. ఇవి అట్టే కారం ఉండవు. ఇవి తెచ్చుకుని కడిగి ఒక సూదితో మిరపకాయకి ఒక ప్రక్క పొడుగ్గా గంటు పెట్టాలి. కొంచెం ఉప్పు, ధనియాల గుండ రెండూ కలిపి ఒక ప్లేటులో ఉంచుకుని అన్ని మిరప కాయలలో ఈ పొడి కూరాలి. సెనగపిండి తగినంత ఉప్పువేసి కలిపి మరిగిన మూనె వేసి పచ్చిమిరపకాయ ముచ్చిగ పట్టుకుని పిండిలో ముంచి వేయాలి. వేగాక పచ్చిమిరపకాయ ఆకారంలో పైకి ముచ్చిగ కనిపిస్తూ ఉంటుంది.

పాలక్ పకోడా

పాలకూర అని పెద్ద ఆకులుంటాయి. అవి తెచ్చి శుభ్ర పరచి సన్నగా తరుక్కుని బాగా కడిగి చిల్లుల పళ్ళెంలో వేయాలి. నీరు అంతా పోయాక ఒక గిన్నెలో వేసి తగినంత సెనగపిండి, ఉప్పు,

కారం, చిటికెడు సోడా, (బజార్లో కిరాణాషాపుల్లో ఎండు దానిమ్మగింజలు దొరుకుతాయి. నోట్లో వేసుకుంటే పుల్లగా ఉంటాయి) ఈ గింజలకి అనార్ దానా అంటారు. ఇవి ఏ నాలుగు చెమ్చాలు తెచ్చి బాగు చేసి ఒక్కసారి కడిగివేస్తే బాగుంటాయి. ఇవన్నీ వేసి మరుగుతున్న నూనె రెండు చెమ్చాలు వేసి గట్టిగా కలపాలి. ఈ పకోడీం పిండికి సాధారణంగా నీరు అక్కరలేదు. ఆకు కూర కదూ ఉప్పు, కారం, తగలగానే నీరు వూరు తుంది. గట్టిగా కలిపిన పిండిని పకోడీలు చేసుకోవాలి. అనార్‌దానా వెయ్యటం వల్ల పకోడీలు వములుతుంటే మధ్య మధ్య చిరుపులుపుతో బాగుంటాయి.

ఉల్లిపాయ పకోడీ

ఉల్లిపాయలు సన్నగా చెక్కు తరుక్కోవాలి. పచ్చిమిరకాయలు కూడా సన్నగా తరుక్కుని కలపాలి. గుప్పెడు ధనియాలు బాగుచేసి ఉల్లి చెక్కులో కలిపి ఉప్పు, కారం, చిటికెటు సోడా, కొద్దిగా మరుగుతున్న నూనె వేసి, సెనగపిండి అన్నీ కలిపి నీళ్ల చుక్కలు జల్లి గట్టిగా పిండి కలిపి పెద్దవిగా పకోడీలు వెయ్యాలి. ధనియాలు వేగి మంచి సువాసనతో ఉంటాయి. ఉల్లి చెక్కు బాగా ఉండాలి. ఇలాగే చాలా రకాలు చేస్తారు. వీటిల్లో పొదీనా చట్నీ ఉంటుంది.

ఒక కట్ట పొదీనా తెచ్చి శుభ్రంగా కడిగి, తగినంత ఉప్పు, పచ్చిమిరపకాయలు, పులుపుకి ఎండు దానిమ్మ గింజలు వేసి మెత్తగా గరిట జారుగా రుబ్బుకోవాలి. మనం పులుపుకి చింతపండు వెయ్యొచ్చును.

ఇంకోచట్నీ, చింతపండు నానవేసి చిక్కగా పులుసుతీసి తగినంత బెల్లం, ఉప్పు, కారం, పొంగి డి వేసి వాడుకుంటారు.

ఎం. సుగుణ.★

సవరణ

గత సంచికలో 6వ పేజీలోని "దేశఐక్యతను సాధించిన ప్రజా నాయకుడు కామరాజ్" వ్యాసంలో 16వ పంక్తిలో ప్రారంభమయ్యే వాక్యాన్ని యీ దిగువ విధంగా చదువుకో మని మనవి: 'అటువంటి భావని భారతదేశానికంతా అధికార భాష చేయరాదని చూసేవారు దేశయికమత్యానికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారనే అనాలి.' సం॥


గులాబిముల్లు
జి. హనుమంతరావు

కిటికీదగ్గిర నిలబడి దూరంగా కొండ మీద బండలకేసి చూస్తోంది ఉష. మర్నాడు ఆమెని చూడ్డానికి వస్తాడు రావు.

సాయంకాలం అయిదు గంటలు. నీరెండలు కన్నని తుంపర. వీధిలో మేడలు, ఇళ్ళు, మనుషులు అంతా అందంగా కనబడుతోంది.

రావు గురించి ఉష చాలా వింది.

ఉష అన్నయ్య రామానికతను యూనివర్శిటీలో రెండేళ్ళు సీనియర్ కాబట్టి అతనికితను తెలియక పోయినా అతను ఇతనికి బాగా తెలుసు. పైగా యూనివర్శిటీ హీరోల్లో రావు ఒకడు. ఎలాంటి విషయం పైనైనా ధీమాగా పది పదిహేను నిమిషాలు మాట్లాడగల సత్తా ఉన్నవాడు గాబట్టి పంచవర్ష ప్రణాళిక లోటుపాట్లని గురించినా, భారత సంస్కృతి పైన పాశ్చాత్య ప్రభావం గురించినా అతన్నే మాట్లాడమనేవారు. మాట్లాడ్డ మొక్కటే కాదు; ఇంగ్లీషు, తెలుగు రెండిట్లో సమానంగా వ్రాయ గలడు. యూనివర్శిటీ మాగజీన్ ఎడిటర్‌కి అతనంటె మంచి అభిప్రాయం ఉండేది. మాగజిన్ నిండా అతని కథలు, గేయాలు, వ్యాసాలు, ఇంగ్లీషులో, తెలుగులో మొత్తం నాలు గయిదు దాకా అచ్చయేవి. బయట ఇతర పత్రికల్లో కూడా రాస్తాడంటారు. అవన్నీ అలా ఉంచి ఎవరేం అడిగినా, మాట్లాడినా మర్యాదగా నవ్వుతూ మాట్లాడతాడని పేరు. అందులో అతని పై చదువు, పలుకుబడి వగైరా అంతరాలు పాటించడు కాబట్టి అంతా అతనికి గౌరవమిచ్చేవారు.

ఉష నవ్వుకుంది. రామం భట్రాజులా అతన్ని తెగ పొగుడుతాడు ఆ సందర్భం వచ్చినప్పుడల్లా. అతనంటే ఇతనికి చాలా మంచి అభిప్రాయమన్న సంగతి తెలుస్తూనే ఉంది. ఆ పరిస్థితిలో కొంత కాలం కొట్టేసినా, కొంత వరకు అతనిలో పైన చెప్పినవి కొద్దిగా మిగులుంటాలి.

ఉష కిటికీ కమ్మీ మీద చేతులాన్చి అతని స్వరూపాన్ని వూహించుకుంటోంది. అతని గురించి విన్నవన్నీ నిజమయితే మామూలు అందరి కన్నా ఒక మెట్టు పైనుండాలి ఆతను. ఉష దృష్టిలో మనుషులంతా ఒకటే. ఒకడిలో ఒక గొప్పతనం ఉంటే దానికి విరుగుడు ఏదో చెడు తప్పని సరిగా అంటి పెట్టుకునుంటుంది. అంతా మంచే అయితే వీళ్ళంతా 1964 మార్కు పాంటు, షర్టు తొడుక్కున్న రాముడో, బుద్ధుడో అవుతారు!

ఏమయినా, అతను వక్త, రచయిత కావడంతో అసంభవం ఏం లేదు. అయితే అతని పూర్తి వ్యక్తిత్వాన్ని గుర్తులో పెట్టుకుని ఆలోచించి నప్పుడు ఈ గుణాల విలువ, మిగతా వాటిలో తూకం వేసి చూస్తే ఎంత అన్నది ప్రశ్న.

ఏమిటో వెర్రిమొర్రి ప్రశ్నలూ అంత కన్నా వెర్రి సమాధానాలు మెదడ్ని పాడు చేస్తుంటాయి. అలా యెదురుగా రాతి బండల కేసి బడిలేగా చూస్తూంటే.

* * *

ఆ రాత్రి డాబా మీద వెన్నెట్లో మంచం మీద వెల్లకిలా పడుకొని నక్షత్రాలు లెక్క పెడ్తోంది ఉష. సాయంకాలం కురిసిన జల్లు తాలూకు చల్ల గాలి ఒంటికి గిలిగింతలు పెడ్తోంది. ప్రక్కింటి రేడియో తియ్యని గొంతుతో కమ్మని పాటని విని పిస్తోంటే అదొక రంగుల కలలాగుంది.

రెండు రోజుల క్రితం ఉమ వాళ్ళింటికి వెళ్ళింది ఉష. ఉమ అక్కయ్యకి అతను అయిదేళ్ళు క్లాస్‌మేట్. ఆ తర్వాత కూడా అతను యూనివర్శిటీలో చదివిన నాలుగేళ్ళూ ఆమె కూడా పూర్ణిమ వే మరో చోట చదువు తూండేది కాబట్టి బాగా తెలుసు.

ఉషని రావుకియ్యబోతున్నారని పూర్ణిమకి చెప్పినప్పుడు ఆమె అభినందించింది. ఆ తర్వాత అతని గురించి అడక్కుండానే చెప్పుకు పోయింది. పూర్ణిమది మరో కోణం.

రావు చాలా చిత్రమైన మనిషి. అతన్ని చిన్నప్పట్నుంచీ ఎంతో బాగా ఎరిగున్న వాళ్ళకి కూడా అతనర్థమవడు. ఎప్పుడేం మాట్లాడ్తాడో ఏం చేస్తాడో అతని ప్రాణస్నేహితులకి కూడా తెలియదు. అసలతనికైనా తెలుసా అన్నది అనుమానం.

ఒక రకంగా చూస్తే అతను ఇద్దరు భిన్న ప్రకృతులున్న మనుష్యుల కలయిక అనిపిస్తుంది. ఒకరు, నలుగురితోనూ చాలా స్వేచ్ఛగా మాట్లాడతాడు. నవ్వుతాడు. స్కూల్లో, కాలేజీలో బాగా అల్లరి చేసేవాడు. అతని కెప్పుడూ నవ్వడం, నవ్వించడం అలవాటు. ఒకోసారి స్వంత వినోదం కోసం ఎదటి వాళ్ళ ఇబ్బందుల్ని కూడా గమనించని కొంటె స్వభావం అతనిది. ఒక రకమైన తెగింపు, నిర్లక్ష్యం, అతనంటే మిగతా వాళ్ళకి కొంత భయం పుట్టిస్తాయి కూడా.

ఇక రెండో మనిషి. ఎవరితోనూ మాట్లాడడు. మాట్లాడినా త్రుంచేసి అక్షణానిక్కావల్సిందేదో అంత వరకే మాట్లాడతాడు. ఎదటి మనిషి యెంత తంటాలు పడ్డా అతని చుట్టూ గీసుకున్న పరిధి దాటి బయటికి రాడు. ఆలోపలికి యెవర్నీ రానివ్వడు. ఆఖరికి అతని అతి సన్నిహితులయిన ఆత్మీయులకి కూడా ఆ లోపలి గూటిలోకి జొరడానికి వీలు దొరకదు. అందులో అతనికి అతనే అన్నీ. నిజానికి అతనెంత ఒంటరివాడో, అతని కసలు ఆత్మీయులంటూ ఉండడం సంభవమా అనిపిస్తుంది. ఒక్కోసమయంలో పరిస్థితుల్ని బట్టి ఒకరితో అతను అతి సన్నిహితంగా తిరిగి తన ఆలోచనలు, అభిప్రాయాలు పూర్తిగా వెలిబుచ్చి ఉండవచ్చు. కాని ఆ తర్వాత ఏం చేసిందీ, ఎలా ఉన్నదీ, ఏం తెలియదు. మిగతా వాళ్ళందరిలాగే అతనూ కేవలం మామూలు పరిచయస్థుడుగా తేలి పోతాడు. ఒక్కోసారి అతని ముభావం, నిరసన, తృణీకారమేమో అనిపించి కొందరికి కోపం కలిగిన సందర్భాలు కూడా లేక పోలేదు.

తమాషా యెక్కడంటే అతనిలోని ఈ యిద్దరూ ఉన్నట్టుండి స్థలాలు మార్చుకోడం. ఎప్పుడే ధోరణి వస్తుందో చెప్పటం కష్టం. బాగా మాట్లాడుతున్నవాడే ఉన్నట్టుండి బిగిసి పోడం అతన్ని బాగా తెలిసిన వాళ్ళందరికీ అనుభవం.

అతనిలోపల యెక్కడో చిన్న గూడు. ఆ గూటిలోంచి అతను బయటికి వచ్చినప్పుడు ఈ లోకంలో యెవర్నీ లెక్కచెయ్యనంత ధీమాగా మాట్లాడతాడు, నడుచుకుంటాడు. ఏదయినా అతనను కున్నది తానికి కొద్దిగా భిన్నం జరిగితే, గూటిలోకి పారిపోవడం, తలుపులు బిగియడం, ఇంక యెవరికీ తెలియనంత కాలం ఆ లోపల్లోనవలె బ్రూక్ అవడం మామూలు.

అతనసలు యెన్నటికీ యెవరికీ అర్థం కాడు. వాళ్ళు అపార్థం చేసుకుంటున్నారని అతనికి తట్టదేమో కూడ. తట్టినా లెక్కచేసే రకం కాడు. తనకి తానే స్నేహితుడు. అంత ఒంటరిగా యెలా ఉండగలడా అని తల్చుకుంటే బాధగా ఉంటుంది.

పూర్ణిమ మనస్తత్వ శాస్త్రం కొంత చదువుకుంది కాబట్టి అతని నున్నితాల్ని నిశితంగా చర్చించి విడబర్చింది. అయితే అవన్నీ ఉషకి కొంతవరకు పూర్ణిమ చమత్కారంగా మాత్రం అర్థమయ్యాయి. ఏదో కథలో చదివింది రెండు పరస్పర వ్యతిరేక స్వభావాలున్న వ్యక్తులు ఒకే మనిషిలో ఇమడ్డం. కాని కల్పనగా అది మెచ్చుకో గలిగినా వాస్తవంలో అలాంటివి నమ్మడం కష్టం. మామూలుగా మనకి తారసిల్లే రామారావు, సుబ్బారావు, వెంకట్రావు వీళ్ళంతా రెండే స్పష్టమయిన రకాలు. ఒకటి, వెకిలిగా గోలచేసే రకం. రెండు, మత్తుగా మూగగా ఎక్కడో మరోలోకంలో ఉండే రకం. ఈ రెంటి మధ్యరకాలు ఉండ వచ్చుగాని పూర్ణిమ చెప్పినట్టు జరగడం వింతగా అనిపిస్తుంది.

ఉష ఆలోచనలు గొలుసుకట్టుకుని సాగుతున్నాయి. అతను నిజంగా అలాంటివాడా? ఏ మనిషి స్వభావమయినా గీతలు గీసి అరలు కింద విభజించి అంచనా కట్టడం అలా చేసే వాళ్ళ నేర్పుకి చిహ్నం కావచ్చుగాని వాస్తవానికి దూరం ఆమె దృష్టిలో. మొత్తానికి పూర్ణిమకి అతనంటే చాలా మంచి అభిప్రాయం ఉంది. అది దాచిపెట్టి నిష్పక్షపాతంగా కనబడాలని ఏదో మాటల గారడీ చేసింది కాని అతని యెడ ఆమె గౌరవం, అభిమానం దాగలేదు. అందుచేత ఆమె కూడా రంగుటద్దాల్లోంచే రావుని అంచనా కట్తోందని చెప్పాలి!

ఉష తను విన్న రకరకాల విశేషాల్ని బట్టి చిత్రించుకున్న బొమ్మల్ని దగ్గిరకి చేర్చి రావు పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని వూహిస్తోంది. వూహించిన కొద్దీ ఆమెలో అశలాంటి తృప్తి రగిలింది

* * *


మర్నాడుదయం.

గదిలో కూర్చొని "నారాయణరావు" పేజీలు తిరగేస్తోంది. పదేళ్ళ వయుస్సులో పుస్తకాలు చదవడం అలవాటయిన కొత్తలో 'నారాయణరావు' అద్భుతమయిన నవల అనిపించింది. అలాంటి పుస్తకం ఈ ప్రపంచంలో ఉంటుందాని అనుమానమేసింది. అదే పుస్తకం ఇప్పుడు పేజీ చదవడానికి వారం పడుతుంది.

క్రితం మధ్యాహ్నం బాబాయి రావుని గురించి చెబుతుంటే తలుపుచాటున ఏదో సవరిస్తూ నిలబడి వింది ఉష. రావు పని చేసే చోట అతన్ని ఇంటి దగ్గిర కలుసుకుని మాట్లాడాడు బాబాయి.

అదొక చిన్న బంగళా. చుట్టూ విశాల మయిన యార్డు. యార్డు బయట కాంపౌండ్ వాల్, అందంగా కట్టిన స్తంభాలు, గేటు. లోపల గోడ నానుకుని చుట్టూ ఎర్రమెట్ట తామర పూలగుత్తులు, మరో గోడకట్టాయి. లోపల కీన్యా గ్రాస్‌లాన్సు, లాన్సు చుట్టూ లైన్ క్రోటన్సు

మీ చర్మానికి తగినది



నివియా

ఇదే మీ చర్మానికి కావలసినది

నివియా క్రీమ్‌లో "యూసెరిట్" — అద్వితీయమైన, సహజ ప్రకృతి పదార్థము వంటిది ఉన్నది. రోజూ స్నానం వల్లను, ఎండ, వాన, గాలిలో తిరుగుచుండుట వల్లను కోల్పోవునట్టి మీ చర్మ మందలి చమురులను అది సమకూర్చుతుంది. నివియా మీ చర్మాన్ని మృదువుగాను, యౌవనయుక్తమైన ఆరోగ్య వంతంగాను వుంచుతుంది. మీ చర్మానికి వాడదగినది. నివియా, ఇప్పుడే!

నివియా — వివిధోపయుక్తమైన క్రీమ్.

S&N



ఇండియాలో సోల్ డిస్ట్రిబ్యూటర్లు: జె. ఎల్. మారిసన్, సన్ & జోన్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, పోస్టు బాక్సు నెం. 1746, బొంబాయి-1

04—7—64

మధ్య దారిలా వేసిన సిమెంటు పేవ్‌మెంటుకి రెండు వైపులా రెండు లాన్లతోనూ మధ్యగా రెండు సైప్రస్ చెట్లు. ముందు వరండా చుట్టూ దారికి రెండు వైపులా కుండీల్లో క్రోటన్సు. నిరాడంబరంగా, అందంగా ఉంది యార్డు, ముందు గుమ్మం మీద మనిషిడే గీసిన "చిరయాత్రికుడు" వర్ణ చిత్రం చక్కటి ఫ్రేంతో వేళ్లాడుతోంది. కిటికీలకి, గుమ్మానికి నీలిరంగు తెరలు అందాన్ని రెట్టింపు చేస్తున్నాయి.

డ్రాయింగు రూం కాకుండా మూడు గదులు, బాత్, టాయిలెట్ వగైరా, వెనక యార్డులో మల్లె పందిరి, నైట్‌క్వీన్, గులాబీలు, డ్రాయింగు రూం గోడలు, సీలింగు, ఆకాశం రంగు డిస్టెంపర్ కొట్టి ఉన్నాయి. గది నిండా బాగా ఫ్రెంచి పాలిష్ రుద్దిన రోజ్‌ఉడ్ ఫర్నిచర్, ప్లాస్టిక్ కవర్లు, పూల వాజ్‌లు. మూడు గోడల్ని యెత్తుగా భాక్రా, చంబల్ ప్రాజెక్టుల వర్ణ చిత్రాలు తగిలించి ఉన్నాయి. మరో గోడని అజంతా ఫ్రెస్కోల తాలూకు పన్నెండు పేజీల కాలెండరు. రాక్ నిండా అయిదారు వందల పుస్తకాలు తెలుగు, ఇంగ్లీషు సాహిత్యాల ప్రతినిధు లనతగినవి.

బాబాయి వెళ్లేప్పటికి రాత్రి యెనిమిది కావస్తోంది. బయట లాన్లో రెండు పేంకుర్చీలు, టీపాయ్ వేసి ఉన్నాయి. ట్యూబ్‌లైటు కాంతుల్లో డ్రాయింగ్ రూం నీలిగోడలు మరీ కాంతి వంతంగా కనిపిస్తున్నాయి. లివింగ్ రూంలో, జీరో కాండిల్ బల్బు కాంతిలో రేడియో సన్నగా తగ్గించి వింటున్నాడతను. ఆ ఇంట్లో అతను ఒక్కడే. నౌకరు ప్రొద్దున్నే వచ్చి రాత్రి ఎనిమిదింటి దాకా ఉండి కావాల్సిన వన్నీ అమర్చి పోతూంటాడు.

ఆ ఇల్లొక స్వప్న సీమ. దానికి రాజు అతను! నిజం చెప్పాలంటే బాబాయికి అసూయ పుట్టింది!

ఉష జడని మెలిపెడ్తూ తమాషాగా నవ్వుకుంది.

అసలు గొడవ, బాబాయి ఒక ఆర్టిస్టు. ఆయనకి దేన్ని చూసినా కళాదృష్టి తప్పించి మరోదృష్టి ఉండదు. మామూలు పరిసరాలే మరోలా కనబడతాయి. ముఖ్యంగా మనం మంచి అభిప్రాయంతో వెళ్ళినప్పుడు మనకళ్ళకి రంగుటద్దాలు తగిలించి నట్టవుతుంది. ఆ తర్వాత ఏం చూసినా అన్నీ మన ఆలోచనల ఫ్రేంలోకి ఇమిడి పోతాయి.

కొంత అతిశయోక్తి ఉన్నా మొత్తానికి అబ్బాయి రసికుడు అన్న మాట! పక్క మీద మల్లెపూలు జల్లుకోడం, బట్టల్ని, పంటిని సెంట్లు పూసుకోడం కూడా ఉందేమో! ఉష నవ్వుకుంటూ మనసులో ఒక రూపాన్ని చిత్రించుకుంది.

వెన్నెల. కొండ మీద విశాలమైన పరిసరాల్లో చిన్న అందమైన ఇల్లు. పడక గదిలో జీరోవాల్టు బల్బు తప్పించి ఇల్లంతా చీకటి. నైట్‌క్వీన్ మల్లె వాసనలు కలిసి పోయి ఒకటి తర్వాత ఒకటి చల్ల గాలి కెరటాలమీద తేలివస్తూంటాయి రేడియోలో తలత్‌మహమూద్ ఒకటే తీయగా సన్నగా వినిపిస్తూంది. లాన్లో పేం కుర్చీలో సాగిలబడి అతను ఒక్కడూ, సిల్కు లాల్చీ, పైజామా గాలి అంచుకే కదులుతూంటాయి. ఏకాంతం.

ఎలా ఉంది ఆ దృశ్యం?

సినిమాసెట్‌లాగుంది! కాని అతని గురించి విన్నదంతా నిజమైతే అలాగే ఉండాలి మరి! పెద్ద చదువు, మంచి ఉద్యోగం, ఉన్నదనుభవించ డానికి తగిన లక్షణాలు, నేర్పు ఉన్నప్పుడు జీవితం కలగా మారిపోవడంలో ఆశ్చర్యం లేదు.

* * *

ఆ సాయంకాలం అతను వస్తాడు. అతనికి మామూలు రకం పెళ్లి చూపుల్లో నమ్మకం లేదుట. పది మంది చుట్టూ కూర్చుని వింతగా చూస్తోంటే అతను గాని ఆమె గాని మామూలుగా ఉండలేరు గాబట్టి అతను, ఆమె ఇద్దరే కొద్దిసేపు దూరంగా ఉండాలన్నాడు. ఉష మొదట్లో కొంచెం ఇబ్బంది పడ్డా చివరికి వప్పుకుంది.

అతని వ్యక్తిత్వంతో పోల్చి చూసుకున్నప్పుడు తను హీనంగా అనిపిస్తే భయపడాలి గాని, తనలో ఏ లోపం లేనప్పుడు, ఇలాంటి 'చూపులు' చాలా భరించవచ్చు. చిన్నప్పట్నుంచి ఆమెకి అందాలరాణి అని పేరు. పెద్దయాక చుట్టాలన్న వాళ్లంతా ఆమెకి తగిన వాడెవడై ఉంటాడని వూహాగానాలు చేసి, వూరుకోక వెతకడం ప్రారంభించటం ఒక విధంగా ఆమె ఖ్యాతికి బుజువు. మామూలు కన్నా యెక్కువే చదివింది. కాలేజిలో కొందరు రసపిపాస యెక్కువవున్న అబ్బాయిలు ఆమె పేరుతో నాయికల్ని సృష్టించి కథలు, పాటలు రాసి పేరు తెచ్చుకున్నారు గూడా. వేదిక లెక్కి ఉపన్యాసాలియ్యడం రాక పోయినా శ్రావ్యంగా పాడగలదు. ఆధునిక సినిమా వలపు పాటల్నుంచి పాతకాలం కృతులు, కీర్తనలు దాకా చాలా వచ్చు. వీటన్నిటినీ మించి ముఖ్యమైనది, అతన్ని పందరూపాయిల నోట్లతో తూచి కొనగల డబ్బుంది నాన్నకి. ఆమె ఒక్కతే కూతురు.

సాయంకాలం వరకు ఉష వూహాగానాలు చేస్తూనే ఉంది. అతనెలా తయారయి వస్తాడు, ఏం మాట్లాడతాడు. ఏం సమాధానాలు ఎలా చెప్పాలి, సింపిల్‌గా కనబడితే మంచిదా, కాస్త యెక్కువగా ముస్తాబవడమా, అతనికేది ఇష్టం, ఏ పాట పాడాలి— ఇవన్నీ సరయిన సమాధానాలు దొరకని ప్రశ్నలు. ఎంత ఆలోచించినా తెగింపు ఉండదు. చివరి క్షణం వరకు ఆమెలో ఆమెకే ఖచ్చితమైన అంగీకారం కుదర లేదు.

తన అందాన్ని చూడగానే అతను ముగ్ధుడవుతాడు. ఆ తర్వాత తన పాట అతన్ని ఈ లోకానికి చాలా దూరం తీసుకు వెళ్తుంది. లోకంలో తన లాంటి, తనతో సాటయిన వాళ్ళు ఇంకా చాలా మంది ఉన్నారని అతనికి తెలిసిరావాలి! ఉష ఏమేమిటో వూహించుకుంటోంది. అతని ముందు తను తక్కువగా అనిపించుకోకుండా ఉండాలంటే తన గొప్పతనాన్ని తను బుజువు చేసుకోవాలి.

కారు అతనికోసం హోటలుకి వెళ్లింది. మేడ మీద కిటికీ తలుపులు ఓరగా మూసి నిలబడ్డారు, ఉషా, ఉమా. ప్రతిక్షణం ఆత్రుతని యెక్కువ చేస్తూంది.

కారు ఆగింది. ముందు రామం దిగాడు, ఆ తర్వాత అతను.

రావు ఆరడుగులు పొడుగు లేడు. చామనచాయ, తెల్ల పాంటు, తెల్లషర్టు, ఎర్ర నైలాన్ టై, ఎర్రబూటు— చాలా సాదాగా కనిపించాడు.


రావు లోపలికి వచ్చిన అయిదు నిమిషాలకి ఉషని కిందికి పిల్చారు. హాల్లో అతని కెదురుగా కూర్చొని అందరితో బాటు టీ వగైరా కానిచ్చింది.

పావు గంట గడిచాక అతను టైం చూశాడు. అది గుర్తయినట్లు అంతా లేచారు. అతను, రామం ముందు వెళ్లారు. వెనక అమ్మ ఏవో రహస్యంగా సలహాలు ఇస్తుంటే, ఉమ కొంటెగా నవ్వుతుంటే ఉష వెళ్లి కార్లో ముందు కూర్చుంది. అతనే డ్రైవ్ చేశాడు. కార్లో ఇంకెవరూ లేరు.

కారు కదిలింది.

ఉష నిర్లిప్తంగా అద్దంలోంచి బయటికి రోడ్డుమీదికి చూస్తోంది, బయటి వేడి మెదడు కెక్కడం లేదు. అతనడగబోయే ప్రశ్న లన్నిటిని వూహించి, సమాధానాలు సిద్ధంగా ఉంచుకుంది. అటు నుంచి అవి రావడం తరువాయి, తిరిగి సమాధాన మివ్వడం క్షణాల మీద జరిగి పోతుంది. పాట

30 వ పేజీ చూడండి



24-7-1964 శుక్రవారము మొదలు 30-7-1964 గురువారము వరకు

మేషం :

(అశ్వని, భరణి, కృత్తిక 1 పా.)

ఈ వారం గత వారంకంటే బాగా ఉంటుంది. ఆర్థిక వ్యవహారాల్లో ఇదివరకు ఏర్పడిన అనిశ్చిత పరిస్థితి తొలగి పోతుంది. వృత్తి వ్యాపారాల్లో క్రమాభివృద్ధిని సాధిస్తారు. సాహసముతోకూడిన వ్యవహారాల్లో నష్టం రావచ్చును. వృత్తిలో సాటివారితో పోటీ పెరిగినా మీ కార్యక్రమానికి భంగం కలగదు. ఉద్యోగంలో పలుకుబడి లభిస్తుంది. మీకు ఎంత ఇష్టం లేకపోయినా స్నేహితుల వ్యవహారాల్లో జోక్యం కలుగజేసికొనవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ఆరోగ్యం బాగానే ఉంటుంది. కుటుంబ వ్యవహారాలు సంతృప్తి కరంగా ఉంటాయి.

స్త్రీలకు—ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. కుటుంబవ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. పుణ్య కార్యాలు చేస్తారు.

వృషభం :

(కృత్తిక 2, 3, 4 పా, రోహిణి, మృగ 1, 2 పా.

ఈ వారం ప్రారంభంలో ఆకస్మికంగా కొన్ని చికాకులు రావడం వలన మిగిలిన కాలమంతా ఆ చికాకులను తొలగించుకొనడంలో సరిపోతుంది. అందుచేత వృత్తివ్యాపారాల్లో చెప్పతగిన అభివృద్ధిని సాధించడానికి అవకాశం ఉండదు. ఇంతవరకు వ్యాపారంలో మీ పట్ల ఉదాసీనంగా ఉండేవారు కూడా గౌరవాన్ని ప్రదర్శిస్తారు. ఉద్యోగంలో అధికారుల ఆదరణ లభిస్తుంది. మీరు ఇదివరకు చేసిన వాగ్దానాల వల్ల ఆర్థికంగా కొంత ఒత్తిడి రావచ్చును. ఆరోగ్యం వారం మధ్యనుంచి బాగా ఉంటుంది. భిన్నాభిప్రాయాలు గల బంధువులను ఒకదారికి తీసికొని రాగలరు.

స్త్రీలకు—వారం ప్రారంభంలో ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం సాంఘిక వ్యవహారాల్లో వ్యయం జరుగుతుంది.

మిధునం :

(మృగశిర 3, 4 పా ఆర్ద్ర, పునర్వసు, 1, 2, 3 పా.)

ఈ వారం వృత్తి వ్యాపారాల్లో హడావుడి ఆర్భాటం తప్ప చెప్పతగిన ఫలితమేమీ ఉండకపోవచ్చును. అధికారులవలన జరిగే పనులకు ఆటంకాలు వచ్చేసూచనలు ఉన్నాయి. వ్యాపారవిస్తరణ ప్రయత్నాలు అంత ప్రోత్సాహకరంగా ఉండవుగాని భాగస్వాములతో కలసిచేసే వ్యాపారాలు బాగా ఉంటాయి. ఉద్యోగంలో పెద్ద మార్పులు రావు. స్థిరాస్థి వ్యవహారాల్లో అనుకూలమైన మార్పులు వస్తాయి. ఆరోగ్యం సంతృప్తికరంగా ఉండదు. రాజకీయవ్యవహారాలు పైకి ప్రశాంతంగా కనిపించినా ఏ మాత్రం ఏమరుపాటు చూపినా నష్టం తప్పదు. పజ్జనుల సహవాసం లభిస్తుంది.

స్త్రీలకు—ఆరోగ్యం సంతృప్తికరంగా ఉంటుంది. కుటుంబ వ్యవహారాలు నిరాటంకంగా నెరవేరుతాయి.

కర్కాటకం :

(పునర్వసు 4 పా, పుష్యమి, ఆశ్లేష.)

వృత్తి వ్యాపారాల్లో కొన్ని అవకాశాలు ఇంద్ర

	మీ	మే	వృ	మి
			గు	కు శు రా
	శ	వారఫలం మహేష్		ర
	చం			బు
	కే			

ధనుస్సు వలె కన్పిస్తాయి గాని వాటిని గురించి ప్రయత్నం చేయుటంవలన ప్రయాస తప్ప ప్రయోజనం ఉండదు. వృత్తిలో స్వల్పంగా ఆదాయం పెరగడానికి అవకాశం ఉంది. ఉద్యోగరీత్యా మీరు కొంతమంది అవాంఛనీయులైన వ్యక్తులకు సన్నిహితంగా ఉండటం వలన ఇతరులు మిమ్ములను అపార్థంచేసికొనవచ్చును. ఏదో ఒక విధంగా డబ్బు ఎప్పుడూ అందుతూ ఉండడం వలన ఈవారం ఇబ్బంది లేకుండా గడచిపోతుంది. కోర్టు వ్యవహారాల్లో మీ ప్రతిపక్షం బలహీనపడగల సూచనలు ఉన్నాయి. ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది.

స్త్రీలకు— వారారంభంలో ఆరోగ్యం అంత బాగా ఉండదు. విలువైన వస్తువులు కొంటారు. బంధువుల్లో గౌరవం లభిస్తుంది.

సింహం :

(మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)

ఈ వారంకూడా గతవారం వలెనే ఉంటుంది. అన్ని వ్యవహారాలూ ఒడుదుడుకులులేకుండా గడచిపోతాయి. సాహసంతో కూడిన వ్యవహారాల్లో కూడా స్వల్పంగా లాభించగల సూచనలు ఉన్నాయి. వ్యాపారంలో మీ ఆలోచనలు మీకే కాకుండా మీ మిత్రులకుకూడా ఉపకరిస్తాయి. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. ఉద్యోగంలో మీ అభిప్రాయాలను అమలు జరుపడానికి అవకాశం లభించడంవలన మీశక్తి సామర్థ్యాలు రుజువు కాగలవు. వారాంతంలో ఆరోగ్యం పట్ల శ్రద్ధ చాలా అవసరం. సాహిత్య వైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

స్త్రీలకు—ఆరోగ్యం సంతృప్తికరంగా ఉంటుంది. కుటుంబ కార్యక్రమములు బాగా ఉంటాయి. శుభ కార్యాల విషయంలో అభివృద్ధిని సాధిస్తారు.

కన్య :

(ఉత్తర 2, 3, 4 పా, హస్త, చిత్త 1, 2 పా.)

ఈ వారం ఇతరుల దృష్టిలో మీకు యోగవంతమైనదే కాని, మీకు వ్యక్తిగతంగా అంత బాగా కన్పించక పోవచ్చును. ఎప్పుడూ పది మందితో కలసి తిరగడం అందరూ మీ మాటకు ఓహో అనడం జరుగుతుంది కాని దానివల్ల మీకు ఒరిగేదేమీ ఉండదు. వృత్తి వ్యాపారాల్లో విశేషమైన ప్రయాస మీద స్వల్పాభివృద్ధిని సాధిస్తారు. రావలసిన డబ్బు సకాలానికి అందక కొంత ఇబ్బంది కలుగుతుంది. ఉద్యోగంలో మిమ్మల్ని ముఖస్తుతి చేస్తూ మీ ద్వారా

—ఈ వారము ధరలు—

ధాన్యంధరలో ఒడుదుడుకులు రావచ్చును. అపరాల ధరలు కొంచెం తగ్గుతాయి. మిర్చిధర కూడా కొంచెం తగ్గుతుంది. వారారంభంలో పసుపు ధర పెరగవచ్చును. నువ్వులు, నూనె ధరలు కొంచెం పెరిగి తరువాత తగ్గవచ్చును. అలంకార వస్తువుల ధరలు పెరగవచ్చును.

తమ పనులు నెరవేర్చుకొనడానికి చూచే వ్యక్తులతో వ్యవహరించవలసి వస్తుంది. ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి. అలంకార వస్తువులు కొంటారు.

తుల :

(చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ,)

ఈ వారం శుభాశుభ మిశ్రమంగా ఉంటుంది. వృత్తి వ్యాపారాల్లో వారారంభంలో స్వల్పాభివృద్ధిని సాధించగల అవకాశం ఉంది. కాని వారాంతంలో జరిగే వ్యవహారాల్లో అనవసరమైన వ్యయ ప్రయాసలకు గురి కావడం వలన మొత్తం మీద ఈ వారం సంతృప్తికరంగా ఉండకపోవచ్చును. రావలసిన డబ్బు సకాలమున అందుతుంది. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం రావచ్చును. ఉద్యోగంలో పరిస్థితి సాధారణంగా ఉంటుంది. వృత్తి రీత్యా ప్రయోజనంలేని ప్రయాణాలు చేయవలసి వస్తుంది. ఆరోగ్యం ప్రస్తుతం బాగా ఉన్నా నిర్లక్ష్యం చేయ తగదు. పుణ్యకార్యాలు నిరాటంకంగా నెరవేరతాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉన్నా కొంచెం బలహీనత కన్పించవచ్చును. బంధువుల వ్యవహారాల్లో జోక్యం చేసికొనడంవలన నిష్ఠూరం వస్తుంది.

వృశ్చికం :

(విశాఖ 4-వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ)

వృత్తి వ్యాపారాల్లో అన్ని వ్యవహారాలు ప్రశాంతంగా ఉన్నట్లు కన్పిస్తాయి కాని ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా నష్టం తప్పదు. వ్యాపారంలో భారీ ప్రయత్నాలు చేయడానికి ఇది సమయం కాదు. భాగస్వాములతో కలసిచేసే వ్యాపారాలు బాగానే ఉంటాయి. ఈవారం మీరు నిర్వహించే వ్యవహారాల్లో కొంత డబ్బు చిక్కుబడి పోయే ప్రమాదం ఉంది. ఉద్యోగంలో వెంటనే ప్రయోజనం లేక పోయినా మున్ముందు ఉపయోగించగల మార్పులు రావచ్చును. ఆరోగ్యం సంతృప్తి కరంగా ఉంటుంది. రాజకీయ వ్యవహారాల్లో నూతనవిజయాలను సాధిస్తారు. మీరు చేయవలసిన ముఖ్యమైన నిర్ణయాలు వారాంతంలో చేయడం మంచిది.

స్త్రీలకు—ఆరోగ్యం సాధారణంగా ఉంటుంది. కుటుంబ వ్యవహారాలూ అంత బాగా ఉండకపోయినా శుభమూలంగా వ్యయం జరుగుతుంది.

ధనుస్సు :

(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)

ఈ వారం గతవారంకంటే బాగా ఉన్నా విశేషమైన ప్రయోజనాన్ని ఆశించడానికి సమయం కాదు. వృత్తి వ్యాపారాల్లో గతవారంలో ఏర్పడిన చికాకులు తగ్గు

ముఖం పెట్టడంవలన మీకు కొంత మనశ్శాంతి చిక్కుతుంది. వారాంతంలో వ్యాపారమునకు సంబంధించిన అనుకూల వార్తలను వింటారు. ఉద్యోగంలో ఇదివరకు ఏర్పడిన అవరోధాలు ఇంకా తొలగే సూచనలు లేవు. ఇదివరకు మీరు జరిపిన వ్యవహారాల వల్ల ఈ వారం ఆర్థికంగా ఒత్తిడి రావచ్చునుగాని ఏదో ఒక విధంగా మీరు సర్దివేయ గలరు. ఆరోగ్యం బాగా ఉంటుంది. బంధువులతో తీవ్రమైన భేదాభిప్రాయాలురావచ్చును.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. కుటుంబ వ్యవహారాల్లో చికాకులు రావచ్చును. బంధు సమావేశాల్లో పాల్గొంటారు.

మకరం :

(ఉష 2, 3, 4 పా, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా.)

ఈ వారంకూడా గతవారం వలెనే ఉంటుంది. వృత్తి వ్యాపారాల్లో కొన్నిచికాకులు వచ్చేటట్లు కన్పిస్తాయిగాని మీరు ధైర్యంగా వ్యవహరించడం వలన అన్నివ్యవహారాలు మీకు అనుకూలంగా నెరవేరతాయి. మీ భవిష్యదభివృద్ధికి అవసరమైన ప్రయత్నాలు చేయడానికి అనువైన సమయం. వృత్తి వ్యాపారాల్లో ఆదాయం, అంతస్థూ కూడా పెరుగుతాయి. మీ అభిప్రాయాలను అలోచనలను మీకంటే పెద్దలు కూడా గౌరవిస్తారు. ఉద్యోగంలో మీ పరిస్థితి సంతృప్తికరంగాఉంటుంది. సమయానికి డబ్బుఅందక తాత్కాలికమైన ఇబ్బంది కలుగవచ్చును. ఆరోగ్యం బాగానే ఉంటుంది.

స్త్రీలకు—సంతానానికి అనారోగ్య సూచనలు ఉన్నాయి. సాంఘిక వ్యవహారాల్లో మీ ప్రాముఖ్యత పెరుగుతుంది.

కుంభం :

(ధనిష్ఠ 3, 4 పా, శతభిషం, పూ. భా. 1, 2, 3)

ఈ వారం మధ్యనుంచి గత వారంకంటే బాగా ఉంటుంది. వృత్తి వ్యాపారాల్లో క్రమాభివృద్ధి సాధిస్తారు. అధికారులవలన జరుగవలసిన పనులు కొంచెం శ్రమ మీద నెరవేరతాయి. వ్యాపారంలో శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. వృత్తిలో సాటివారితో పోటీ పెరిగినా మీకు నూతనావకాశాలు లభించడం వలన ఆదాయం పెరగడానికి అవకాశం ఉంది. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. ఆరోగ్యం సంతృప్తికరంగా ఉంటుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. ప్రేమవ్యవహారాల్లోప్రోత్సాహాన్ని పొందగలరు. ప్రయాణంద్వారా కార్యసాధన చేయగల సూచనలు ఉన్నాయి.

స్త్రీలకు—ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. అనవసర వ్యయం జరుగుతుంది. బంధువుల వ్యవహారాల్లో పట్టుదలలు తగవు.

మీనం :

(పూ. భాద్ర 4 పా, ఉ. భాద్ర, రేవతి.)

ఈ వారంకూడా అంత బాగా ఉంటుందని ఆశించడానికి అవకాశం లేదు. వృత్తి వ్యాపారాల్లో మీరు ఎంత మంచిగా ప్రవర్తించినా అది ఇతరులకు చెడుగానే కన్పించవచ్చును. సాటివారు కొంత మంది పనిగట్టుకొని మీమీద నిందాప్రచారానికి పూనుకొనడం వలన మీ మనశ్శాంతికి భంగం కలుగుతుంది. వ్యాపారవిస్తరణ ప్రయత్నాలకు ఇది సమయం కాదు. రావలసిన డబ్బు సమయానికి రాక ఇబ్బంది కలిగినా కొరతమేరకు మిత్రులు తోడ్పడగల సూచనలున్నాయి. ఉద్యోగంలో మీపరిస్థితి అంతబాగా ఉండకపోవచ్చును. ఆరోగ్యం సాధారణంగా ఉంటుంది.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. నూతన విషయాలను తెల్సుకొంటారు. కుటుంబవ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. ★

జన్మ దిన ఫలం

జూలై -24

ఈ సంవత్సరం అంత అనుకూలంగా ఉంటుందని ఆశించడానికి అవకాశంలేదు. సంవత్సరం ప్రారంభంలో అనేక రకాల ఇబ్బందులను యెదుర్కోవలసివస్తుంది. వ్యాపారంలో ఆకస్మికంగా కొన్ని మార్పులు రావడం వలన ధననష్టం కలగవచ్చును. భారీ వ్యాపారాలు అంత బాగా ఉండవు. వ్యాపారంలో మీ అభిప్రాయాలను అమలు జరపడం కంటే భాగస్వాముల నిర్ణయానికే విడిచి పెట్టడం మంచిది. వృత్తి ఉద్యోగాల్లో కూడా వ్యతిరేక వాతావరణం యేర్పడుతుంది. మీరు యెంత మంచిగా ప్రవర్తించినా అది ఇతరులకు చెడుగానే కన్పిస్తుంది. సాధ్యమైనంత వరకు అన్ని విషయాల్లోను తటస్థంగా ఉండడం మంచిది. ఆరోగ్యం కూడా అంతంత మాత్రంగానే ఉంటుంది. కుటుంబ వ్యవహారాలు కొంత శ్రమమీద నెరవేరతాయి. సంవత్సరాంతంలో పరిస్థితి కొంత బాగుపడుతుంది. విద్యార్థులకు ఏప్రిల్ పరీక్షలు బాగా ఉండవచ్చును.

జూలై -25

ఈ సంవత్సరం మొత్తం మీద బాగా ఉంటుంది. వ్యాపారంలో క్రమాభివృద్ధిని సాధిస్తారు. ఇది వరకు మీరు ప్రయత్నం చేసి సాధ్యం కావనుకొన్న వ్యవహారాలు కూడా సంవత్సరం మధ్యలో సానుకూల పడతాయి. వ్యాపారంలో అప్పుడప్పుడు పెట్టుబడి చాలక ఇబ్బంది వచ్చినా మీ చాకచక్యంవల్ల అన్ని వ్యవహారాలు సరిదిద్ద గలరు. వృత్తి ఉద్యోగాల్లో అధికారుల అండదండలు లభిస్తాయి ఉద్యోగస్థులు అనుకూలమైన స్థానమునకు మార్పు బడవచ్చును. స్థిరాస్థి వ్యవహారాల్లో ఉన్న చిక్కులు చాల వరకు పరిష్కరింప బడవచ్చును. ఆరోగ్యం బాగానే ఉంటుంది కాని అప్పుడప్పుడు బలహీనత కన్పించవచ్చును. రాజకీయ వ్యవహారాల్లో ప్రయోజనంగల కార్యాల్ని సాధిస్తారు. బాధ్యత కూడా పెరుగుతుంది ప్రేమ వ్యవహారాల్లో కొత్త సమస్యలు రావచ్చును. విద్యార్థులు మంచి మార్కులతో కృతార్థులు కాగలరు.

జూలై -26

అన్ని వ్యవహారాలూ అనుకూలంగా ఉన్నా యేవో స్వల్ప కారణాలవల్ల ఆందోళన కలుగుతూ ఉంటుంది. వ్యాపారం అనుకూలంగా ఉంటుంది. మీరు వూహించని వ్యవహారాల్లో లాభం కలుగుతుంది. నూతన వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. సంవత్సరం మధ్యలో అధికారుల వలన జరగవలసిన పనులు సులభంగా నెరవేరతాయి. వృత్తిలో పోటీ చాలావరకు తగ్గుతుంది. విశేష ప్రాబల్యం గల వ్యక్తులతోడ్పాటు మీకు లభిస్తుంది. ఉద్యోగంలో మార్పులు వచ్చే సూచనలు ఉన్నాయి. స్థిరాస్థి వ్యవహారాల్లో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆరోగ్యం సంతృప్తికరంగా ఉంటుంది. సంతానానికి అనారోగ్యం చేయవచ్చును. కుటుంబ వ్యవహారాలు ఒడుదుడుకులు లేకుండా సాగిపోతాయి. భిన్నాభిప్రాయాలు గల బంధువులను ఒక దారికి తీసికొని రాగలరు. విద్యార్థులు మంచి మార్కులతో కృతార్థులు కాగలరు.

జూలై -27

ఈ సంవత్సరం ప్రారంభంలో అంత బాగా ఉండదుగాని సంవత్సరాంతానికి అన్ని వ్యవహారాల్లోను సంతృప్తికరమైన పరిస్థితులు యేర్పడుతాయి. వ్యాపారంలో కొన్ని అవకాశాలు ఆకర్షణీయంగా కన్పిస్తాయిగాని అవి కార్యరూపం దాల్చడం కష్టం. భాగస్వాములతో భేదాభిప్రాయాలు రాగల సూచనలు ఉన్నాయి. వృత్తిలో అంత ప్రోత్సాహం కన్పించదు. ఉద్యోగంలో మీ పరిస్థితి యధాతథంగా ఉంటుంది. ఆదాయం పెరగదు కాని అందరి వల్ల మంచితనం లభిస్తుంది. సంవత్సరాంతంలో ఉన్నత స్థానం లభించవచ్చును. ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. కుటుంబ వ్యవహారాల్లో కొత్త సమస్యలు రావచ్చును. సాంఘిక కార్యక్రమాల్లో మీ ప్రాముఖ్యత పెరుగుతుంది. అలంకార వస్తువులు కొంటారు. పుణ్యకార్యాలు చేస్తారు. విద్యార్థులకు ఏప్రిల్ పరీక్షలు అనుకూలంగా ఉంటాయి.

జూలై -28

ఏ పని అయినా చేయడంకంటే వూరుకోవడమే ఉత్తమమనే పరిస్థితి యేర్పడుతుంది. మీరు ఎంత కష్టపడి పని చేసినా, ప్రయాస తప్ప ప్రయోజనం ఉండదు. వ్యాపారంలో నష్టం రాగల సూచనలు ఉన్నాయి. భారీ ఎత్తున చేసే వ్యాపారాల

భారీయెత్తున దేశరక్షణకు
ప్రణాళికాబదమైన అభివృద్ధి

ప్రమాదం మొదలైనది కాదు. మీరు ఇదివరకు జరిపిన వ్యవహారాల్లో కూడా ఇప్పుడు ఇబ్బందులు రావచ్చును. వృత్తి ఉద్యోగాల్లో కూడా అకస్మాత్తుగా కొన్ని చిక్కులు వస్తాయి. ఉద్యోగస్థులు అనుకూలమైన స్థానమునకు మార్పుబడవచ్చును. అకారణంగా అధికారుల ఆగ్రహానికి గురికాగల ప్రమాదం ఉంది. సంవత్సరం అంతటా యేదో ఒక అనారోగ్యం చేస్తూ ఉంటుంది. కుటుంబ వ్యవహారాల్లో కొంత వ్యయం జరిగినా అన్ని కార్యక్రమాలు నిరాటంకంగా సాగిపోతాయి. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. విద్యార్థులు మొదటినుంచీ శ్రద్ధగా చదువవలసి ఉంటుంది.

జూలై-29

ఈ సంవత్సరం అనుకూలంగా ఉంటుంది. వ్యాపారంలో నూతనావకాశాలు లభించవు కాని ప్రస్తుతం ఉన్న వ్యాపారం అభివృద్ధికాగల సూచనలు ఉన్నాయి. వ్యాపారంలో వ్యయ ప్రయాసలు అధికం కాగలవు. ఆదాయం అంతగా పెరగదు కాని ప్రపంచ దృష్టిలో కార్యదక్షులనే ఖ్యాతి లభిస్తుంది. మీ పనులనే కాకుండా మిత్రుల కార్యాల్ని కూడా సాధించ గలరు. వృత్తిలో యేర్పడిన ఒడుదుడుకులు తొలగిపోయి భవిష్యత్తు మీద విశ్వాసం యేర్పడుతుంది. ఉద్యోగంలో మీకు అనుకూలంగా కొన్ని మార్పులు రావచ్చును. ఆరోగ్యం సంతృప్తికరంగా ఉంటుంది. కుటుంబ వ్యవహారాలు మామూలుగా జరిగిపోతాయి. శుభకార్యాల విషయంలో మీ ఆలోచనలు ఫలిస్తాయి. సాహిత్య కళా రంగాల్లో మీ కృషి పరిగణించ బడుతుంది. విద్యార్థులు మంచి మార్కులతో కృతార్థులు కాగలరు.

జూలై-30

జీవితంలో ముఖ్యమైన సంవత్సరాల్లో ఇది ఒకటి. ఈ సంవత్సరం మీరు జరిపే వ్యవహారాల ప్రభావం రాబోయే సంవత్సరాల మీద కూడా ఉంటుంది. ఇంత వరకు కేవలం ఆశయాలుగా మీ వూహాపథంలో ఉండిపోయిన సంగతులు ఇప్పుడు కార్యరూపం ధరిస్తాయి. వ్యాపారం ప్రోత్సాహకరంగా ఉంటుంది. వ్యాపారాభివృద్ధికి నూతనావకాశాలు లభిస్తాయి. భాగస్థులతో కలిసి చేసే వ్యాపారాలకంటే స్వంత వ్యవహారాలు బాగా ఉంటాయి. వృత్తికి సంబంధించిన విద్యలో ఉత్తీర్ణులు కాగలరు. ఉద్యోగంలో ఉన్నతస్థానం లభించవచ్చును. మీరు కోరే మార్పుల కోసం ప్రయత్నం చేయడానికి మంచి సమయం. ఆరోగ్యం సంతృప్తికరంగా ఉంటుంది. కుటుంబ వ్యవహారాల్లో కొద్ది ఒడుదుడుకులు రావచ్చును. రాజకీయుల్లో బాధ్యత గల పదవిని నిర్వహిస్తారు. విద్యార్థులకు క్లాసు రావచ్చును. ★


నికో
క్రిమిసంహార సబ్బు
పార్కు-డేవిస్ ఉత్పత్తి

మీ చర్మాన్ని, మొటిమలు, పొక్కులు, పేయడంనుంచి కాపాడి పరిశుభ్రంగా ఆరోగ్యంగా వుంచుతుంది. దీనితో నిత్యం తల రుద్దుకొంటే, దీని క్రిమిసంహారనురగ, చుండ్రు రాకుండా కాపాడుతుంది. నిరుపమానమైన నికో క్రిమిసంహార సబ్బు మీకు మూడు విధాల లాభం చేకూర్చుతుంది: అది పరిశుభ్రంచేయడం, క్రిములను నాశనంచేయడం, సంరక్షించడం. మీ చర్మానికి కావలసిన సంరక్షణ నిత్యంచేయండి.



NATIONAL PD 9169

1—మొట్టమొదటి క్రిమిసంహార సబ్బు. నిత్య ఉపయోగానికి.



ముప్పాళ్ల రంగనాయకమ్మ

జరిగిన కథ

మధు, స్నేహితురాలు శారదకు తన బాల్య గాథను చెప్పగా, ఆమె దాన్నంతా నవలగా చిత్రిక పడుతుంది ... చిన్ననాటనే తల్లిని కోల్పోయిన మధు, తండ్రికి కూడా దూరమవుతాడు. తాతగా రింట్లోనే అన్నయ్య సూర్యం, చెల్లెలితోను వుంటూవుండగా, జమీందారుగారి ఇరువురు కూతుళ్ల స్నేహం లభిస్తుంది. తాతగారి మరణంతో మధు తాతగారి సొంత వూరు చేర్తాడు. అక్కడి పరిస్థితులు మధుకు బాధాకరంగా ఉంటాయి. జానకిభర్త మనసు మారినందుకు అంతా సంతోషిస్తారు. మామయ్యకు ఇష్టంలేక పోయినా, మధు స్కూల్లో చేరతాడు. హెడ్ మాస్టరు మధు ప్రతిభను చూసి సంతోషిస్తాడు. విశ్వనాథం మధును సతాయించటాన్ని సుందరమ్మ గారు ప్రతిఘటిస్తుంది. అంతేకాదు, మధుపట్ల నానాటికీ విశ్వనాథానికి ద్వేషం పెరిగిపోవటం, సుందరమ్మగారికి బాధాకరంగా పరిణమిస్తుంది. తోటలో జరిగిన దొంగతనాలకు మధు బాధ్యుడవుతాడు. ఆవిషయాన్ని తెలిసికొన్న విశ్వనాథం మధును రక్తం కారేటట్టు కొడతాడు. దగ్గరి బంధువైన డాక్టర్ కేశవరావ్ పరిచయం మధులో కొత్త ఉత్సాహాన్ని కలిగిస్తుంది. ఉద్యోగంలో చేరిన సూర్యం, ఆ ఇంటినుంచి విడిపోవటానికి నిశ్చయించుకొంటాడు.

12

విశ్వనాథం మండిపడ్డాడు— "నీలాంటి విశ్వాసం లేని వెధవైతే, అలాగే చేస్తాడు."

మధు విశ్వనాథంతో తలపడ్డాడు— "ఎందుకు నీకు విశ్వాసం చూపించాలి? మచ్చలు కట్టేలా వాత గొట్టినందుకా? కండలు కరిగేలా చాకిరీ చేయించినందుకా? కుక్కలకన్నా నీచంగా నిదరించుకున్నందుకా? ఎందుకు నీకు విశ్వాసం చూపించాలో ఒక్కసారి చెప్పు."— మధు కళ్లు చింతనిప్పుల్లా మెరిశాయి. సంవత్సరాల తరబడీ కూడుకున్న క్రోధం ఆ రెండు కళ్లలో ఎర్రగా మిడిసిపడింది.

"ఏందిరా? పెద్దవాడివై పోయానని విరగబడుతున్నావా? కాస్త నోరు సంభాళించుకో. తన్నులు తింటావ్."

తిరిగినిల్చి [illegible] వచ్చిందారు— మధు.

"ఆ రోజులు పోయాయ్ విశ్వనాథంగారూ! పోయాయ్. మీను నోరు సంభాళించుకోవటం కాదు. మీ ఒళ్లు భద్రంగా కాపాడుకోండి. తిట్టి కొట్టి బెదరించటానికి వీడు అనాటి మధూ కాడు." — మధు దండలమీద ఒంపులు— తోట పనిచేసి బలిష్ఠమైన కండరాలు విశ్వనాథాన్ని సవాల్ చేశాయ్.

"అయితే నువ్వు నన్ను దడిపిస్తున్నావా?"

"నీ వెటకారాలు కట్టిపెట్టు. దడిపించటమేం ఖర్మ? దండిస్తాను. ఏం? ఆశ్చర్యంగా ఉందా? నీ వంటి పెద్దమనిషికి ఇంతకన్నా సత్కారం కావాలా?"

"ఏమిటోయ్ నీ వాగుడూ? వూరుకుంటున్నాననా?"— విసురుగా లేచాడు విశ్వనాథం.

"ఈ మాత్రపు గౌరవం కాపాడుకోవాలంటే అక్కడే నిలబడు. కాలు ముందుకు వేశావో తేల్చేస్తాను. ఏం? నువ్వు తినిపించినన్ని నీకు తినిపించ మంటావా? పనివాళ్లమీద పెత్తనం చెలాయించటమనుకున్నావా? [illegible] [illegible] చేత నీ పంచ చేరితే ఏమిటి నువ్వు చేసింది? ప్రాణమంటూ ఉంటే మర్చిపోతామనుకున్నావా? తల్లి తోడబుట్టిన మేనమామవి......నువ్వు....."

అత్తా కోడళ్లూ పిల్లలూ అంతా గొడవ విని ఎక్కడి పనులక్కడే వదిలేసి వాకిటి గుమ్మాల్లో చేరారు. బంధాలు తెంచుకున్న పోట్లగిత్తలా విజృంభిస్తున్న మధునీ— కటకటాల మధ్య ఇరికిన పులిలా గుటకలు మింగుతున్న విశ్వనాథాన్నీ అందరూ చూశారు.

పార్వతి కంగారుగా గొంతు పెద్దదిచేసి విశ్వనాథాన్ని ఉద్దేశిస్తూ అంది— "ఎందుకీ గొడవ? ఆ పిల్లాడు అనట మేమిటి? మీరు పడట మేమిటి? ఇష్టం ఉంటే ఉంటారు. లేకపోతే పోతారు. మనం పోట్లాడితే అవుతుందా?"

"అత్తా!" మధు పార్వతివేపు తీవ్రంగా చూశాడు. "నువ్వు ఆడదానివేనా? ప్రేమకీ కరుణకీ స్థానమైన స్త్రీ హృదయం— నీలో..... మచ్చుకైనా ఉందా? నేనేం మతి చెడి మాట్లాడుతున్నానా? మీరు చేసిందంతా మర్చిపోయానా? ఏమిటి నీ ఉద్దేశ్యం? మీరు మా కోసం పోట్లాడటమా? ఎందుకూ? జీతం ఇవ్వలేని నౌకర్లు వెళ్లిపోతున్నారనా? కోపాలు భరించే దరిద్రులు దాటి పోతున్నారనా! ఎందుకు మీ పోట్లాటలు? ఎవర్ని నువ్వు మభ్య పెడతావ్?"

"ఎందుకలా విరుచుకు పడతావ్? నీతో మాకు వాదనేమిటి? చిన్నవాళ్ల జోలికెళ్తే పెద్దవాళ్ల తప్పు— కానివాడి జోలికెళ్తే అయినవాడిది తప్పూను. గతిలేని వాళ్లని చేరదీసి పెంచి పెద్ద చేసినందుకు......."

"అత్తా!" సూటిగా చూశాడు మధు— "నీకు నోరెలా వచ్చింది? మనసెలా ఒప్పింది? పెంచి పెద్ద చేశావా? అవును, నీ తోటలో పిచ్చిమొక్కలు మొలుస్తున్నాయ్ — నీ దొడ్లో వూరి కుక్కలు తిరుగుతున్నాయ్— వాటి నన్నిటినీ నువ్వే పెంచి పెద్ద చేశావ్— జాలితో — ప్రేమతో — అభిమానంతో...... అంతకన్నా గొప్పగా పెరగలేదే మేము! కడుపునిండా తిండిలేక కట్టుకోటానికి గుడ్డలేక ఏ అవసరమూ తీరక— ఏ కోరికా నెరవేరక హీనంగా నీచంగా నీ యింట్లో బిచ్చగాళ్లమై బ్రతికాం— మమ్మల్ని మీరంతా పెంచి పెద్ద చేశారు — ఆ కృతజ్ఞత మాకే లేకుండా పోయింది."

"తిన్నది అరిగిపోతే ఎన్ని నిష్ఠూరాలన్నా వెయ్యచ్చు. అంత్య నిష్ఠూరంకన్నా ఆది నిష్ఠూరం మేలని— ఆనాడే నీ దారిన నిమ్మల్ని వదిలేయక పోవటమే మా పొరపాటు— దారే పోయేవాళ్ల కోసం ఇల్లు గుల్ల చేసుకున్నది చాలక వాదం ఒకటి."

"ఇల్లు గుల్ల చేసుకున్నావ్? ఎవరికోసం? రూపాయి చాకిరిచేస్తే పావలా తిండి పెట్టావ్! మేము వచ్చింది మొదలూ ఇంట్లో పనిమనిషిని మాన్పించావ్— మా రెక్కల కష్టంతో తోటమీద వందలు సంపాదించావ్ —ఎవరికోసం ఇల్లు గుల్ల చేసుకున్నావ్? ఎలకలేమైనా తిన్నాయేమో చూసుకోలేకపోయావా?"

"ఏమిటా చమత్కారం? ఇష్టం లేకపోతే పోరాదూ."

"పోతాం. మహారాజుల్లా పోతాం. మీ అందరికీ ఒకోక్క దణ్ణంగాయిచ్చి మరీ పోతాం. ఇంట్లో పడి తిన్నామనీ— విశ్వాసంలేని ఘాతకులమనీ మళ్లీ వాగితే నోరు మూయించి పోతాం. మా అమ్మా నాన్నా బ్రతికి ఉన్నన్నాళ్లూ అడుగులకు మడుగు లొత్తి— వాళ్లకు కాకాలుపట్టి వాళ్ల సొమ్ము తిన్నది మీరు! వాళ్లు దాటిపోయారని వాళ్ల బిడ్డల్ని నానా



హింసలుగా పెట్టి తిన్న విశ్వాసం మర్చిపోయింది మీరు!" అంత సులువుగా పోతామా? మీకు మా కృతజ్ఞతలుకూడా చెప్పుకుపోతాం. ఈ ప్రాణాలు ఏనాడో ఎగిరిపోకుండా పదేళ్లపాటు కాటు నిలిపి ఉంచారు, ఏళ్ల తరబడి పెరిగిపోయిన ద్వేషం వెళ్ల గక్కుకోటానికీ, ఎదురు తిరిగి ఘర్షణ పడటానికీ అవకాశం కల్పించారు.— అందుకైనా మీకు కృతజ్ఞత చెప్పుకోక తప్పదు."

"మధూ!" మందరమ్మగారు కొస్త కటువుగా అంది. "ఏమిటా మాటలు? ఇప్పుడేమైందని అలా నోరు పారేసుకుంటున్నావు? జరిగిపోయినవన్నీ తవ్వుకుంటూ కూర్చుంటే ఏం వస్తుంది? పెద్ద వాళ్లనికూడా ఆలోచించకుండా........"

"హు! పెద్దవాళ్లు! ఎవరా పెద్దవాళ్లు? తల్లి లేని పసివాళ్లని ఏడిపించినప్పుడూ— గొడ్డుకన్నా ఘోరంగా చావబాదినప్పుడూ ఒక్క అర్ధణాకి దేవుళ్లాడితే కసిరికొట్టినప్పుడూ— రోజంతా చాకిరీ చేయించుకుని దొంగతనంగా దాచుకు తిన్నప్పుడు, చదువు సంధ్యలు నేర్చి అభివృద్ధిలోకి వస్తామేమో అని అఘోరించినప్పుడు.........ఏమయ్యారీ పెద్ద వాళ్లు? పెళ్లిళ్లు [illegible] ఎరిగిన వ్యక్తులున్నారు.— దిక్కులేని మా విషయం ముస్తే ఈ పెద్ద మనుషులెవరూ పట్టించుకోరేం? వయస్సు పెరగటం ఒక్కటేనా పెద్దవాళ్ల లక్షణం?"

"నీ ఖర్మకి నువ్వు అఘోరించక ఎవరో చూడ లేదని ఏడవటం దేనికి?"

"ఖర్మ! జానేదేవ్! ఏమిటా ఖర్మ? ఖర్మంటూ ఉంటే తల్లిపోవటం కాదు— ఆస్తిపోవటమూ కాదు. పిల్లింట్లో చేరటమే మా ఖర్మ! మమ్మల్ని ఎవ్వరూ అప్పనంగా పోషించలేదు. పని మనుషులకన్నా ఎక్కువగా చాకిరీ చేశాం. అర్ధాకలితో సంతృప్తిపడ్డాం. అమ్మ నగలమ్మి కొన్న పొలం నాలుగెకరాల పంట సరిపడక ఇళ్లు గుళ్లు చేసుకున్నామంటున్నారీ పెద్ద మనుష్యులు— ఈ విశాల హృదయుల దగ్గిర చేరటం మా ఖర్మ, కాకపోతే ఏమిటి?"

విశ్వనాథం విసురుగా అన్నాడు— "ఒరేయ్! నువ్వు అనవసరంగా నోరు చేసుకోకు. ఏనుగుని చూసి కుక్కలు మొరగటం ఎప్పుడూ ఉంది— మా పెద్ద మనిషితనాన్ని చిన్నబుచ్చావనీ— కపటంలేని ప్రవర్త



కూలిన గోడలు

వని ఆడిపోసుకున్నావనీ విచారించటంకూడా అన వసరం— నీ చదువుకీ నీ అన్న చదువుకీ రెండెకరాలు తెగనమ్మాను. నీలాంటి విశ్వాస ఘాతకుడికి జాలి దల్చినా మహా పాపం— ఈ క్షణంలో ఇంట్లోంచి పొండి."

"పోయేముందు ఒక్కమాట. నీకు శత్రువు లంటూ ఉన్నారో లేదో నాకు తెలియదు— నేను నీ గుండెల్లో నిద్రపోతానని మాత్రం మర్చిపోకు. ఆ తెగనమ్మిన రెండెకరాలు చదువులకయ్యాయని వంత పెట్టకపోతే నీకు కావాలని అడుక్కోలేక పోయావా? మా నాన్నని దేవిరించి నీ అవసరాలు గడుపుకోలేదా? వీళ్లిద్దరూ ఆ తండ్రి కన్న కొడుకులు కారనుకున్నావా?"

"హోర్మయ్! ఏమిటా వాగుడు?"

"అది నీ వంతు. నీ లాంటి పెద్ద మనుషులు కూడా కొన్ని ఒంతులేసుకుంటే మజాగా ఉంటుంది"

"మధూ!" మందలింపు స్వరంతో పిలిచాడు సూర్యం—"ఎందుకలా మాటలు పెంచుతూ పోతావ్? ఆనాడు ఇష్టమై వచ్చాం. ఇష్టమైనన్నాళ్లా ఉన్నాం ఇష్టంగానే పోతే బాగా ఉంటుంది. కష్టాలు వచ్చింది మనకు. బాధపడాల్సిందికూడా మనమే."

విశ్వనాథం అన్నాడు వెటకారంగా. "మువ్వు ఆగరా! వాడి కసి అంతా తీర్చుకోనీ!"

సూర్యం మందలింపుతో కొంత జంకినా మధు పూరుకోలేదు— "కసి! అది ఈ జన్మంలో తీరదు. వచ్చే జన్మంటూ ఉంటే చూసుకుందాం." విసురుగా అంగలేసుకుంటూ బయటికెళ్లిపోయాడు.

ఎక్కడి వాళ్ళకక్కడ శిలా ప్రతిమల్లా నిలబడి పోయారు. ముందు మాట్లాడటానికి ఎవరికీ మనస్కరించలేదు. చివరికి పార్వతి అంది.—

"ఎన్నడూ లేందే ఎందుకలా గంగిర్లెత్తినట్టు వాగి వెళ్లాడు?"

"ఆ కేశిగాడు చేయిస్తున్నదిదంతా!" కళ్ళు మారాడు విశ్వనాథం.

నెమ్మదిగా సూర్యం వీధిలోకి సుందరమ్మగారు దొడ్లోకి తప్పుకున్నారు.

సంగతంతా విన్న కేశవరావు— ఆశ్చర్యంగా చూశాడు— "నీకూ చిన్న వ్యక్తిత్వం ఏర్పడిందిరా అల్లుడూ!" అంటూ నవ్వాడు.

మేనమామలకూ మేనల్లుళ్ళకూ మధ్య అనురాగాలకు బదులు అగాధాలు ఏర్పడ్డాయి. అవి పూడ్చుకోవాలన్న కోరిక ఏ ఒక్కరికి ఉన్నట్లు లేదు— సూర్యం అప్పుడప్పుడూ వెళ్లి అత్తలతో మామలతో ఓ క్షణం మాట్లాడి తనమీద నేరం లేకుండా చేసుకు వస్తున్నాడు. మధు మాత్రం ఆ గడప ఎక్కలేదు— వారానికోసారైనా ఓ గంట తోటలో తిరిగి ప్రతిచెట్టుమీద చేయి వేసి— ప్రతి మొక్కనీ ముట్టుకువిరాక తప్పటంలేదు. లేకపోతే ఏదో పోగొట్టుకొన్నట్టు— తోటంతా తన కోసం ఎదురుచూస్తున్నట్టు—ఆవేదన కలుగుతుంది.

ఆ రోజు మధు చాల సంతోషంగా ఉన్నాడు. పరీక్షా ఫలితాలు తెలిశాయి. తను పాసయ్యాడు. ఇక కాలేజీ మెట్లెక్కి భవిష్యత్ సౌధానికి సోపానాలు కట్టుకోవచ్చు. తను కష్టపడి చదివి పెద్దవాడై మంచి ఉద్యోగం సంపాదించి విశ్వనాథంవంటి అనూ

[illegible] కళ్ళల్లో నిప్పులు పోయ్యాలి. అంత వరకూ ఈ పంతానికి అర్థంలేదు.

తోటంతా తిరుగుతూన్న మధు అప్రయత్నంగా తెల్ల గులాబీచెట్లు దగ్గరికి నడిచాడు.

సుధ ఎత్తుగా ఉన్న గులాబీకోసం పరికిణీ కుచ్చెళ్ళు ఎడం చేత్తో పట్టుకుని కుడిచెయ్యి పైకెత్తి ఎగురుతూ పువ్వు అందుకోవాలని విశ్వ ప్రయత్నం చేస్తోంది. మధు ఒక క్షణం చూస్తూ నిలబడ్డాడు.

"నేను కోసి ఇవ్వనా సుధా?"

సుధ గిరుక్కున వెనక్కి తిరిగి చూసింది. కంగారుపడిన దానిలా కుచ్చెళ్ళు వదిలేసి పువ్వుకేసి చూడకుండా నిలబడిపోయింది. మధు గులాబీ కోశాడు. రెండు ఆకులతో నక్షత్రంలా గులాబీ అందంగా ఉంది. సుధకి ఇవ్వబోయాడు— అడ్డంగా తల తిప్పింది సుధ— "వద్దు".

"ఏం? నువ్వే కోసుకో బోతున్నావుగా?"

సుధ మాట్లాడలేదు.

పదిహేడేళ్ల మధు చనువుగా కోరికతో పదేళ్ల సుధ జడలో గులాబీ పెట్టబోయాడు. సుధ గిరుక్కున తలతిప్పేసింది— "నాకేం వద్దు"

గులాబీ కింద పడింది— మధు సూటిగా సుధ కేసి చూశాడు. చెంపలు రెండూ పగల గొడదా మనిపించింది. వంగి గులాబీ తీసుకున్నాడు.

వెటకారంగా అన్నాడు— "నీకు గులాబీ ఎందుకులే ఆ దడి దగ్గరవూ శాయ్. ఉమ్మెత్త పువ్వులు పెట్టుకో"

"నువ్వేం చెప్పక్కర్లా".

"ఓహో! చాలా పౌరుషంగా ఉందే అమ్మాయి గారికి!"

సుధకి ఉక్రోషం వచ్చింది— "మా పెదనాన్నతో దెబ్బలాడి మా తోటలో కెందుకొచ్చావేమిటి?"

"నువ్వు తప్పకుండా లాయరువై పోతావ్. చది విస్తానంటున్నాడా మీ పెదనాన్న?"

"ఆఁ నేను పెద్ద బళ్ళో చేరతాను తెలిసిందా?'

"చేరు. చేరాక అన్నగారిలా అక్కడే ఉండిపోకు."

"మా అన్నయ్యకూడా పేసయ్యాడు. తెలిసిందా."

"ఆ క్లాసులో మరి ఉంచటానికి వీల్లేక పైకి తోశారు. ఎవడికి తెలీదు?"

సుధ బిక్కమొహం వేసింది.— మధుకి జాలే సింది.

"అది సరేగాని నాతో నువ్వు ఎప్పుడూ సరిగ్గా మాట్లాడవేం సుధా?"

"నువ్వు మా పెదనాన్నతో దెబ్బలాడ లేదేమిటి?'

"అయితే నీకెందుకు కోపం? నీతో దెబ్బలాడ లేదుగా?" నాతో మాట్లాడటానికేం ?"

"ఏం మాట్లాడనూ ?"

"ఏదో ఒకటి. ఏం? నాతోమాటాడటం నీకు ఇష్టంలేదా?"

"ఏమో బాబూ! నేను పోతాను మా అమ్మ తిడుతుంది." —

"నాతో మాట్లాడవద్దని చెప్పారా?"

"నాకేం చెప్పలా....."

"పోనీ ఈ పువ్వు తీసుకువెళ్ళిపో— ఆడపిల్లవి కదూ? పువ్వు పెట్టుకోవూ?"

"..................."

"నేను నీతో జట్టుగా ఉందామనుకొంటే నీకు నామీద కోపం ఎందుకేమిటి?— మచ్చి కయ్యాను. నేను నూర్కులు ఫైనలు పాసయ్యాను. నీకు తెలుసా?"

"మా అన్నయ్య చెప్పాడుగా?"

"మీ పెదనాన్న ఏమన్నాడేం?"

"మమ్మల్ని నీకన్నా బాగా చదువుకోమన్నాడు."

మధు నవ్వాడు. "కాస్త దారిలో కొస్తున్నాడు."

సుధ అర్థంకానట్లు చూసింది.

"పువ్వు తీసుకువెళ్ళిపో, వెళ్తానన్నావుగా?"

సుధ వ్యతిరేకంగా మాట్లాడటానికి ధైర్యం లేక గులాబీ అందుకుంది.

* * *

జగన్నాథస్వామి కోవెలలో సూర్యం పెళ్ళి నిరాడంబరంగా జరిగింది. సూర్యం భార్య కాగలిన అదృష్టవంతురాలు ఇందిర పేద కుటుంబంలో పుట్టిన కారణంగా ఏ సిరి సంపదలూ తెచ్చుకోలేక పోయినా సౌందర్యమూ సౌశీల్యమే ఆమె ఆభరణాలు.

సూర్యం తొలిసారిగా ఇందిరతో మాట్లాడి నప్పుడు ప్రత్యేక శ్రద్ధతో చెప్పింది మధూ విష యమే.

"ఇందిరా! మధు నీకు మరిదికాడు— కొడుకు! వాడివి తల్లిలాగ చూసుకోవలసిన బాధ్యత నీమీద పెడు తున్నాను. ఇంతకన్నా చెప్పనవసరం లేదనుకుంటా".

సిగ్గు దొంతరల పెళ్లికూతురు— ఇందిర—

ఒకడు: గడియారం పద మూడు గంటలుకొడితే ఏమే వేళ అంటారండీ ?

మరొకడు: మరమ్మత్తు వేళ.

సుబ్బారెడ్డి (కొవెలకుంట్ల)

కొంచెం తెల్లబోయింది. భర్త ఇంత ప్రత్యేకించి మరిది విషయం ఎందుకు చెప్పినట్లో అర్థంకాలేదు.

"మీరు చెప్పినట్లే చేస్తాను" అంది తల దించు కొని.

"ఎందుకో నీ మీద నాకా నమ్మకం కుదిరింది ఇందూ!" వయస్సులో యువకుడై అనుభవాల్లో పెద్దవాడైన సూర్యం— సంతోషం నిండిన మన స్సుతో ఇందిర సన్నిధిలో విశ్రమించాడు.

ఒక సంవత్సరం కాలేజీలో చదివివచ్చిన మధు— అపారమైన కోరికతో చదువుసంధ్యలు ఒంట పట్టించుకొంటూన్న మధు— ఇందిరను చూసి చలించిపోయాడు. కన్నతల్లి జ్ఞాపకాలు వెర్రివాణ్ణి చేస్తోంటే ఏడేళ్ల పసివాడిగా మారిపోయి కుతూహలంగా ఇందిరని పరికించసాగాడు. పట్టుబట్టలతో అన్నయ్యపక్కన నిలబడిన వదిన మొహంలో దేని కోసమో వెదుకున్నాడు— మధు మనసు ఆనందంతో గంతులేసింది.

"వదిన!.......వచ్చింది అమ్మలాగ....ఎప్పుడూ ఇంట్లోనే ఉండిపోతుంది."

వదినతో మాట్లాడాలన్న కోరిక నిలవనివ్వకుండా చేసింది. ఆ శుభసమయం కోసం మూడు రోజులు ఎదురుచూశాడు.

సంధ్యవేళ— ఇందిర దీపం వెలిగిస్తోంది.

"వదినా!"

తలతిప్పి చూసిన ఇందిర సిగ్గు పడిపోయింది.

భరకత్తన్నా బలిష్ఠుడైన మరిది!— మౌనంగా తలదించుకొంది.

"ఈ పువ్వులు తీసుకో వదినా!" మధు చేతిలో తెల్ల గులాబీల గుత్తి ఉంది— "నీ కోసమే తెచ్చాను వదినా!"

ఇందిర సిగ్గు ముసుగు తొలిగించుకుని ప్రయత్నంచేస్తూ అంది— "లోపలికి వచ్చి కూర్చోండి"

మధు సంతోషంగా వచ్చి చాపమీద కూర్చు న్నాడు. ఇందిర గులాబీగుత్తి తలలో ఇముడ్చుకొంది.

"పువ్వులు చాలా బావున్నాయి. ఎక్కడివి?"

"మామయ్యగారి తోటలోంచి తెచ్చాను."

"అక్కడ ఎక్కువగా పూస్తాయా?"

"మేము వాళ్లింట్లో ఉండే రోజుల్లో ఎక్కువ గానే పూసేవి. ఇప్పుడు తోటపని బాగా చెయ్యటం లేదు. కొన్నికొన్ని పూస్తున్నాయట."

"..................."

"నీకు గులాబీలు ఇష్టమేనా వదినా?"

ఇందిర నవ్వింది— "గులాబీ ఎవరికి ఇష్టముండదు.?"

"మా అత్తలు మాత్రం పెట్టుకోరు. చేమంతుల దండ ఓ బారెడైతేగాని వాళ్లకి సరిపోదు."

"దానికేముంది? మనిషికో ఇష్టం."

"మన దొడ్లోకూడా గులాబీమొక్క వేద్దాం వదినా!"

"నేనే చెప్పాలనుకొంటున్నాను— మల్లిమొక్క కూడా."

"ఓ తప్పకుండా. నీకిష్టమైన పువ్వులన్నీ మన దొడ్లోనే పూయిస్తాను వదినా !"

"మీకు పువ్వుల పెంపకం బాగా తెలుసను కుంటాను."

మధు అయిష్టంగా మొహం పెట్టాడు— "నన్ను అలా మన్నించకు వదినా! నాకేమీ నచ్చ లేదు. మా అమ్మ అయినా, అమ్మమ్మ అయినా నువ్వు అయినా ఒక్కటే."

ఇందిర మధు మొహంలోకి సూటిగా చూడ గలిగింది. ఆ మొహంలో, కళ్లలో చిరునవ్వులో పసి భావాలు తప్పితే మరేమీ కానరాలేదు.

"చిన్నవాడు కాస్త ఆకతాయి వాడమ్మా! ఎలా చూసుకుంటావో!" అని సుందరమ్మగారుకూడా మధు గురించి చెప్పినప్పుడు ఇందిర కొంత పెద్దగానే వూహించుకుంది. అటువంటి మరిది బాధ్యత స్వీకరించటం సాహసమేనని భయపడింది. కాని ఈ మధు— మరిది ఉత్త పసివాడు! అమాయకుడు— తన భయాలు ఎంతమాత్రం నిజంకాదు.

"వదినా! నువ్వు మా అమ్మలాగే ఉన్నావు." అన్న ప్పుడు ఇందిర నవ్వింది.

"నిజం వదినా!" మధు రెట్టించాడు.

వదినా! వదినా! అంటూ ఎప్పుడూ తనచుట్టూ తిరిగే మరిది! నిత్యమూ పూలహారాలు తెచ్చి దేవి కన్నా మిన్నగా పూజించే భక్తుడు!

అపారమైన భయభక్తులతో తాను చెప్పి నట్లు ఆచరించే శిష్యుడు!— మధు ఇందిరకి మరిది కానేకాడు!

ఇందిర సూర్యానికి సామాన్యమైన ఇల్లాలే కాని మధుకి అపురూపమైన స్నేహితురాలు!

39వ పేజీ చూడండి

తమిళ వివాహం!

తమిళనాడులో అమలులో ఉన్న వివాహపు ఆచార వ్యవహారాలు ప్రారంభం నుంచీ ఒక విశిష్టతను, ప్రత్యేకతను సంతరించుకొని ఉన్నాయి. ఈ పద్ధతులకూ, తెలుగువారి వివాహపు సాంప్రదాయాలకు కొంత సామీప్యమూ, సాదృశ్యమూ ఉన్నది. అందుకు సంబంధించిన కొన్ని ముచ్చట్లు చెప్పుకొందాం—

అన్నింటికంటె ముందు ఇరువురి జాతకాల విషయమై వియ్యంకులలో ఏకాభిప్రాయం కుదిరాక, అమ్మాయిని చూచి పోవలసిందని అబ్బాయికి ఆహ్వానం లభిస్తుంది. అమ్మాయిని చూసిన అబ్బాయి 'సరే' అన్నప్పటి నుంచి ఆరంభమవుతుంది అసలు కార్యక్రమం !

తరువాత అబ్బాయి వర్గం, అమ్మాయి వర్గం ప్రతినిధులు, బంధుమిత్రులు ఒక చోట చేరి కట్నాలు, కానుకల విషయమై నిర్ణయాలు చేసికొని, ఒప్పందం కుదుర్చుకొంటారు. ఆ రోజున



వధువు తండ్రి వరునికి నూతన వస్త్రాలు ఇస్తున్న ద



వివాహానికి పూర్వం వధువు తండ్రి వరుణ్ణి సాదరంగా తన ఇంటికి ఆహ్వానించటం ఒక ఆచారం.

కూడా పెండ్లి కుమార్తె నలుగురి సమక్షంలోకి రాక తప్పదు. ఒళ్లంతా నగలు పెట్టుకుని, పట్టుచీరగాని, సిల్కుచీరగాని ధరించి భయపడుతూ, బిక్కుబిక్కుమంటూ నలుగురికీ కనుపించి వెళుతుంది ! అయినా, మనస్సు మాత్రం ఆ వివాహపు శుభ ఘడియల కోసం నిరీక్షిస్తూనే ఉంటుంది.

ఇక పెళ్లికొడుకు— పెళ్లి రేపనగా, అతడు ఈ రోజే పెళ్లి బంధువులు, మిత్రులతో దేవాలయానికి వెళ్లి, దేవుని దర్శనం చేసికొంటాడు. ఆడ పెళ్లివారు అక్కడికే వచ్చి, తమ ఇంటికి రమ్మని అబ్బాయిని ఆహ్వానిస్తారు. అబ్బాయికి అక్కడే కొత్త బట్టలూ, కొత్త ముచ్చటగా కనిపించేందుకు వాచీ, ఉంగరం ఇస్తారు. అక్కడ నుంచి కార్లో ఊరేగింపుగా సంగీత వాయిద్యాలతో పెళ్లింటికి తీసుకెళతారు. ఈ ఉత్సవాన్ని "మాపిళ్ళై అళైప్పు" అని అంటారు. అబ్బాయి పెళ్లివారింటికి కార్లో చేరటంతో పెళ్లి కొడుకు కార్యక్రమం ముగుస్తుంది.

మరోవైపు "నిశ్చితార్థం" అనే మరో కార్యక్రమం జరుగుతుంది. పెళ్లి కుమారుని తల్లి



క్యం.

దం(డులు పెళ్ళి కూతురికి కొత్త బట్టలు అప్పుడే ఇస్తారు. అక్కడ మరో మారు జాతకాలను చూసి గో(త్రాలు ఒకటే కావని నిర్ధారణ చేసికొంటారు నలుగురి సమక్షంలో. ఆ నాటి రా(త్రి పెద్ద విందు జరుగుతుంది.

ఆ మరునాటి ఉదయంనుంచే వివాహపు కార్య(క్రమం మొదలవుతుంది. (బ్రహ్మచర్యానికి స్వస్తి చెప్తూ పెండ్లి కుమారుడు (వ్రతం చేస్తాడు. తరువాత పెండ్లి కొడుకు కాశియా(త్ర (ప్రారంభిం చటం, కాబోయే మామయ్యగారి కోరికమీద నిష్ఠాల మీదనే దానిని విరమించటం జరుగుతుంది. పెండ్లికొడుకు, పెండ్లికూతురు దండలను మార్చు కోవటం దీని తరువాతి అంశం. తరువాతి కార్య(క్రమాన్ని 'ఊంజల్' (ఉయ్యాల) అంటారు. ఇద్దరూ ఉయ్యాల్లో కూర్చొంటారు. పెళ్ళి కొచ్చిన ముత్తయిదువులంతా దీనిలో పాల్గొం టారు. వధూవరులను ఉమాశంకరులుగా భావించి పాలతో కాళ్ళు కడుగుతారు. ముత్తయిదువులంతా ముమ్మారు వధూవరుల చుట్టూ (ప్రదక్షిణం చేస్తారు. ఈ ఉత్సవంలో కొందరు (స్త్రీలు

పీటలు కూడా పీడతారు. చక్కటి పందిరి నడుమన ఏర్పరచిన హోమం సమక్షంలో పాణి(గ్రహణం జరుగుతుంది. కన్యాదానం జరిగేముందు పెళ్ళికుమారుని తరపు మంచి వధువుకు చీర నొక దానిని బహూకరిస్తారు. ఆమె ఈ చీరను ధరించి తీరాలి. పురోహితులు శా(స్త్రాన్ని,



'ఉయ్యాలసేవ'



మంగళసూ(త్రధారణ



కన్యాదానం.



తలంబ్రాల వేడుక.

తమిళ వివాహం

మంత్రాన్ని పఠిస్తున్న సమయంలో, మంగళ వాయిద్యాలు మ్రోగుతుండగా వరుడు మాంగల్య ధారణ చేస్తాడు. వరుడు వధువును ఏడడుగుల దూరం నడిపించటాన్ని అరవంలో 'సప్తపది' అంటారు. తరువాత వరుడు వధువు చేతిని పుచ్చుకోవటం, పాణిగ్రహణం జరగటంతో అప్పటి కార్యక్రమం ముగుస్తుంది. చీకటి పడగానే వధువు 'అరుంధతి'ని చూడటం, ఆ తరువాత హోమాదులు జరపటం పరిపాటి.

సాయంత్రం వేళ ఆతిథ్యం ఉంటుంది. బంధువులూ, మిత్రులూ వచ్చి వధూవరులను ఆశీర్వదించి వెళతారు. సంగీత కాలక్షేపం కూడా కొన్ని సందర్భాలలో ఏర్పాటు చేస్తారు. వధూవరులు పందిరిలో కూర్చొని వచ్చి పోయే పెద్దలకు ముకుళిత హస్తాలతో వినమ్రమూర్తులై ఉంటారు.

ఫోటోలు, వ్యాసం:
ఎన్. రామకృష్ణ.

పాడటమంటే ఏది పాడాలో ముందే నిర్ణయించుకొని పదిసార్లు పాడి చూసుకుంది. రావు సరసుడు గాబట్టి కృష్ణశాస్త్రి ప్రణయ కవిత్వం అంటే మోజు ఉండి ఉండాలి. వాటిలో ఒక గేయం బాగా ప్రాక్టీసు చేసింది. అయితే ఇంకా 'పరీక్ష' మొదలవలేదు. ఏ క్షణంలో మొదలవుతుందో తెలియదు. ఎక్కడికి తీసుకు వెళ్తాడు? ఊరు బయటికా? హోటలుకా?

ఉష కెందుకో హిచ్‌కాక్ సినిమా చూస్తున్నప్పుడు కన్నా యెక్కువగా గుండెలు కొట్టుకుంటున్నాయి.

నాంపల్లి స్టేషను దగ్గరికి వచ్చాక కారు ఆగింది, ఒక పూల అంగడి ముందు. ఇద్దరు ముగ్గురు కుర్రాళ్ళు పూల గుత్తులో చుట్టేశారు. అనుకున్నంతా అయిందని నవ్వుకుంది ఉష.

ఒక చిన్న మల్లెదండనీ, గులాబి కొని 'తీసుకోండి' అన్నాడు రావు.

ఉష అతనికేసి మొట్ట మొదటి సారిగా కళ్ళు తిప్పింది. అతను మొగం అటు తిప్పినా, ఆమెకేసి చూడ్డం లేదు. ఆ మొగంలో యెటువంటి భావం, అనుభూతి కనబడ్డంలేదు. ఉష నెమ్మదిగా అందుకొని తలలో తురుముకుంది.

ఆ తర్వాత కారు వేగం పుంజుకుని కదిలి గార్డెన్స్‌లో ప్రవేశించింది. అంత మంది జనంలో ఇద్దరూ కూర్చొని మాట్లాడుకోడానికి అసలాత యెక్కడుంటుందో బోధ పడలేదు ఉషకి. వాళ్ళందరి మధ్య తను పాడాలా? అలా కృత్రిమమైన నవ్వు, గుబుర్ల

గులాబిముళ్ళు

19 వ పేజీ తరువాయి

పాటునే కొంత మేరకు. ఉష తనలో తానే ఏకాంతం ఎక్కడ వీలవుతుందో ఎన్నుకోసాగింది.

జూ పక్క కేఫ్ ముందు ఆపాడతను. ఆ తర్వాత అటు తిరిగి వచ్చి తలుపు తెరిచాడు. ఆమె దిగింది. ఇద్దరూ లోపలికి నడిచారు. లోపల కుటుంబాలకి ఏర్పాటయిన గదిలో వాళ్ళిద్దరే.

"ఏం తీసుకుంటారు?"— గౌరవం కోసం చేర్చిన 'రు' తప్పించి అతనడిగే పద్ధతి చాలా మామూలుగా ఎవరో స్నేహితుణ్ణో లేక భార్యనో అడిగినట్టుంది.

ఆమె సమాధానమేం ఇవ్వలేదు.

అతనే యేదో ఆర్డరిచ్చాడు.

బేరర్ రోజ్ మిల్క్ గ్లాసులు తెచ్చేలోపల అతను గోడ మీద కాలెండరు బొమ్మకేసి అదేపనిగా చూశాడు. ఒకటి రెండు సార్లు కనుకొనల్నుంచి చూసింది ఉష. అతని మొగంలో యెటువంటి ఉద్వేగం లేకుండా అంతకన్నా జరగాల్సిందేం లేదన్నట్టు ప్రశాంతంగా ఉంది.

తాగడం అయ్యాక, 'వెళ్దామా?' అన్నాడతను లేచి. ఉష లేచింది. ఇద్దరూ బయటికి వచ్చారు.

కారు ఇవతలి గేటు బయటికి వచ్చి అసెంబ్లీ ముందు నుంచి పోసాగింది. ఇదంతా తనని స్థిమిత పర్చడానికి చేసిన కార్యక్రమం, ఇంక పైన మాట్లాడతాడు అనుకొంది ఉష.

లక్డీకాపూల్, పిక్చర్‌హౌస్ మీంచి తిరిగి వెనక్కి మళ్ళింది కారు.

"ఏమన్నా అడగాల నుందా?" అడిగాడతను.

ఉష తల అడ్డంగా వూపింది.

కారు ఇంటి ముందు ఆగింది.

ఉష దిగివచ్చి తిన్నగా పడక గదిలో జేరింది. తల్లి, ఉమ పక్కన జేరారు.

"ఏమయిందే?" అడిగింది ఉమ.

"ఏం జరిగిందే?" అంది అమ్మ.

"మల్లెపూలు కొనడం, రోజ్ మిల్క్ తాగడం తప్పించి, అయిందీ, జరిగిందీ యేం లేదు!" ఉష నవ్వింది. ఆ నవ్వులో పేలవం, ఆ స్వరంలో ధ్వనించిన విసుగు మిగతా ఇద్దర్నీ అనుమానంలో ముంచేసింది.

అతను వెళ్ళిపోయాడు.

"ఏం జరిగిందే అసలు?" ఉమ గుచ్చి గుచ్చి అడిగింది కాసేపాగి.

"చెబుతున్నాగా! కారు ఈ రోడ్డు వెంట వెళ్ళి ఆ రోడ్డంట తిరిగి వచ్చింది. మధ్యలో రెండు చోట్ల ఆగింది. ఒక చోట మల్లెదండ కొనియ్యడం, రెండో చోట రోజ్ మిల్క్ హోటల్లో తాగడం అయింది, అంతే!"

ఇంటికి వెళ్తుంటే ఉమకి, ఉషతో విరుల్లాసం, నిరాశ చాలా లోతైన వేళాకోళమన్నట్టు అనిపించింది. ఉషని చిన్నప్పట్నుంచి ఎరిగుండడం మూలాన ఆమె బాగా అర్థమవుతుంది ఉమకి. ★

హార్లిక్స్ చేసే మంచికి ఒక ఉదాహరణ:



నా మనస్సు చివుక్కుమంది. క్రొత్త కంపెనీలో పై పదవి ఖాళీగా వస్తుంది కనుక నేను ప్రమోషనుమీద ఎంతో త్వరగా అవుతుందని ఆశించేను. కాని అధికారి ఆగ్రహంతో నా కోర్కెలు కరిగిపోయాయి.



ఆరోజు రాత్రి నా భార్యతో "ఇదిగో, ఉద్యోగమంత మనకు ఇదే అన్న మాట అవును." అన్నాను దిగాగ్గా. ఆమె ఏదయ్యాహాపడి సాధింపు ప్రారంభించింది. "బాగుంది, మీ పరువు. ఆఫీసులో సాధింపు రావడమే మీ ఉద్దేశం." అన్నాను.



ఆమె యిలా అంది. "చూడండి, నా గురించి నేను అనడములేదు. చాల వారాలనుండి మీరు నీరసముగా, ఏదో ఆలోచిస్తూ ఉంటున్నట్లు చూస్తున్నాను. నా మాట విని ఒకసారి డాక్టరు దగ్గరకు వెళ్ళండి."



ఆమె చెప్పిన విషయమూ నిజముగానే ఉంది, కోపం ఆరాగానే వెళ్దామని డాక్టరు దగ్గరకు వెళ్ళేను. ఆయన యిలా అన్నారు "మీరు అవేశ సమస్యంతో కష్టపడి పనిచేస్తున్నారేమో, మీకు ఎక్కువ పోషణ కావాలి. తగినంత పోషణ కలుగుటకు మీరు రోజూ హార్లిక్స్ త్రాగండి. మీరు దృఢముగా ఉంటారు."



రోగమునుండి కోలుకొంటున్న వారికి డాక్టర్లు హార్లిక్స్ వాడమనడము నాకు తెలిసినదే. దానిని నేను ఎందుకు త్రాగాలో నాకు అర్థము కాలేదు, కాని మా ఆవిడ బలవంతముమీద రోజూ హార్లిక్స్ త్రాగడము ప్రారంభించేను.



గోధుమ పిండి, మాల్టెడ్ బార్లీల పోషణతో కూడిన శ్రేష్ఠమైన డెయిరీ పాలతో తయారయే హార్లిక్స్ నాకు కొద్ది రోజుల్లోనే ఎక్కువ శక్తి ఉత్సాహములను కలిగించింది. ఆఫీసులో నా పనిని మెచ్చుకొని నన్ను ప్రమోషనుమీద మా ఊరికి దగ్గర ఊరు బదిలీచేసేరు. హార్లిక్స్ చేసిన మేలు మేము ఎన్నటికీ మరచిపోలేము.



హార్లిక్స్ అదనపు శక్తిని కలిగించును!

కలిసిన ఆశయాలు

ఆనంద కృష్ణ



ఇంట్లోనూ బయటా కూడా 'పెళ్ళి' చేసుకోమని ఒత్తిడి ఎక్కువే అవుతోంది మూర్తి మీద... అడ్వొకేట్‌గా బోర్డు కట్టిన కొద్ది రోజులనుంచి ప్రతివాళ్ళూ పెళ్ళి చేసుకోమని సలహా ఇచ్చేవారే. ముందర రోజుల్లో "ఇంకా కొంచెం ప్రాక్టీస్—వచ్చేలోగా ఎలాగండి.." అంటూ వాయిదా వేస్తూ వచ్చాడు. కొద్ది సంవత్సరాల్లోనే ఆ ప్రాక్టీసు పెరిగింది, దాంతో అతనిమీద ఒత్తిడి ఎక్కువయింది.

ఎంతో మంది వచ్చేవారు పిల్లనిస్తామని. కొంత మందిని మూర్తి తండ్రే ఏదో కారణం చెప్పి పంపించేసేవారు. మరికొంత మందిని మూర్తి వద్దనేవాడు.

మూర్తికి ఆ అమ్మాయిలు నచ్చక పోవడంకంటె తన ఆశయాలకు తగ్గ మనుష్యులు రాకపోవడమే అతను వాళ్ళెవరినీ చేసుకోక పోవడానికి కారణం... అతని కోర్కెలు అంత గొంతెమ్మ కోర్కెలేం కావు..!

అతనికి కావలసిన పిల్ల....!

అమ్మాయి చదువుకున్నదై ఉండాలి... చలాకీగా కన్పించాలి. వచ్చిన అతిథులను సత్కరించి పంపించ గలదై ఉండాలి. అందం విషయంలో అప్సరస ఏం అక్కర్లేదు..... సంస్కారం, సభ్యత.. ఇవన్నీ ఉంటే చాలు.

వీటన్నిటి కంటే ముఖ్యమైనది.. వాళ్ళ బేరం మనుష్యులు కాకూడదు... ఇటువంటి ఆశయాలూ, అభిరుచులూ ఉన్నా వచ్చిన సంబంధాలేం కుదరక పోవడానికి కారణాలు....

ఒకాయన వస్తూనే మరోమాటామంతీ లేకుండా పెళ్ళంటే ఏదో వ్యాపారంలా మాట్లాడటం మొదలు పెట్టాడు. ఆయనకి ఇద్దరు అమ్మాయిలుట... ఒక అమ్మాయికి అ క్రితం సంవత్సరమే ఓ ఆరు వేలు కట్నం ఇచ్చి... ఓ ఇంజనీరు గారికిచ్చి పెళ్ళి చేశాడుట. అమ్మాయి ఎస్.ఎస్.ఎల్.సి. వరకు చదువుకుందిట. ఆయనతో కూడా వచ్చినాయన మొదలు పెట్టాడు... అమ్మాయి చాలా తెలివైనదిట, చాలా బావుంటుందిట, పాడుతుందిట. ఒకటేమిటి నిజమో అబద్ధమో కాని... అన్ని సద్గుణాలు ఏకధాటిగా వర్ణించేశాడు. తక్కిన విషయాలెలా ఉన్నా 'ఆరువేలు కట్నం ఇస్తారుట తనకి'.. ఇదేమైనా మార్కెట్టులో కూరగాయలు కొనదలుచుకున్నారేమో!

అక్కడితో ఆగలేదు. తను ఊఁ! అంటే ఆ అమ్మాయిని తన వూరే తీసుకువచ్చి చూపిస్తాడుట...

మూర్తికి అర్థంకాని విషయం ఎంత ఆడపిల్ల తండ్రి అయితే మాత్రం... అంత చిత్రం చిత్రంగా అనడమెందుకో!! .. లేకపోతే అమ్మాయిని తీసుకు వచ్చి చూపిస్తాడుట— 'సమయం కూడా తీసుకు వచ్చెయ్యలేదు'... అనుకున్నాడు.

మరో పెద్ద మనిషి— అమ్మాయి రూపురేఖా లావణ్యాలు, చదువు వచ్చిన లలిత కళలు, వచ్చిన

ప్రొఫెసర్ చిన్న కూతురికి పెళ్లి కుదిరిందట. పెద్దమ్మాయి చదువుమీద చాలాఖర్చు పెట్టాడుట. అంచేత కట్నం ఓ అయిదువేల కంటే ఇవ్వలేడుట.

ఎవడేడిచాడు కట్నం ఇమ్మని!? తనుకాని తన ఇంట్లో వాళ్లు కాని కట్నం విషయం ఎత్తనప్పుడు ఆ విషయం అప్పుడు ఎందుకు మాట్లాడవలసి వచ్చిందో!?

ఆ ఒక్క మాటతో ఆ సంబంధం తప్పిపోయింది. ఆ పెద్ద మనిషి ఆ కట్నం విషయం బజార్లో కూరగాయల బేరంలా చెప్పకపోతే— కనీసం ఆ అమ్మాయిని చూడటానికైనా వెళ్లి వచ్చేవాడు— ఆయన మాట్లాడిన తీరుతో కనీసం ఆ అవకాశం కూడా లేకపోయింది. లేక పోతే ఆ అమ్మాయిని తను చూసి వచ్చింటే ఏం జరిగేదో!...

ఎవరినోటంటతో విన్నాడు ఒకసారి— కట్నం 'ఏడువేల ఎనిమిదివందల యాభై' రూపాయలుట— ఆ విషయం మీద ఎన్ని బేరాలు జరిగి ఉంటాయో, మధ్యవర్తులు ఎంతమంది ఉండిఉంటారో, పెళ్లి ఎలా జరిగి ఉంటుందో ఆ 'అంకె' చెబుతుంది.... రేడియో ధరలు చెప్పినట్టుగా... ఇరవై ఎనిమిది రూపాయల తొంభై మూడు పయాసైసలు అన్నట్టు కట్నం 'ఏడువేల ఎనిమిది వందల యాభై!... ఇవ్వ దలచుకున్నవాళ్లు పుచ్చుకోదలచుకున్నవాళ్లకు ఏదో గవర్నమెంట్‌గా మాట ఇచ్చేసి 'ఊరుకోక పదిమందితోటి మాఅమ్మాయికి అయిదువేలో, పది వేలో కట్నం ఇచ్చి పెళ్లి చేశామని చెప్పుకోవడం ఎందుకో!? మూర్తి దృష్టిలో అమ్మాయికి కట్నం ఇచ్చి చేశామని చెప్పుకోడం సిగ్గుచేటు....

తనకు తెలిసిన పెద్దమనిషి ఒకాయన 'పూర్వ జన్మంలో ఏదో పాపం చేస్తే ఈ జన్మలో ఆడపిల్లల తండ్రి అయి తీరతాడు' అన్నట్టు మాట్లాడటాడు... ఇటువంటి విషయాలు అమ్మాయిలకు తెలిస్తే ఆడ జన్మ ఎత్తడమే పాపం అనిపిస్తుంది.. తండ్రి బాధలు చూడలేక తనను చేసుకోడానికి (ఏ పదివేలు కట్నం తీసుకుని) ఒప్పుకున్న ఎవరినైనా చేసుకోడాని కొప్పేసుకుంటారు అమ్మాయిలు... వాళ్లకీ ఉన్న ఆశయాలూ అభిరుచులూ అన్నీ చంపుకుని!!?...

తనకూ ఎన్నో ఆశయాలు అభిరుచులూ ఉన్నాయి. అలాగే అమ్మాయిలకూ ఏవో కోరికలు, అభిప్రాయాలూ ఉండొచ్చు. అందుకనే తను ఎవరినైనా అమ్మాయిని చేసుకోడానికి నిశ్చయించుకొంటే ఆ అమ్మాయి అభిప్రాయం కూడాతెలుసుకోవాలి అన్న కోరిక కూడా లేకపోలేదు మూర్తికి... ఇదే విషయం తన మిత్రుడు శాస్త్రితో అంటే "ఎందుకు నవ్వుకోరూరా నీకేం లోటు... అనవసరంగా ఆ అమ్మాయి అభిప్రాయం అడిగావంటే ఆ అమ్మాయి దృష్టిలో దిగజారి పోతావ్" అని జవాబు.

దేంట్లో....దిగజారి పోవడమేమిటో!?

అమ్మాయిలు ఇష్టంలేని పెళ్లికి బలవంతం మీద ఒప్పుకుని తరువాత ఇష్టంలేనిపని చేశామన్న బాధతో తమ జీవితం నరకం చేసుకుని సంసారాన్ని జీవితం నరకం చేయడం— వాళ్ళు చేసిన, కనీసం చేశామనుకున్న త్యాగానికి పర్యవసానం...

ఆ పెళ్లి ఇష్టం లేనప్పుడు మొహంమీద చెప్పె య్యొచ్చుగా!? అన్న అనుమానం—వెంటనే, "పాపం వాళ్ళు మాత్రం ఏం చేస్తారు... తండ్రుల బాధలు చూడలేక 'ఎవరో ఒకరు' అని ఒప్పుకుంటారు"

అని వాళ్ళమీద ఓ విధమైన జాలి... ఇటువంటి ఎంత ఎంత ఆలోచనలు మూర్తికి...

మూర్తి తండ్రి మూర్తికి తగ్గవాడే... మూర్తి ఎంత అంటే అంత. ఆయన ఉద్దేశ్యంతో వివాహం విషయంలో మొహమాటాలు, బలవంతాలు పనికి రావు. అందుకే మూర్తి విషయంలో అతనికి నచ్చితే కాని తనేం చెప్పనవేవారు....

* * *

ఆ రోజు తన ఆఫీసు గదిలో కూర్చుని ఏదో పని చూసుకుంటున్నాడు. అంతలో ఎవరో పెద్ద మను షులు రావడం తిన్నగా నాన్నగారి గదిలోకి వెళ్లడం చూశాడు. వాళ్ళెవరు అయి ఉంటారా అని ఆలోచించే లోపునే తనకు పిలుపు వచ్చింది నాన్నగారి దగ్గరనుంచి.

పరిచయాల తరువాత అసలు విషయంలోకి దిగింది సంభాషణ— ఆ వచ్చిన వారిద్దరూ అన్న దమ్ములుట— ఆ చిన్నాయన నాన్నగారికి తెలిసిన వాడేనట.

ఆయన చెప్పవలసింది క్లుప్తంగా చెప్పాడు.

అమ్మాయి పేరు 'శారద'ట యూనివర్సిటీలో ఎమ్.ఏ. చదువుతోందిట.... శారద పేరు వినగానే మూర్తికి ఓ విధమైన సదభిప్రాయం ఏర్పడింది. కారణం ఆ పేరుతో అతనికి వినయం, వినమ్రత, రూపం అన్నీ కన్పిస్తాయి... అంతకంటే మరేం విశేషాలు చెప్పలేదు. వీలయినప్పుడు తన ఇంటికి రమ్మని ఆహ్వానించి వెళ్లి పోయారు.

* * *

శారద తనకువచ్చిన 'టెలిగ్రాం' రూమ్‌మేట్ సరోజకు చూపించింది... "నీవు వెంటనే రావలసింది నీరాక ఎంతైనా అవసరం" ఇది ఆ టెలిగ్రాం తాత్పర్యం.

సరోజ ఆ టెలిగ్రామ్ చూసి ఇంతేనా అన్నట్టు చూసింది. పైగా చిరునవ్వు నవ్వింది కూడా.

"నాకేమో టెలిగ్రామ్‌వస్తే నీకేమో నవ్వులాటగా ఉందే!?" సరోజను అడిగింది శారద.

"లేదోయ్... ఆ టెలిగ్రామ్ చూస్తే నవ్వొచ్చింది. ఆ టెలిగ్రామ్ ఎందుకు ఇచ్చి ఉంటారో తెలుసా?

"ఇంట్లో ఏమైనా నీకు పెళ్లి చేసేద్దామను కున్నారా!?"

"మా బామ్మ పెట్టు దలోయ్ — నాన్నగారిని తొందర చేస్తోంది."

"అంయితే ఇకనేం— తమర్ని ఎవరో చూసుకో డానికి వస్తున్నారన్న మాట... నీకింకా ఇటువంటి అనుభవం లేదు కదూ!? ఆల్ ది బెస్ట్."

"ఒకటి మటుకు నిజమోయ్.. మా బామ్మ నా పెళ్లి చేసేద్దామని ఎంత తొందర పడ్డా— నాకు నచ్చే అబ్బాయి దొరికేవరకు ఆగారుకుంటుందిట... నాకు నచ్చే అబ్బాయి ఎలా ఉండాలో తెలుసా....!?"

"చెప్పందే ఎలా తెలుస్తుందోయ్!?" ఎదురు ప్రశ్న వేసింది సరోజ.

"అంయితే విను.. మొదటిది చదువుకున్నవాడై ఉండాలి. రెండు 'కట్నం' అడగకూడదు.. మనల్ని 'వ్యక్తి'గా చూడాలి..."

"అంటే నువ్వు చదువుతున్నది ఎమ్.ఏ. కాబట్టి ఓ. పి. హెచ్.డి..అబ్బాయి నీ మాటలకు విలువ ఇచ్చి అసలు పెళ్లికి ముందర నీ అభిప్రాయం కూడా తెలుసుకోవాలి... అవునా!?"

"ఏం! దాంట్లో తప్పేం ఉంది!? జీవితాంతం కలిసిఉండవలసిన వాళ్లు ఆ సంబంధం నిర్ణయించుకునే ముందు ఒకరి అభిప్రాయాలు ఒకరు తెలుసు కోవడంలో!?"

"తప్పేం లేదు... ఎటొచ్చీ ఆచరణయోగ్యం కాదు. ఏదో విషయం నీ ఆశయాలు ఫలించాలనే 'విష్' చేస్తాను.అంయితే అటువంటి ఆలోచనలు వీలయినంత వరకు తగ్గించుకో. లేకపోతే అనవసరంగా బాధపడ వలసి వస్తుంది" బాధగా అంది సరోజ.

"ఏం... "

"నీ ఆశయాల్లో ఒకటి కట్నం అడగకూడదు. అవునా!? నా విషయమే తీసుకో... ఈ నెలవుల్లో నా పెళ్ళని చెప్పాను కదూ? కట్నం ఎంతో తెలుసా? ఆరు వేలు. అంటే జీవితంలో నా విలువ వెలవెల ఆరువేలన్న మాట"

"అంయితే ఎందుకు ఒప్పుకున్నావోయ్!? 'నో' అని ఉండవలసింది"

"అనిఉండేదాన్ని... అంయితే పరిస్థితులు అనిపియ్య లేదోయ్"

"అంటే!?"

"చెప్పాలనికేముందోయ్... నాకూ ఆశయాలుండేవి.. 'కట్నం' అడిగిన వాడిని పెళ్లి చేసుకోకూడదని అనుకున్నాను... అంయితే ఆ నా ఆశయంవల్ల నాన్న గారి బాధలు ఎక్కువే చేసింది. ఇప్పుడనుకుంటూ ఉంటాను. 'బియ్యే' అయి పోగానే చదువు మానేసి ఉంటే రెండేళ్లు ఎమ్.ఏ. ఓ ఏడాది రిసెర్చి డబ్బు మిగిలేవి... పాపం నాన్న గారికి ఇదో అనవసరమైన ఖర్చు. దానికి తోడు అన్నయ్య పెద్దలు లేకపోతే ఏమయ్యేదో!? కనీసం అయిదుగురో ఆరుగురో వచ్చారోయ్ నన్ను చూసుకోడానికి— వచ్చిన వాళ్లతో కొంత మంది మాకు నచ్చక పోవడమో లేకపోతే వాళ్లే వద్దనడమో జరిగింది... రకరకాల సమస్యలు— ప్రతి వాళ్ళకీ పరాయి వాళ్ల డబ్బు కావాలి. అమ్మాయి చదువుకంటే—అమ్మాయి సంస్కారం, రూపం అన్నిటికంటే ముఖ్యమైనది విలువైనది ఆ అమ్మాయి తీసుకువచ్చే నోట్ల కట్టలు."

"అందరూ అలాగే ఉంటారంటే నేనొప్పుకో నోయ్"

"శారదా.. నువ్వు ఇంకా అనుభవం లేనిదానివోయ్. నీ దగ్గర దాపరిక మేమిటి... చెబుతా విను.. మొట్టమొదటగా నన్ను చూసుకోడానికి ఓ ఇంజనీర్ గారు వచ్చారు. నన్ను చూసి వెళ్లి పోయిన తరు వాత మధ్యవర్తి ద్వారా 'కట్నం' విషయం బేరమాడి నట్టు మాట్లాడించారు... మా నాన్న గారికి మా ఇంట్లోఎవరికీ ఈ విషయం నచ్చలేదు. మేమే ఆ సంబంధం వదిలేస్తే వాళ్ళకేమో నామర్దా అని జాత కాలు కుదరలేదని కబురు పెట్టేశారు.

మరో చిన్న ఆఫీసరుగారు.. బోలెడంత ఆస్తి ఉంది. కట్నాలంటే అసలు వాళ్ళకి ఇష్టం లేదుట—ఎటొచ్చి అలక పాన్పుమీదనే అంబాసిడర్ కారు కావాలిట— పాపం! చిన్న కోరిక.

మరొక ఆయనకు ఓ చెల్లెలుంది — ఆ అమ్మాయి పెళ్లి ఆయనే చెయ్యాలిట— ఆమెకోసం పదివేలు కావాలిట... పాపం అది నిజమే ఆయన మాత్రం ఆయన చెల్లెలి పెళ్లి ఎలా చేస్తాడు!?...

మా నాన్నగారు ఏదో సంబంధాలు తీసుకురావడం అవి కుదరకపోవడం— నాన్న చిన్నబుచ్చుకోడం .... వేలకువేలు కట్నాలు మా నాన్న మాత్రం ఎక్కడ

కుంది తీసుకొచ్చి ఇస్తారేమో. అయినా చివరికి ఈ సంబంధం నిశ్చయించారు.....

పైసా కట్నం లేకుండా ఎవరైనా పెళ్లి చేసుకుంటే వెనకాతలే ఏవేవో అంటారు... అంతెందుకు! మా అన్నయ్యకు కట్నం పుచ్చుకోకుండా చేసుకున్నామని 'ఏదో ఉండి ఉంటుంది—లేకపోతే నిక్షేపంలా ఉద్యోగం చేసుకుంటూ కట్నం పుచ్చుకోక పోవడమేమిటి!?' అన్నారు.

మా సీనియర్ ఒక అమ్మాయి తండ్రి బాధలు చూడలేక ఎవరో ఒక లెక్చరర్‌ను చేసుకుంటే ఆ అమ్మాయిని, ఆ లెక్చరర్‌నీ నానా మాటలు అన్నారు — వాళ్లది ఆదర్శం కాదుట— ఆశయం అసలే కాదుట—కేవలం గ్రుడ్డి ప్రేమట... ఇలాగే ఉంటాయ్ ఎదుటి వారి బాధలను సహృదయంతో అర్థం చేసుకునేవాళ్లు చాలా తక్కువ... మన ఆశయాలను పట్టుకుని వేళ్లాడితే వచ్చేది మన తండ్రులకే బాధ''

తన కథ క్లుప్తంగా చెప్పుకుని... ''శారదా! నా విషయంలో నాకు ఆ అదృష్టం లేదోయ్.. నీకైనా ఆ అదృష్టం కలుగుతుందేమో!? ఆల్ ది బెస్ట్...'' నవ్వుతూ అంది సరోజ.

* * *

ఆవూరు వెళ్లిన రోజునే తనకు కాలేజీలో క్లాస్‌మేట్ కమల కనిపించింది. ఏవో మాటలు చెబుతూ అంది ''శశికి పెళ్లయ్యిందోయ్. కట్నం ఏం తీసుకోలేదుట పెళ్లికొడుకు...డాక్టరుగారు...మేం అందరం నిజమే అనుకున్నాం... అయితే తరువాత తెలిసిన విషయం ఏమిటంటే ఆయన డిస్పెన్సరీ తెరవడానికి ఖర్చు పెట్టిన సుమారు నలభై వేల రూపాయల్లోను సగం శశి నాన్న గారు ఇచ్చారుట. ఎలా ఉంది!''

సరోజ చెప్పిన మాట చాలా వాస్తవికంగా కన్పించాయి శారదకు. రేపు రాబోయే పెళ్లికొడుకు ఎటువంటి వాడో! ఏ మాత్రం అసభ్యంగా ప్రవర్తించినా మొహంమీద తిట్టేయ్యాలన్నంత కోపం వచ్చింది శారదకు.

* * *

వాళ్ల కాఫీ ఫలహారాలు పూర్తయిన తరువాత శారద డ్రాయింగ్ రూంలోకి వచ్చింది.

''మా అమ్మాయి శారద— యూనివర్సిటీలో ఎమ్.ఏ. చదువుతోంది'' అంటూ శారదను పరిచయం చేసి మూర్తినీ, మూర్తి తండ్రినీ ఏలూరులో ఎడ్వొకేట్స్‌గా పరిచయం చేశారు శారద తండ్రి.. ఆయనతో పాటు ఆయన తమ్ముడు— మరో పై మనిషి ఎవరూలేరు. నమస్కార ప్రతినమస్కారాలు జరిగాయి.

మూర్తి ఆమెవైపు చూశాడు. సరిగా అదే సమయానికి తనవైపు చూస్తున్న ఆమె సహజమైన సిగ్గుతో తల వంచేసుకుంది. నిరాడంబరమైన వేషం.. 'శారద' అనే పేరుతో తనువూహించుకునే సౌందర్యం, మొహంలో అమాయకత— వినయం, విధేయత అన్నీ ఆమెలో మూర్తీభవించినట్లు అన్పించింది మూర్తికి.

కొద్ది క్షణాలు నిశ్శబ్దం...

''ఎమ్. ఏ. లో మీ గ్రూప్ ఏమిటండీ'' అంతవరకూ ఆలముకున్న నిశ్శబ్దాన్ని చీలుస్తూ మూర్తి ప్రశ్న.

పబ్లిక్కుల్లో ప్రశ్న వేస్తాడు కాబోలు,,, ఒకవేళ ఏమయినా అటువంటి పని చేస్తే తగ్గట్టే జవాబు చెప్పొచ్చు అనుకుని ''ఎకనామిక్స్'' అంది.

''రమణారావు —మీ డిపార్ట్‌మెంట్ అనుకుంటాను''

ఎంత పొరపాటు చేద్దాను...!? అనుకుని ''అవునండి మా డిపార్ట్‌మెంటే... అయితే మాకు రారు''

''అతను నాకు బియ్యేలో క్లాస్‌మేట్ లెండి... కాలేజీలో ఉన్నంత కాలం నాటకాల్లో వేషాలూ, ఆటలూ చాలా ఏక్టివ్‌గా ఉండేవాడు.''

శారద నవ్వుతూ ''ఇప్పుడు అంతే లెండి మాకీ యూ. ఎస్. కాశ్మీర్ ఇష్యూ, ఇటువంటి వాటిలో ముందర కన్పించేది ఆయనే.''

దాంతో తక్కిన పెద్ద మనుష్యులకి అవకాశం చిక్కింది.

కాశ్మీర్ సమస్యపై సంభాషణ ప్రారంభం అయ్యింది...

కాశ్మీర్ సమస్యపై పాశ్చాత్యదేశాల వైఖరీ... కాశ్మీర్ హిందూ దేశంలో ఎలా కలిసి పోయిందో—పాకిస్తాన్ దురంతరాలు— ఒకటేమిటి అదే కాశ్మీర్ సమస్యపై ఇండియాను సమర్థించే దేశాల కాన్ఫరెన్స్ అయి పోయింది. ఎవరికి తోచింది వారు చెబుతున్నారు.

ఒకడు : ప్రయాణానికి బయలుదేరే సమయంలో కుక్క ఎడమవైపునుంచి పోతే మంచిదా? కుడివైపునుంచి పోతే మంచిదా ?

మరొకడు : మీదబడి కరవకుండాపోతే మంచిది.

సుబ్బారెడ్డి (కోవెలకుంట్ల)

అంతలో లోపల్నించి 'శారదా' అని పిలవటంతో లోపలికి వెళ్లిపోయింది శారద. లోపల మూర్తి తల్లి, చెల్లెలు రాధా, శారద తల్లికూర్చుని ఏవో మాట్లాడుకుంటున్నారు. శారద వాళ్ల దగ్గర కూర్చుంది.

అందరూ నిశ్శబ్దంగా ఉండటం నచ్చక శారదే మొదలు పెట్టింది. సంభాషణ. ''మీరేం చదువుతున్నారండీ?'' రాధను అడిగింది.

''బి. ఎస్సి''

''ఏ కాలేజీలో!?''

''ఏలూరు లేడీస్ కాలేజీలో''

''మీకు బాటనీ లెక్చరర్ గిరిజ తెలుసునా! ?''

''మా లెక్చరర్ మీకు తెలుసునా!?'' రాధ అడిగింది.

''యూనివర్సిటీ హాస్టల్స్‌లో చాలా స్నేహితురాలు.. అక్కడ ఉద్యోగంలో చేరింది మొదలు ఒక్కసారి ఆవూరు రమ్మని ఒకటే గొడవ''

''తప్పకుండా రండి, మీరు మా కాలేజీ, మా వూరు చూద్దురుగాని యూనివర్సిటీ నేను చూడక పోయినా విన్నదాన్ని బట్టి మా కాలేజీ మీ యూనివర్సిటీలో ఓ బిల్డింగ్ అంత ఉండదు!''

''మీరు యూనివర్సిటీకి ఎప్పుడూ రాలేదా!?''

''లేదండి—డిశంబరునెలలో బాటనీ ఎక్స్‌కర్షన్ వద్దామనుకుంటున్నాం. బహుశా, గిరిజగారే మాతో వస్తారు.''

''ఆహా! అలాగా!! వచ్చే ముందర వ్రాయండి మీకు హాస్టల్ లోనే రూమ్స్ ఎరేంజ్ చెయ్యొచ్చు. డిశంబరులో అయితే ఓ వారం రోజులు ఉండేటట్లు రండి— యూనివర్సిటీ అంతా కళకళలాడుతూంటుంది— కాన్వొకేషన్—ఆంధ్రా వీక్స్ ఒకటి దాని తరువాత—మరొకటి—గిరిజకు నేను వ్రాస్తాలెండి.''

ఏవో యూనివర్సిటీ విశేషాలు చెబుతూనే ఉంది శారద. రాధ ఊఁ! కొడుతూనే ఉంది మధ్య మధ్య ప్రశ్నలతోటి. వాళ్ల గొడవలో పక్కన మరో ఇద్దరున్నారు అన్న విషయమే మర్చి పోయారు.

''ఇంక వెడదామే— నాన్నగారితో చెప్పు'' అంది రాధ తల్లి.

''వస్తామండీ'' అంటూ లేచారు. రాధ, తల్లీనూ, అందరూ డ్రాయింగ్ రూంలోకి వచ్చారు. అంతవరకు ఇంకా 'కాశ్మీర్' సమస్య పై చర్చ సాగిస్తున్న వాళ్లందరూ వీళ్లను చూడగానే వాళ్ల చర్చ వాయిదా వేశారు సెక్యూరిటీ కౌన్సిల్ మీటింగ్‌లా.

రైలు బండికి సిగ్నల్ ఇచ్చినట్లు ''వస్తామండీ'' అంటూ లేచారు మూర్తి తండ్రి, మూర్తీనూ...

''వెళ్లగానే వ్రాస్తామండీ'' అన్నారు మూర్తి తండ్రి.

''మంచిదండీ''

గుమ్మందాకా వచ్చి సాగనంపారు వాళ్లను శారద తండ్రీ, చిన్నాన్నానూ.

రైల్లోనే అన్నారు మూర్తి తండ్రి ''నీ ఇష్టమోయ్, ఆ అమ్మాయి చిన్నాన్న నాకు నాకు బాగా తెలుసు.. చాలా మర్యాదస్తులు ఆ విషయం ఆలోచించక్కర్లేదు'' అని.

''అమ్మాయి లక్షణంగా ఉందిరా— ఏమయినా నీ ఇష్టం'' అంది మూర్తి తల్లి.

''భలేగా చెబుతుందిరా కబుర్లు—యూనివర్సిటీ విశేషాలు ఎన్ని చెప్పిందనుకున్నావ్... మా బాటనీ లెక్చరర్ గిరిజగారు తనకు చాలా స్నేహితురాలట''— కొత్త చుట్టరికం కనిపెట్టినట్టు చెప్పింది రాధ.

* * *

మూర్తి ఆలోచనలో పడ్డాడు. ఆ రోజువరకూ అమ్మాయి అభిప్రాయం కనుక్కుంటే కాని పెళ్లికి ఒప్పుకోను అనే వాడల్లా ఆ అమ్మాయికి ఉత్తరం వ్రాస్తే... ఏమో!?ఏమనుకుంటుందో!? వ్రాయక పోతే శాస్త్రి నవ్వుతాడేమో!? పెళ్లయి పోయిన తరువాత ''మిమ్మల్ని చేసుకుందామని నేనెప్పుడూ అనుకోలేదు!?'' మావాళ్లు బలవంతంచేసి వప్పించారు. అంటుందేమో! అన్నీ అనుమానాలే.

చివరకు ధైర్యం చేసి ఎలాగైతేనేం ఓ ఉత్తరం వ్రాద్దామని నిర్ణయించుకున్నాడు— ఓ రెండు రోజులు ఆలోచించి.

* * *

''టెలిగ్రామ్ ఎందుకు ఇచ్చారోయ్!?'' ప్రశ్నించింది సరోజ.

శారద జవాబుగా నవ్వేసిపూరుకుంది.

''అయితే నేమూహించింది 'కరెక్టు' అన్నమాట''

''వూఁ''

"ఏమంటాడోయ్ పెళ్ళికొడుకు! ఏం చదువు కున్నాడు!? నిన్ను ఏంఏం ప్రశ్నలడిగారు? అబ్బాయి నీకు నచ్చాడా!? చెప్పవోయ్ నా దగ్గర దాపరికమెం దుకు... ఇంతకూ ఏమాత్రం ఖరీదులో ఉన్నాడు!?"

ప్రశ్నల పరంపర కురిపించింది సరోజ.

"అబ్బాయి అడ్వొకేట్‌ట... 'కట్నాలూ' పేరాల మనుష్యులు కారుట నాన్నగారు చెప్పారు..." శారద జవాబు ఇచ్చింది.

"చాలా అదృష్టవంతురాలివోయ్... అయితే ముహూర్తం ఎప్పుడు పరీక్షల తోపులో కాదుగా!?"

*   *   *

తనకు వచ్చిన ఉత్తరాన్ని చదివి నిజమో కాదో అని అనుమానంతో మరోసారి చదివి,,, సరోజకు చూపించింది.

ఆ ఉత్తరంలో ఇలా ఉంది

'డియర్ శారదా,

మీకు నేను ఈ ఉత్తరం వ్రాయడం ఆశ్చర్యంగానే కన్పించవచ్చు. చొరవచేసి ఈ ఉత్తరం వ్రాస్తున్నందుకు అపార్థం చేసుకోరని ఆశిస్తున్నాను.

వ్రాయ దలచుకొన్నది సూటిగా వ్రాయటం మంచిదనుకుంటాను. నాకున్న చిన్న కోరిక అ న ం డి..... ఆ శ య ం అ న ం డి— వివాహానికి ముందర అమ్మాయి అభిప్రాయం కూడా తెలుసుకోవాలని...—ఎదురుగా ఎలా అడగను ఆ విష యం? పైగా అడగడానికి ఆస్కారం ఏది..? దీనికి కారణం నేను వేరే వ్రాయక్కర్లేదనుకుంటాను. అనేక మంది విషయంలో చూశాను.... అబ్బాయి అంగీకారం తెలుపగానే అమ్మాయి అంగీకారం వచ్చి నట్టే ఒక వేళ అమ్మాయి అయిష్టత చూపితే పెద్ద వాళ్ళు నచ్చచెప్పడమో, బలవంతం చేయడమో జరుగుతుంది.

నా అంగీకారం తెలిపినంత మాత్రాన మీ ఇంట్లో మీకు ఇష్టం లేకపోయినా మీమీద వత్తిడి తీసుకు వస్తారన్న అనుమానం నాకు లేక పోయినా—మీ అభిప్రాయం కూడా ముఖ్యమే కదూ!?

ఇంతకంటే ఏం వ్రాయనూ! జవాబు వ్రాస్తారని ఆశించడంలో తప్పు లేదనుకుంటాను.

మూర్తి'.

*   *   *

"ఇటువంటి రోజు కోసమే ప్రతీవారు కలలు కంటారోయ్. తమ ఆశయాలకు, అభిరుచులకు గౌర వం ఇచ్చేవారు—తమకు వ్యక్తిత్వం ఉందని గుర్తించే వాడు— అంతకంటే ఏ అమ్మాయికి మాత్రం కావల సిందేమిటి...?? అందరూ కాకపోయినా కొందరైనా ఇటువంటి వాళ్ళుంటే ఆడపిల్లల తండ్రుల పరిస్థితి ఇలా ఉండేది కాదేమో!?... నిన్ను మనసారా అభినంది స్తున్నానోయ్— "ఇంతకూ జవాబేం వ్రాస్తావ్!?" ప్రశ్నించింది సరోజ.

"నచ్చాడోయ్" అని చెప్పడానికి సిగ్గుపడి "అదే నోయ్ జవాబేం వ్రాయాలో తెలియడంలేదు" అని "జవాబు వ్రాయాలంటావా!?" ఎదురు ప్రశ్న వేసింది శారద.

"జవాబు వ్రాయక పోవడం తెలివి తక్కువతనం.. నీ మాటకు విలువ ఇచ్చి నీ అభిప్రాయం అడిగినప్పుడు జవాబు వ్రాయక పోతే అది ఆయన్ని అవమానిం చడం!"

"అయితే జవాబేలా వ్రాయాలంటావ్!?"

అక్కడే ఉన్న లెటర్ పాడ్ తీసి చక్కటిదస్తూరితో మూడేమూడు ముక్కలు వ్రాసింది సరోజ.

'మూర్తిగారూ,

మీ ఉత్తరానికి జవాబేలా వ్రాయాలో తెలియదు. ఒకటి మటుకు వ్రాయగలను. నా అభి ప్రాయాలకూ, ఆశయాలకూ గౌరవం ఇచ్చే మిమ్మల్ని హృదయపూర్వకంగా గౌరవిస్తున్నాను.

ఆ ఉత్తరాన్ని చదివి—చిన్నగా నవ్వి అదే కాగితం మీద సంతకం చేసి పోస్టు చేసింది శారద. ★

కార్యసిద్ధి

ముద్దా చెల్లిబాబు



చిన్నారి వినాయకుడు త్రిమూర్తులకు సమస్కరించుట :

4

ఇవాళ కైలాసంలో ఒక చిత్రం జరిగింది విను.

పార్వతీదేవి తన ముద్దుబిడ్డడైన వినాయ కుణ్ని ఉయ్యాలలో పడుకోబెట్టి వూపుతున్నది. పసివాడు పడుకోక, పేచి పెడుతున్నాడు. 'అమ్మా ! బూచే ! బూచే !!—' అంటూ మాటిమాటికీ గుమ్మంవేపు చూపించి, మారం చేస్తున్నాడు.

పదేపదే పసివాడు ఇలా అనటం చూసి, దేవి ద్వారం దగ్గరకు వెళ్లింది. చూస్తే—గంపెడు పిల్లల తల్లి, ఒక దేవతా స్త్రీ—పండు ముత్తయిదువ నిల బడి ఉంది !

'ఎవరమ్మా నువ్వు ?' అని అడిగింది, దేవి.

"తల్లీ !—నన్నంతా 'దాదీ' అని పిలుస్తారు. పసిపిల్లలంటే సరి, ఎవళ్ల బిడ్డలయినా కానీ, నాకు ప్రాణం. 'ఇక్కడ, పార్వతీదేవి ముద్దుల బిడ్డడు గణపయ్య ఉన్నాడు, చూసిపో !' అని నా మనసు నాకు చెప్పింది. అందుకనే ఇలా వచ్చా. పుట్టుకలోనే మన పసివాడికి గొప్ప గండం గడిచిందట కదూ ?" అంటూ మెల్లగా తొట్టె దగ్గరకు వెళ్లింది.

ఏమోగాని, దాదిని చూడగానే దేవి మనస్సుకి అనుమానం తట్టింది. అందుచేత ఆ దాదిని కూచో మని అయినా అనలేదు. పసివాణ్ని ఆమె చేతి కివ్వ లేదు. ఆ ముత్తయిదువ కేసి అదేపనిగా చూడ సాగింది, పార్వతీదేవి.

చూసి చూసి, చొరవచేసి తొట్టె దగ్గరికి వెళ్లింది. దాది 'రారా బాబూ ! నా బంగారు తండ్రీ రారా !!' అంటూ బిడ్డడిని తీసుకుని, ముద్దులాడ బోయింది.

'అమ్మా !—ఎంతోమంది పాపలు నా పాలు తాగారు. వాళ్లందరు బాలారిష్టాలు లేకుండా హాయిగా ఉన్నారు. ఇప్పుడు మన గణపయ్యకూడా నా పాలిస్తాను, చూడు. మరి గండాలే రావు. ఏం తల్లీ ?—' అని చెప్పి, పాలివ్వబోయింది.

వద్దనలేక పోయింది, పార్వతీదేవి.

కొత్త లేకుండా, గణపయ్య దాది దగ్గరికి వెళ్లాడు. ఎగబడి, దాది దగ్గర పాలు జుపుకు జుపుకుమంటూ తాగుతున్నాడు !

కొంతసేపయింది.

దాది బాధతో మూలిగింది. క్షణాం సేపట్లోనే 'హా !—' అని ఒక గావుకేక పెట్టింది.

'ఏమిటమ్మా, ఏమిటే ?—' అంటూ దేవి కంగారుపడుతూ దగ్గరికి వచ్చింది.

బదులేమీ చెప్పలేదు దాది. ఇందాకటికంటె ఇంకా పెద్ద కేక పెట్టింది. అందరూ చూస్తుండ గానే, కైలాసం దద్దరిల్లేట్టు 'గణా ! గణా !!—' అని బొబ్బలెడుతూ, వెనక్కి విరుచుకు పడి పోయింది.! అలా పడిపొయ్యేటప్పుడు ఆ దాది ముత్తయిదువ రూపం పోయి, రాక్షసి రూపు వచ్చింది !—

ఆ దాది సామాన్యురాలు కాదు. శత మహిష భక్షిణి అనే రాక్షస స్త్రీ. మన మంత్రివర్గం ఈమెను ప్రోత్సహించి, గణేశుణ్ని చంపటానికని పంపించారు. ఇలా దేవతా స్త్రీ రూపంతో వెళ్లి వినాయకుణ్ణి అవలీలగా చంపవచ్చుగదా అనుకుంది. గానే గణపతికూడా విషపూరితమయిన తన పాలు ఇవ్వబోయింది. కానైతే—అలనాడు కృష్ణ భగవానుడు మాయ పూతనను చంపినట్టుగా ఇప్పుడు వినాయకుడు దాది పాలు తాగటంతో పాటు ఆమె ప్రాణాలు కూడా లాగేసి, తన లీలను చూపించాడు ! చూపులకు పసివాడయినా, ఎంత శక్తిమంతుడో చూశావా ఆ బాల వినాయకుడు ?—'

ఈ కథ చెప్పి, అనాటికి శుక్రాచార్యుడు సెలవు తీసుకున్నాడు.

5

శుక్రాచార్యుడు చెబుతున్నాడు.

మౌనంగా వింటున్నాడు సింధు మహారాజు.

'హే హెయ్, హయ్యారే, వరేవా, భళాభళి, పరిసరి, గమాగమా, పదాపదా, నిసానిసా.........' అని హడా విడి చేసుకుంటూ, వింత ఆకారాలు కొన్ని బ్రహ్మ దేవుణ్ని వెక్కిరించసాగాయి. ఆ ఆకారాలు మరేవో కావు. బ్రహ్మదేవుడు సృష్టించినవే! అతను సృష్టిం చినవి అతన్నే వెక్కిరిస్తున్నాయి!!—

ఏమిటీ సృష్టి? ఎప్పుడు జరిగింది? ఎలా జరిగింది? అంటావేమో, విను—

ప్రళయకాలం పూర్తికాగానే—

శ్రీ మహా విష్ణువు బొడ్డులోనించి బ్రహ్మ దేవుడు పుట్టుకొచ్చాడు. బ్రహ్మదేవుడితో పధ్నా లుగు లోకాలను సృష్టించమని చెప్పాడు, విష్ణు మూర్తి. బ్రహ్మ తన నాలుగు శిరస్సులతోనూ బాగా ఆలోచించాడు. పధ్నాలుగు లోకాలను సృష్టించాడు. అందులో, మనం ఉంటున్న భూలోకం ఒకటి.

భూలోకానికి కావలసిన జీవకోటిని సృష్టిం చాలని బ్రహ్మదేవుడు— రకరకాల తలలూ, మొం డాలూ, కాళ్లూ, చేతులూ, ముక్కులూ, చెవులూ, అన్నీ వేరువేరుగా తయారుచేసి వేటికవి విడివిడిగా పెట్టుకున్నాడు.

అయితే—ఆయన అతికించనక్కరలేకుండా అవయ

వాలన్నీ వాటంతటవే, వాటి ఇష్టం వచ్చినట్టు అతుక్కుని, వికార స్వరూపాలుగా ఏర్పడి, బ్రహ్మని వెక్కిరించడం మొదలెట్టాయి!

'నాకూ నాలుగు తలలున్నాయి, నీ గొప్ప ఏమిటి?' అంటూ ఒక నాలుగు తలల ఆకారం ఎదిరించింది. ఒక మొండానికి నాలుగు చేతులు మాత్రం అతుక్కుని 'నేను చతుర్భుజుడిన్ని, తెలుసా?' అని ప్రశ్న వేసింది. 'ఏయ్! నేను ముక్కంటిని. భస్మం చేసేస్తా, జాగర్త!' అని ఒక మూడు కన్నుల ఆకారం హుంకరించింది. ఇలా వింతవింత ఆకారాలు ఏర్పడి, వాటిని సృష్టించిన బ్రహ్మనే వెక్కిరించాయి. పాటలు పాడాయి, నాట్యంచేశాయి!—

తన సృష్టి తనమీదే ఇలా తిరుగుబాటు చెయ్యడంతో, బ్రహ్మదేవుడుకి మతిపోయింది. భయం పట్టుకుంది. తక్షణమే ఆ ఆకారాలున్న గది తలుపు మూసేసి, పద్మతల్పంమీద పడుకుని, విచారించ సాగాడు.

బ్రహ్మదేవుడి తలలు నాలుగూ దిమ్మెక్కిపోయాయి. ఆయనకి ఆవులింతలు వచ్చాయి. ఆలోచన ఏమీ పాలుపోలేదు. కళ్లు మూసుకుని కాస్సేపు అలానే పడుకున్నాడు. తెలియకుండానే నిద్ర పట్టేసింది!

* * *

ప్రపంచమంతా సముద్రమయంగా ఉంది. కెరటాల హోరుతో చెవులు గింగురుమంటున్నాయి. రానురాను ఆ సముద్ర ఘోషలో స్పష్టంగా 'ఓం' కార శబ్దం వినబడింది!!

రెప్ప వాల్చక చూస్తున్నాడు బ్రహ్మ. ఆ కెరటాల మీదుగా ఒక వస్తువేదో తనవైపే కొట్టుకు వస్తున్నట్లయింది. ఆ వస్తువు ఆకుపచ్చ రంగులో ఉంది. పైగా తళతళ మెరిసిపోతూ ఉంది. క్రమక్రమంగా అది దగ్గర పడినకొద్దీ, ఒక మర్రి ఆకు అని స్పష్టంగా తెలిసిపోయింది.

ఆ మర్రిఆకు మామూలు మర్రిఆకుల్లాంటిది కాదు. దీనిపైన వెలుగులు కురిసే ఒక వింత రూపం ఉంది! దీక్షగా చూశాడు బ్రహ్మదేవుడు. ఆహా!— ఆ మెరిసేది సాక్షాత్తు ప్రణవ స్వరూపంలో ఉన్న బాల వినాయకమూర్తి!!!—

మెలకువ వచ్చేసింది బ్రహ్మదేవుడికి. వెంటనే తనతప్పు తెలుసుకున్నాడు. సృష్టి కార్యం ప్రారంభించటానికి ముందు, ఆది దేవుడయిన వినాయకుణ్ణి ప్రార్థించలేదు. ఇంతకుమించిన పొరపాటు మరేం కావాలి?— మనస్ఫూర్తిగా రెండు చేతులూ జోడించి, నమస్కరించాడు :

"శుక్లాంబరధరం విష్ణుం
శశివర్ణం చతుర్భుజం
ప్రసన్న వదనం ధ్యాయే
సర్వ విఘ్నోప శాంతయే!—"

అంటూ గణపతిని ప్రార్థించాడు.

తరవాత మళ్లీ తన పనిలో మునిగిపోయాడు బ్రహ్మదేవుడు. మరెటువంటి ఆటంకమూ లేకుండా సృష్టికార్యం చకచకా సాగిపోయింది!—

ఈ విధంగా, సృష్టికర్త అయిన బ్రహ్మనే ఒక ఊపు ఊపిన శక్తిమంతుడు వినాయకుడు. ఆయన్ని ఆదమరచి పని ప్రారంభించిన బ్రహ్మదేవుడికే తగిన శాస్తిచేసి, తనను జ్ఞాపకం ఉంచుకునేలా చేశాడు, వినాయకుడు. కనుకనే, ముల్లోకాల ప్రజలూ వినాయకుడంటే భయభక్తులతో మసులుకుంటారు!—

6

'రాజా!— మరొక కథ విను—

ఒకప్పుడు వ్యాస మునీంద్రుడు బ్రహ్మదేవుణ్ని గురించి గొప్ప తపస్సు చేశాడు. ఆయన తపస్సుకి మెచ్చి బ్రహ్మ ప్రత్యక్షమయాడు.

"మహానుభావా!— ఏం కావాలి?"— అని అడిగాడు.

అందుకు వ్యాసుడు, "బ్రహ్మదేవా!— ఇప్పుడు నేను 'కవిత్వం' అనే వ్యాధివల్ల బాధపడుతున్నాను. దాన్ని బయట పెట్టేంతవరకు నాకు మనశ్శాంతి లేదు. ఆ మహా కావ్యాన్ని నాలో ఇముడ్చుకోలేక, బయట పెట్టనూలేక అవస్థపడుతున్నాను. ఇదీ సంగతి. దీనికి తగిన ఉపాయం చెప్పటానికి నువ్వే తగుదువు" అంటూ, తన కోరిక తెలియజెప్పాడు.

అప్పుడు బ్రహ్మదేవుడు 'కవీశ్వరా!— నువు సంకల్పించిన మహా కావ్యాన్ని గ్రంథస్థం చేయగల సమర్థుడు ఒక్కడే ఉన్నాడు. అతడు సమస్త శాస్త్రాల్లోనూ నిధి. నీ మనస్సు సరిగా గ్రహించి, అభీష్టాన్ని సిద్ధింప చెయ్యగలవాడు అతనొక్కడే. అతడే సిద్ధి వినాయకుడు!— అతన్ని ధ్యానించు! నీ కార్యం తప్పక సఫలమవుతుంది' అనిచెప్పి మాయమయ్యాడు.

బ్రహ్మదేవుడి సలహా ప్రకారం వ్యాస మహర్షి గణపతిని స్తుతించాడు.

గాఢమయిన ధ్యానంలో ఉన్న వ్యాస మునీంద్రుడి దగ్గరకు ఒక బుడుతడు వచ్చి, ఎదుట నిలబడ్డాడు. 'ఎవరికోసం తాతా!— అంత దీక్షగా తపస్సు చేస్తున్నావూ?' అని అడిగాడు.

కళ్లు తెరిచాడు వ్యాసుడు.

"నీ కోసమేనోయ్ తండ్రీ! రా, రా.....!!" అంటూ, వ్యాసముని ఆ పిల్లవాణ్ని అమాంతంగా ఎత్తుకుని, తన ఆశ్రమానికి తీసుకుపోయాడు!—

మధురాతి మధురాలైన రకరకాల ఫలాలు తెచ్చి, వినాయకుడికి ఆతిధ్యమిచ్చాడు.

'నాయనా!— నేనిప్పుడు నీకొక కథ చెబుతా. దాన్ని నువు కాస్త రాసిపెట్టాలి. ఈ ఉపకారం నీవల్లే కావాలి. మరొకళ్లవల్ల కాదు' అన్నాడు, వ్యాసుడు.

'గట్టి చిక్కే తెచ్చిపెట్టావే, తాతా!— నువు చూస్తే మహా వృద్ధుడివి. నేనా— కన్ను తెరవని పసివాణ్ని. రాయడమనేది ఒక సమస్యకాదు. కానీ, మనిద్దరికీ లంగ రందుతుందా అని?— నాకేం? గబగబా రాసుకుపోతా, మరి, అంత వేగంగానూ నువు కవిత్వం చెప్పగలవా?' అని అడిగాడు.

పకాల్న నవ్వాడు, వ్యాసభగవానుడు.

'మనవడా!— నేనైతే వయసుకి తాతనేగానీ, కవిత్వం చెప్పడంలో నీలాగే కుర్రవాణ్నే సుమా!' అన్నాడు.

'ఏమో తాతా!—అదంతా నాకు తెలీదు. రాయడం మొదలెట్టానంటే నా ఘంటం నడిచేటంత వేగంగానూ నువు చెప్పగలవా, చూసుకో!— నే సిద్ధమే!' అని బదులుచెప్పాడు బాల వినాయకుడు.

'అలాగే నాయనా! నువు పెట్టిన నియమం ప్రకారమే కవిత్వం చెబుతా. మరయితే, నాదీ ఒక్క నియమం ఉంది సుమా!— నేను చెప్పే కవిత్వంలో అర్థం తెలుసుకుని, మరి రాయాలి నువ్వు. తెలిసిందా?—' అంటూ, తన ఉద్దేశం తెలిపాడు, వ్యాస మునీంద్రుడు.

'సరేలే. నీ షరతుకి నేనూ ఒప్పుకున్నా. కానీ తాతా!—మొదలెట్టు' అని చెప్పి, తన రెండు దంతాలల్లోనూ ఒకటి ఫళక్కున విరిచి, ఘంటంలాగా చేత పట్టుకున్నాడు.

గబగబా చెప్పుకుపోతున్నాడు, వ్యాసముని!

అంతటి వేగాన్నిమించి, అవలీలగా రాసుకుపోతున్నాడు, వినాయకుడు!!—

మాట వరసకని, గణపతి పెట్టిన నియమానికి ఒప్పుతున్నాడే కానీ, అతను రాసే వేగాన్ని అందుకోలేకనే పోయాడు వేదవ్యాసుడు. అందుచేత. దీని కొక ఉపాయం కని పెట్టాడు, మహర్షి.

మామూలుగా కవిత్వం చెప్పుకుపోతున్నట్టే చెప్పుకుపోయి, మధ్యమధ్య కష్టమైన శ్లోకాలు కొన్ని దొర్లించేవాడు. వినాయకుడు వాటిని అర్థం చేసుకోడానికి కొంతసేపు పట్టేది. ఈ లోగా మరికొన్ని వేల ఆశువులు ఆలోచించి సిద్ధం చేసుకునేవాడు వ్యాసుడు. ప్రతిభావంతులైన వ్యాస, వినాయకుల మధ్య ఈవిధంగా పోటాపోటీలతో దివ్యమైన కావ్య రచన సాగిపోయింది!

రాజా!— శ్రీకృష్ణ భగవానుడు నడిపించిన టువంటి మహా భారత కథను ఇలాగ వ్యాసమునీంద్రుడు చెప్పగా, ఆ ప్రవాహాన్ని అట్టే అంది పుచ్చుకుని గ్రంథస్థం చేసిన అతగాడే— నువు భయపడుతున్న ఆ గణేశుడు!!!—

7

'రాజా!— మరొక సంగతి !

ఇవాళ గణేశుడు తన స్నేహితులయిన ముని కుమారులతో కలిసి జలక్రీడలలో మునిగి ఉండగా ఒక చిత్రం జరిగింది— పిల్లలంతా ఒకళ్లమీద ఒకళ్లు నీళ్లు చల్లుకుంటూ పందెం వేసుకుని ఆ దరినించి ఈదరికి, ఈ దరినించి ఆ దరికీ ఈదులాడుతూ, ఉల్లాసంగా ఉన్నారు.

అటువంటి సమయంలో ఒక ముని కుమారుడు మరొక ముని కుమారుడితో కయ్యాలాడటం గణపతి కంటబడింది. 'ఏమిటి, మీ తగాదా?' అని అడిగాడు.

అందులో ఒక కుర్రవాడు, 'చూడు గణా!— వీడు నన్ను ఉత్త పుణ్యానికి చెళ్లుమని కొట్టాడు. ఆటంటే ఇదేనా ఏమిటీ?— వీపుమీద ఎంత తట్టు తేలిందో చూడు, ఇదుగో!' అంటూ, వెనక్కు తిరిగి చూపించాడు.

అందుకు రెండోవాడు, 'అన్నీ అబద్ధాలే గణా!— అసలు నేను వాడినేం అనందే? ఎవడో కొడితే, నామీద తోసేస్తున్నాడు......' అన్నాడు.

'సరే, నే తీరుస్తా మండండి. మీ తగాదా!' అంటూ తయారయ్యాడు వినాయకుడు. దెబ్బలు తిన్న ముని కుమారుడి వీపు బాగా పరీక్షచేశాడు. నిజంగానే వాడి ఒంటిమీద అయిదు వేళ్లూ అంటుకుని, ఎర్రటి తట్లు తేలి ఉన్నాయి. ఆ తట్లు చూడగా చిన్నపిల్లల చెయ్యిలాగా లేదు. ఎవరో పెద్దవాళ్లే కొట్టినట్లు స్పష్టంగా అగుపిస్తూంది!

ఈ తగవు పూర్తి కాకుండానే మరొక పేచీ వచ్చింది, ఇటువంటిదే!— వాడు కొట్టాడని వీడూ,

పీడు కొట్టాడని వాడూ, ఒకళ్ళమీద ఒకళ్ళు పేపి కించి కొట్లాడుకుంటున్నారు. ఇలా పిల్లల మధ్య పేచీలు పెరిగిపోయాయి. పైగా, ఈ జగడాలు జరుగుతున్నప్పుడు ఎవరో వచ్చి అందరినీ తరిమి కొట్టినట్లుయింది. వాలకమంతా కనిపెట్టాడు గణే శుడు. ఇది కాదు. ముందు మీరంతా గట్టెక్కండి. చెబుతానన్నాడు. అందరూ గట్టుమీదికి చేరుకున్నారు.

ఇప్పుడు గణపతి—తనొక్కడే— చేతో కత్తి పుచ్చుకుని, గభీమని నీళ్ళలోకి ఉరికాడు!—అలా గణపతి ఉరకగానే, టటుక్కున ఎవరో అతని నడుం పట్టుకుని లోపలికంటా లాక్కుపోయారు! గట్టున ఉన్న ముని కుమారులంతా కంగారు పడ్డారు !!

చూస్తూనే ఉన్నారు వాళ్ళు. కొలనులో నీళ్ళు రంగుమారి, ఎర్రబడసాగాయి. మరి కాస్సేపటికే ఆ కొలను కొలనంతతా రక్తమయమై పోయింది !! ఇదేమిటా, ఈ వింత ? అని అనుకునేటంతలో, ఆ నీళ్ళలోనించి ఒక బ్రహ్మాండమైన తిమింగలం అంత ఎత్తున లేచి, దుబ్బున గట్టుమీద పడింది!!!

అలా పడుతున్న ఆ తిమింగలం విలవిల తన్ను కుని 'గణా ! గణా !!' అంటూ, భీకరమైన రాక్షసా కారంతో ప్రాణాలు విడిచింది.'

రాజా !—ఈ వింత మత్స్యావతారుడు మరెవరో కాదు. మన ఆస్థానం నుంచి వెళ్ళిన వికృతాసురుడే. మత్స్యరూపంలో గణేశుడ్ని కడతేరుద్దామని వచ్చి, చివరికి తనే అతని చేతిలో హతుడయ్యాడు.'

ఈ కథ చెప్పి శుక్రాచార్యుడు ఆనాటికి ఇంటికి వెళ్ళాడు.

కార్యసిద్ధి

8

'రాజా !—విను' అని శుక్రుడు కథ ప్రారం భించాడు. సింధురాజు ఆలకిస్తున్నాడు—

'ఇంకా చూస్తారేం ?—వూఁ—తియ్యండి గుంజీళ్ళు. మొట్టుకోండి మొట్టికాయలు !' అంటూ గదమాయించాడు, అనింద్యుడు.

వెంటనే కొంతమంది మూడేసి గుంజీళ్ళు తీసి, ముమ్మారు మొట్టికాయలు మొట్టుకుని, ఒక్కొ క్కరే జారుకున్నారు. కొందరు తీద్దామా మాన దామా అని, అయిష్టంతో తటపటాయిస్తు న్నారు. మరికొందరు 'మేం తియ్యం !—' అని మొండికించారు. వాళ్ళని రాజభటులు తిట్టారు, కొట్టారు, రాజాజ్ఞను పాటించేదాకా నానా హింసలూ పెట్టారు.

ఇది ఒకనాటి కథకాదు. అనింద్యుడు పరిపాల నకు వచ్చినప్పటినుంచీ ఇలా జరుగుతూనే ఉంది. నరులు, నాగులు, మహర్షులు, దేవతలు మొద లైన అందరూ—పద్నాలుగు భువనాల్లోనూ ఉండే ఆడా—మగా, పిన్నా—పెద్దా, భేదం లేకుండా గుంజీళ్ళు తియ్యాల్సిందే, మొట్టికాయలు మొట్టు కోవాల్సిందే !

అయితే—అనింద్యుడు ఇటువంటి పని ఎందుకు చెయ్యవలసి వచ్చింది ? ఇలా చెయ్యటానికి తగిన శక్తీ, సామర్థ్యమూ, ధైర్యమూ, సాహసమూ ఎలా వచ్చాయి ?—అని నువ్వు అడగవచ్చు.

రాజా ! విను : ఆ మాటకొస్తే అనింద్యుడు అసలు రాక్షసు డనటానికే వీల్లేదు. అతని జన్మవృత్తాంతమే చాలా చిత్రమైంది.

పూర్వం అసురేంద్రుడనే రాక్షసరాజు ఉండే వాడు. అతను తన బలాన్నీ బలగాన్నీ చూసుకోక ముందు వెనకలూ, మంచి చెడ్డలూ ఆలోచించక, దేవేంద్రుడితో కయ్యం పెట్టుకున్నాడు. అసు రేంద్రుడికీ అమరేంద్రుడికీ మధ్య గొప్ప యుద్ధం జరిగింది. దేవేంద్రుడి ధాటికి అసురేంద్రుడు తట్టుకోలేకపోయాడు.

ఓడిపోయిన రాక్షసరాజును లోకువచేసి దేవేం ద్రుడు నోటికిరాని మాటలన్నాడు. 'మీ జాతే చవట జాతి ! చేవలేని చచ్చు దద్దమ్మలు ..... అంటూ, వంశాన్నే ఎత్తిపెట్టి తూలనాడాడు.

అసురేంద్రుడికి మండిపోయింది. అయితేనేం ? —చేసేది లేక అప్పటి మట్టుకు వూరుకున్నాడు.

అయితే—ఇంద్రుడు చేసిన అధిక ప్రసంగం రాక్షసయువకులు చెవులారా విన్నారు. సహించలేక పోయారు. అసురేంద్రుణ్ని వెంటబెట్టుకువచ్చి, నన్ను చుట్టుముట్టారు.

'గురువర్యా!—దేవేంద్రుడికి తగిన పరాభవం చేసితీరాలి. అంతవరకూ మాకు నిద్ర పట్టదు!' అన్నారు కొంతమంది.

'అహఁ—దేవేంద్రుణ్ని మట్టుకు అవమానిస్తే చాలదు. ఆ మొనగాడు జాతుల్నే ఎత్తిపొడుస్తున్నాడు. అందుచేత, ఆపని మనమే చేసి చూపించి, వాళ్ళకి బుద్ధిచెప్పాలి. వాడి జాతి సంతతినీ అవమానిస్తే గాని మాకు కక్ష్య తీరదు !' అంటూ గట్టిగా వాదించారు ఇంకా కొందరు.

చాలా చిక్కుసమస్య వచ్చిపడింది. దీన్ని గురించి దీర్ఘంగా ఆలోచించవలసి వచ్చింది.

నా తపశ్శక్తి సంతటినీ ధారపోసి 'విబుధ' అనే ఒక చక్కటి సుందరిని సృష్టించాను. సృష్టించి, 'కుమారీ ! విబుధా !!—గంగానదీ తీరాన ఫలానా చోట ఒకానొక మహాముని తపస్సు చేసుకుంటు న్నాడు.. ఆయన గొప్ప తపస్సంపన్నుడు. ఎలా యినా వెళ్ళి, ఆయనను వలలో వేసుకోవాలి. ఆయనవల్ల నీకొక మగశిశువు కలుగుతాడు. ఆ శిశువు అసామాన్యుడు. మన జాతికి పుట్టిపున్న అవమానా లను పోగొట్టగల శక్తి, నీ కడుపున పుట్టబోయే ఆ బిడ్డడికే ఉంది.

అయితే—ఆపని చాలా ప్రమాదంతో కూడు కున్నది, నాకు తెలుసు. ఏమి అంటే—ఋషి పుంగవులు శాంతంగా ఉన్నంతసేపూ ఏమీ పరవా లేదు. చటుక్కున కోపం వచ్చిందా, చిటికెలో భస్మం చేసేయగలరు. కనుక, మెలకువగా మసలు కుని, వెళ్ళినపని వాకచక్యంతో నెరవేర్చుకుని, విజయ లక్ష్మివై తిరిగిరా !' అని దీవించి పంపాను.

* * *

అనుకున్నట్టు, కొద్ది కాలానికే విబుధ విజయ గర్వంతో తిరిగి వచ్చింది. ఆమె ఒక్కర్తే కాదు, చక్కనయిన ఒక పసివాణ్ని ఎత్తుకు మరీ మోసుకొచ్చింది! ఆ బాలుడికి 'అనింద్య' డని నామకరణం జరిగింది. అనింద్యుణ్ని నా హస్తాలలో ఉంచి, విబుధ మాయమైపోయింది !!—ఆ పసివాణ్ని గురించే ఇప్పుడు మనం చెప్పుకుంటున్నది. (సశేషం)



కూలిన గోడలు

27 వ పేజీ తరువాయి

తల్లి కొడుకును ప్రేమిస్తుంది.
అక్క తమ్ముణ్ణి ప్రేమిస్తుంది.
ఇందిర మధుని ప్రేమిస్తుంది.

* * *

"కాస్త లేచి తొందరగా స్నానం చెయ్యి మధూ! గుడికి వెళ్దాం."

"ఇబ్బందిగా ఉంది వదినా! రాత్రి ట్రైన్‌లో నిద్ర పోలేదు."

"అయితే ఎంతసేపు పడుకుంటావో చూస్తాను. పడుకో."

'లేదులే వదినా! అంత కోపమా?"

"మరేవిటి? గంటనుంచీ మొత్తుకొంటూంటే."

గంటనుంచీనా? హరిదేవుడా! ఎందుకూ?"

"దేవుడి దగ్గరికి వెళ్దామని"

"సరిగ్గా చెబుదూ!"

"ఇంకా ఏం చెప్పను? గుడికి వెళ్దాం."

"గుడికా? ఎందుకూ?"

"ఇది మరీ బావుంది. దేవుడి గుడికి ఎందు వెళ్తారు?

"ఓహో! ఏవో కోరికలు కోరుకోవటానికి కాబోలు. అయితే నీకోరికేమిటి?"

"ఇక్కడ నీతో చెప్పమంటావా?"

"నోరులేని రాతిబొమ్మకన్నా తీసిపోయానా వదినా? నాకు చెప్తే చెయ్యగలిగితే చేస్తాను. లేకపోతే కొంత సానుభూతైనా చూపిస్తాను కదా?"

ఇందిర నవ్వింది—"కాలేజిలో కష్టపడి రెండేళ్లు చదివావు. పరీక్షలు రాసివచ్చావు. మా మధు పరీక్ష పాస య్యేలా చెయ్యమని కోరుకోటానికే బయల్దేరు తున్నాము."

"దానికైతే వెళ్లక్కర్లేదు. పరీక్ష రాసినవాణ్ణి వదిలేసి ఎవణ్ణో అడగటం ఏమిటి? నేను పాసౌతానని చెప్తున్నానుగా?"

"ఏమో! ఆ రోజుకి ఏదో అడ్డు రావచ్చు."

"పిచ్చి వదినా! నేను పేపర్లు సరిగా రాసి ఉండకపోతే నీ దేవుడిలా పాసు చేయిస్తాడో చెప్పు వింటాను." మధు దిండుమీద బోర్లగా పడుకొని ప్రశ్నించాడు.

"ఏమో బాబూ! నీకు నేను చెప్పలేను. నా కోరికేదో చెప్పుకుని వస్తాను."

"ఓహో! ఆ గుడిలో నీ కోరిక తీర్చే దేవు డున్నాడన్నమాట."

"ఉన్నాడో లేడో! ఆ విగ్రహాన్ని వోసారి దర్శించి ఏవో సమర్పించి వస్తాను."

"అటువంటి విగ్రహం నీ పూజ గదిలోనూ ఉందిగా? కాకపోతే కొంచెం సైజు తేడా! అంతే."

"అసలు నువ్వు వస్తావా? రావా? చెప్పు."

"కోప్పడకు వదినా! నువ్వు చెప్తే చెయ్యనని చెప్పాష్టైనా అన్నానా? కాని వదినా! ఒకటి చెప్పు. నువ్వుచేసే పనిమీద విశ్వాసంలేకుండా ఎందుకు చేస్తావు?"

"అంటే నీ ఉద్దేశ్యం? దేవుడు లేడనా?"

"నేనలా అనలేదే! నాకు రూఢిగా తెలీని విషయం గురించి నేను ఎప్పుడూ వాదించను— సరే! దేవుడున్నాడే అనుకుందాం, అయితే దేవుడు

కూలిన గోడలు

ఆ గుళ్ళోనే ఉన్నాడా? నీ పూజామందిరంలో లేడా?"

"ఉంటే ఉండొచ్చు. మన ఇంటికన్నా ఆ గుడి పవిత్రమైనదీ, ఉన్నతమైనదీ, అక్కడ నిల బడితేనే ఏదో శాంతిగా ఉన్నట్టు అనిపిస్తుంది."

"అదే సైకాలజీ! అంటే నీ మనస్సు కొన్ని నమ్మకాలకు అలవాటుపడి ఉంటుంది. అంతేగాని ప్రత్యేకించి దేవుడి గుడిలోనే పవిత్రతా, శాంతి అనేవి లేవేలేవు. అక్కడ ఎంత నీచమైన పనులు జరుగుతూ ఉంటాయో తెలిస్తే మన్నామాట అనవే అనవు."

"ఉంటే వుండవచ్చు. అవేమీ దేవుణ్ణి అంటవు."

"దేవుణ్ణి అపవిత్రత అంటనప్పుడు మన ఇంట్లో అపవిత్రంగా ఉందని ఎందుకనుకొంటు న్నావు?"

"మన తృప్తి కోసమే అక్కడికి వెళ్తాం. అంతే."

"ఒప్పుకున్నావా? అయితే దేవుణ్ణి పళ్ళూ పువ్వులూ పెట్టి పూజించాలా?"

"దేవుణ్ణి భక్తితో పూజించకపోతే ఎలా?" విస్మయంగా చూసింది ఇందిర.

"ఎందుకు పూజించాలి? చూడు! బాపూజీని తీసుకుందాం— ఆయన మానవుడిలాగా పుట్టినా మనం మానవాతీతుడిగానే భావిస్తున్నాం. ఏనా డైనా గాంధీతాత మనకు దేవుడితో సమానమే. అయితే ఆయన విగ్రహాలకు గుళ్ళు కట్టించి పూజా రినిపెట్టి రకరకాలుగా పూజలుచేయటమా? లేక ఆయన ఆదర్శాలు అర్థంచేసుకుని ఆయన ధర్మాలు ఒంట పట్టించుకొని, ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ఆయన్ని అనుసరించటమా? ఏది మన కర్తవ్యం? ఏది సమంజసం? బాపూజీ తనకు పూజలుచేస్తే సంతోషిస్తాడా? తన సూక్తులను పాటిస్తే సంతృప్తిపడతాడా?"

"గాంధీతాత చెప్పిన విధంగా నడుస్తూనే ఆయన్నికూడా పూజించవచ్చుగా?"

"ఈనాటి దైవ ప్రార్థనలో అదే జరుగుతుందా? దేవుడి పేరిట మన పురాణాలు శాసించిన నీతి నియ మాలు ఎంతమంది పాటిస్తున్నారు.? పుణ్యాన్ని గౌరవించి పాపానికి ఎంతమంది భయపడుతున్నారు? దొంగతనం పాపం! వ్యభిచారం పాపం! అబద్ధ మాడటం పాపం! ఇతర్లని మోసంచెయ్యటం పాపం! ఇవన్నీ అందరికీ తెలుసు— పురాణాలు చెప్తున్నాయ్. కాని ఎంతమంది ఆచరిస్తున్నారు?"

"అందుకే ఈ దేవతార్చన! ప్రతీ వ్యక్తి ఎల్ల కాలం నీతినియమాలు ఆచరించటం సాధ్యంకాదు. ఎన్ని ఆటంకాలు ఉన్నా మనిషి తప్పుచేస్తూనే ఉం టాడు. నువ్వు ఏ పాపమూ చేయటం లేదనేనా నీ అహంకారం?"

"మనిషిపాపంచేస్తే అది మాపివేసలసింది పశ్చా త్తాపంతోనే. ఓ పావలా పళ్ళూ, పువ్వులూ కొని పూజారి కప్పగించి చేతులు దులుపుకువస్తే పోయేది మాత్రం కాదు.— నేను తప్పుచేస్తే తగిన శిక్ష అనుభవించటానికే సిద్ధంగా ఉంటానుగానీ లంచం తీసుకుని క్షమించగలడనుకొనే దేవుణ్ణి మాత్రం ఎప్పుడూ ప్రార్థించను."

"అయితే అనాదిగా వస్తూన్న తీర్థయాత్రలకూ దైవ ప్రార్థనకూ అర్థమేలేదా?"

"ఎందుకులేదు? అడవుల్లో అనాగరికంగా అసభ్యంగా తిరిగిన మానవుడు సంఘజీవి అవు తూన్నపుడు ఏర్పడిన తతంగం ఇది. ఆనాటి మానవుడికి చేయవలసినవి— చేయకూడనివి— పరో క్షంగా పుణ్యం పాపం— ఏమిటో తెలీవు. సాంఘిక శాంతికోసం మనుషులంతా నీతినియమాలు పాటిం చాలి. ఆనాడు సంస్కారంలేని మనిషిని లొంగ దీయటానికి పాపభీతి— దైవభక్తి ఎంతైనా అవ సరమయ్యాయి. ఈనాడైనా సంస్కారంలేని వారందరికీ వుండితీరవలసిందే ఈ తతంగం. కాని నీతి నియమాలు పాటించాలనే ముఖ్యోద్దేశం లోపించి అవి పోగొట్టుకోటానికే ఈ దైవభక్తి మిగిలి ఉంటే అది మహా ప్రమాదకరమైన సంగతి. దైవభక్తి అనేది పిచ్చిపిచ్చిగా విగ్రహారాధన కిందికి దిగటం అర్థంలేని పని."

"నీలా నేను చదువుకోలేదు మరి. లేకపోతే నీకు తగిన సమాధానం చెప్పగలిగేదాన్నికదూ?"

"అలాగే అయితే చాలా సంతోషించేవాణ్ణి వదినా! నాకో ఉద్దేశ్యమంటూ ఉంటే అది నిరాటంకంగా సాగాలి. లేదా ఎదటివారి వాదనతో సమూలంగా నశించిపోవాలి. నీకు ప్రత్యక్షంగా కన్పిస్తూన్న దాన్ని

'మీ దస్తూరి బొత్తిగా
బాగుండ లేదు. మీ కవిత్వాన్ని
షైపు చేసి తీసుకొస్తే...' అన్నాడు
ఎడిటర్.

'అయ్యో షైపు చేయటంవస్తే
ఈ కవిత్వం రాసుకోడం దేనికి?'
అన్నాడు కవి.

ఆర్. సన్యాసిరావు (విశాఖ)

మించి కన్పించని ఏదో ఉందని భ్రమిస్తావు దేనికి?"

"అయ్యో రాత! నిద్ర మంచంమీద ఏమిటీ వాదన? ఇంతకీ గుడికి వస్తావా? రావా?"

"నీ ఇష్టం. రమ్మంటే నాకేం అభ్యంతరంలేదు. నేను ఎన్ని షిర్లు కొట్టటంలేదు! అంతేగాని, నేను మాత్రం పళ్ళూగిళ్ళూ ఇవ్వను. నా పావలానో అర్థ రూపాయో నాకివ్వేయ్."

"పావలా ఏం ఖర్మ? రూపాయి. ఏంచేసు కుంటావు?"

"ఏదో చేసుకుంటాను. పూజారికి మాత్రం ఇవ్వను. అతగాడు సూర్యోదయానికి ముందే కాఫీ హొటల్లో ప్రత్యక్షమై చీకటిపడగానే మిల టరీ హొటల్లో అస్తమిస్తాడు. ఆ లాంఛనాల తర్వాత దేవుడికి నైవేద్యాలూ— పూజలూ పునస్కా రాలూ వగైరా!" ఇందిర చిత్రంగా చూసింది.

"నీకో బేడ ఇస్తాను. నన్ను గుడికి తీసుకువెళ్ళు."

మధు నసుగుతూ లేచాడు— "బొత్తిగా బేడ........ కిట్టదు వదినా! ఇంకో అణా వేసుకో! ఏం?"

ఇందిర నవ్వింది.

* * *

వదులుగానే వేసుకున్న జడలో ఒకే మందారం పెట్టుకుంది. గాజు పళ్ళెంలో పళ్ళూ, పువ్వులూ హారతి కర్పూరం— చిల్లర డబ్బులూ వేసుకుని బయల్దేరింది.— మధు నుదుట్టిగా కాఫీ టిఫిన్లు కానిచ్చి మరీ అనుసరించాడు.

గుడికి వెళ్తుంటే దారిలో పంచి బుజాన్న వేసుకు స్కూలుకి వెళ్తూ సుధ కన్పించింది. ఇంది రని చూసి నవ్వబోయి మధునిచూసి తల తిప్పేసు కుంది. మనిషి చాల ఏపుగా బొద్దుగా పెరిగింది. ఎర్రటి పరికిణీమీద పాము పొరలాంటి తెల్లటి పిల్కు వోణీ వేసుకుంది. రెండు జడల్లో ఒకటి ముందుకు వేసుకుని వయ్యారంగా నడిచిపోయింది. మధు కుతూహలంగా సుధకేే చూస్తుంటే ఇందిర ఎగతాళిచేసింది— "ఏమిటా చూసుకోడాలు నడి రోడ్డులో? సిగ్గులేదూ?"

మధు ఉలిక్కిపడ్డవాడిలా తల తిప్పేశాడు.

"బాగా చూశావా?"

"నా కళ్ళు రెండు సలక్షణంగా ఉన్నాయి వదినా!"

"అయితే? దారేపోయే ఆడపిల్లలందర్నీ చూడ మనా నీకు కళ్ళు ఉన్నది?"

"కాక మొగపిల్లల్ని మాత్రమే చూడమనా?"

"సరేలే! నీ బడాయి ఇంకెన్నాళ్ళో చూస్తాను. సుధ నీకు దిమ్మతిరిగేలా జవాబులు చెప్తుంది."

"వాలకం చూస్తే అలాగే ఉందిలే. చూశావా ఎంత గర్వంగా పోయిందో!"

"కాక? నీకు ఒంగి నమస్కారాలు చేస్తుందను కున్నావా? ఓ పదేళ్ళపోత పెద్ద డాక్టరై కూర్చు టుంది. తెలుసా?"

"అలాగా? నువ్వుమాత్రం ఖాళీగా దేనికి?"

"నేనేం హాస్యమాడుతున్నాననుకొన్నావా? మీ పెదమామగారు కూతుర్ని డాక్టర్ చదివిస్తారట. సుధ డాక్టరై మీ అన్నయ్యని కాంపౌండర్‌గా పెట్టుకొంటుందట."

"చాల్లే! కట్టిపెట్టు. ఏమిటా చమత్కారం?"

"అయ్యో రాత! నమ్మకపోతే నేనేం చెయ్యను. మీ అన్నయ్య వోసారి— "డాక్టరమ్మగారూ!" అని హాస్యానికి పిలిస్తే— "ఎందుకంత వెటకారం బావా? నేను డాక్టరైతే నిన్ను కాంపౌండరుగా నైనా పెట్టుకుంటాగా?" అందట."

"అంత గర్విష్టయిందన్నమాట. ఏమన్నాడేమిటి అన్నయ్య?"

"నీ దగ్గర కాంపౌండరుగా ఉండటానికైనా నేను తగను. మా అమ్మాయిణ్ణి పెట్టుకుంటే నీ హాస్పి టల్‌కి ఒకటే పేరు! ఏక సందడి! అన్నారట"

ఇందిరతోపాటు మధూ నవ్వాడు— "బాగా అన్నాడు— దానికి మొదటినుంచీ మేమంటే తేలిక అభిప్రాయమే వదినా!"

"అదే మారుతుంది. సమయం రానీ!"

ఇందిర మౌనంగా నడవసాగింది.

మధు హఠాత్తుగా అడిగాడు— "వదినా! దేవుడి గుడికి వస్తూన్నప్పుడైనా నీ మనస్సు కొత్త దైవచింతనతో నింపుకున్నావా? ఎందుకీ మొక్కు బడి చెప్పు?" అంటూ నవ్వాడు.

"పో మధూ! ఇంకా సన్యాసుల్లా భజనలు చేసు కొంటూ నడవాలేమిటి?"

గుడినుంచి వస్తున్నప్పుడు అంది ఇందిర—

"ఎగతాళి చెయ్యకుండా ఉంటే నీకోమాట చెప్తాను."

"ఏమిటబ్బా అది?"

"మీ డాక్టర్ మామయ్య భార్యని పుట్టింటికి పంపించేశారు. నీకు తెలుసా?" (సశేషం)


ప్రాణపద మైంది పోయింది
తన పెంపుడు మేకపిల్ల బుల్ బుల్ అంటే వారికి ప్రాణం. బుల్ బుల్ కూడా రోజూ ప్రొద్దుటే పశువుల తోబాటు మేతకు వెళ్తుంది.
అమ్మా. బుల్ బుల్ పడుకొనేచోటే నేనూ పడుక్కుంటానే.
వద్దు. మా బాబువి కదూ. పశువుల కొట్టంలో పడుక్కుంటే పందికొక్కులు కరుస్తాయ్.
ఓనాటి సాయంత్రం
నాన్నా! బుల్ బుల్ ఇంటికి రాలేదు. ఎక్కడో తప్పిపోయినట్లుంది!
బాబూ. ఏడవకు. దాన్ని నా 'ఎవరెడి' టార్చితో వెతికి పట్టుకు వస్తా. రా.
నలువైపులా గాలించారు.
బుల్ బుల్ ఓ పెద్ద గోతిలో వున్నట్లు ఇట్టే కనిపెట్టేరు.
నాన్నా. ఎంతో ఆనందంగా వుంది. నా బుల్ బుల్‌ను వెతికి తెచ్చారు.
ఇలాంటి ప్రమాదాలు తప్పవు. అందుకే ఓ 'ఎవరెడి' టార్చి ఎప్పుడూ నా దగ్గరుంటుంది!
EVEREADY
సర్వదా ఆధారపడదగినది
ఎవరెడి
టార్చిలు • బ్యాటరీలు
బల్బులు • మ్యాంటిల్సు
UNION CARBIDE
యూనియన్ కార్బయిడ్ ఇండియా లిమిటెడ్



జరిగిన కథ

అదృష్టం వున్నా, ఆనందానికి నోచుకోని వృద్ధమూర్తి సుబ్బయ్య. బదిలీ అయిన వ్యవసాయ డిమాన్‌స్ట్రేటర్ రామారావుకు వాళ్ళింట్లో గది అద్దెకు దొరుకుతుంది. విపరీత పరిస్థితుల్లో తారసపడిన ప్రసాద్‌ను దుర్గయ్య ఆధరిస్తాడు. అనుకోకుండా అతనికి విమల, కమలలతో పరిచయ మౌతుంది. రామారావు గీసిన చిత్రాలను విమల మెచ్చుకొంటుంది. కమలను చూచిన ప్రసాద్ ఆమెమీదనే తన దృష్టిని లగ్నం చేస్తాడు. రామారావుకు హిందీ నేర్పటానికి సుబ్బయ్యగారు, విమలను వినియోగిస్తారు. కమల, ప్రసాద్‌లు సన్నిహితులవుతారు. కాని, ఆమాట విని, సుబ్బయ్యగారు మండిపడ్తారు—కమల మనస్సును మార్చటానికి ఆయన ప్రయత్నం ప్రారంభిస్తాడు. ప్రసాద్ సాహసంచేసి గోడదూకి కమలను కలిసికొన్నా, ఇంతలో రవికుమార్ రావటంవల్ల, మాయోపాయంతో వీధిలోకి రాగలిగాడు. విమలకు ప్రేమలేఖ వ్రాయమని ప్రసాద్ రామారావును ప్రోత్సహిస్తాడు.

(గతసంచిక తరువాయి)

కమల, ప్రసాద్ వైపు కోపంగా చూస్తూ, ఆ వుత్తరం చదువనైనా చదువకుండా, ముక్కలు ముక్కలు క్రింద చింపేసి పారేసి, తను వెంటనే క్రిందికి వెళ్ళిపోయింది. ప్రసాద్‌కి, కమలకు తన మీద కోపం వచ్చిందని, తెలిసింది. ఎందుకు వచ్చిందా? అని ఆలోచిస్తూ చాలాసేపు కూర్చున్నాడు.

రామారావు కాఫీ త్రాగి వచ్చి, ప్రసాద్‌ని మెచ్చుకోవటం మొదలెట్టాడు. "ఏమి ఆలోచనండీ మీది! నిజంగా అద్భుతమైన బుర్ర! అసలిన్నాళ్ళ నుండీ నాకు తోచనే లేదు, ఆమెకొక ప్రేమలేఖ రాయాలని. మీరు చెప్పబట్టి ఇప్పటికైనా ఈ పని చెయ్య గలుగుతున్నాను. మీరన్నట్లు ఆమెకు మనసులో ప్రేమ వుంటే మాత్రమేం? అది ఆమె కి తెల్పే అవకాశం వేనిస్తే కదా! హు! ఈ విషయాలు బొత్తిగా తెలియవండీ." అంటూ అతను మాట్లాడుతూంటే, ప్రసాద్ ముభావంగా జవాబిచ్చి, తరువాత తనకు పనుందని వెళ్ళిపోయాడు.

సాయంకాలం రామారావు తన పుస్తకాల్లో ఈ ప్రేమలేఖని పెట్టుకుని హిందీ నేర్చుకోవడానికి విమల వద్దకు వెళ్ళాడు. ఆమెకు పాఠం చెప్తున్నంతసేపూ అతని గుండెలు వేగంగా కొట్టుకుంటూనే వున్నాయి. విమల ఆయన పుస్తకాలు చూస్తూ, పేజీలు త్రిప్పసాగింది.

సుబ్బయ్య గారు మేడ మీదకు వచ్చారు. "రామారావు గారూ, ప్రొద్దున్న మీరు బెడ్డింగూ అదీ కట్టు కుంటూంటే మా నౌకరు చూశాడట, ఎక్కడికైనా వెళ్ళాలనుకుంటున్నారా?" అని అడిగారు.

" అబ్బే లేదండీ. ముందర అలా కొన్నాళ్ళు సెలవు పెట్టి వూళ్ళన్నీచూసి వద్దామనిపించింది; కాని తరువాత మళ్ళీ మనసు మారి పోయింది."

అని జవాబిచ్చి, విమల వైపు చూశాడు రామారావు. ఆమె, పుస్తకంలో పేజీల మధ్య వుంచి తన ప్రేమ లేఖను చదువుతోంది. రామారావు గుండెల్లో రైళ్ళు పరిగెత్తనారంభించాయి. ఏం జరుగుతుందో అన్న భయం కూడా పట్టుకుంది.

"మీరిప్పట్లో ఎక్కడికీ వెళ్ళకండి. పది రోజులలో కమలకు పెళ్ళి వారొస్తున్నారు. తాంబూలాలు పుచ్చుకొంటారు. తరువాత మరొక పదిహేను రోజులలో పెళ్ళి జరిపించేస్తాము. ఆ పెళ్ళయ్యే దాకా మీరెక్కడికి వెళ్ళద్దు." అని సుబ్బయ్యగారు చెప్తూంటే, రామారావుకి ప్రసాద్ జ్ఞాపకమొచ్చాడు.

"వరుడెవరూ ?" అని రామారావు అడిగాడు.

"మద్రాసులో రామయ్య గారని, 'కాఫీ అండ్ టీ కంపెనీ' ప్రొప్రయిటరు. వారి కాఫీ, టీ పొడుములు మన దేశంలోనే కాక విదేశాలో కూడా పేరు పొందాయి. దక్షిణాదిని బోలెడు తోటలూ, నాలుగు ఫాక్టరీలూ వున్నాయి. వారి ఏకైక పుత్రుడికి మా అమ్మాయి నిస్తున్నాం. పిల్ల ఫోటో వారందరికీ నచ్చింది. ఇహ వారు రావడం, తాంబూలాలు పుచ్చుకోవడమేనూ."

"బావుంది." అన్నాడు రామారావు. ప్రసాద్ సంగతేమిటూ ? అని ఆలోచించాడు. అతనికి సాయం చేస్తానని తను అన్నాడే గాని, ఎలా చెయ్యాలో తోచక అవస్థ పడుతున్నాడు. ఇంతలో విమల, తన ప్రేమలేఖని చదవడం మళ్ళీ జాగ్రత్తగా పుస్తకంలో పెట్టెయ్యడం చూశాడు. ఆమె చిన్న చిరునవ్వు నవ్వుకున్నట్లు ఆయనికి తోచింది. తరువాత సుబ్బయ్య గారు ఎవరో వస్తే, మళ్ళీ క్రిందికి వెళ్ళిపోయారు. రామారావు, విమలా మాత్రం మిగిలారు.

రామారావు ఏం చెయ్యడమూ ? అని ఆలోచించసాగాడు.

విమల తల వంచుకుని వుంది. కాలం చాలా మెల్లిగా గడుస్తోంది. రామారావు విమల ఏమైనా మాట్లాడుతుందేమోనని చూశాడు. ఆమె మూగగా ఏదో ఆలోచిస్తున్నట్లుంది. ఒక నిముషం గడిచింది. రెండు నిముషాలు గడిచాయి; మూడు నిముషాలు కూడా గడిచాయి; కాని విమల మాట్లాడలేదు. అయితే ప్రసాద్ చెప్పినట్టు, ఆమె కోపాన్ని ప్రదర్శించలేదు. కాబట్టి, ఆమెకు అయిష్టం కాదని తెలుస్తోంది. ఆమె వైపు చూడడానికి అతనికి మనసొప్ప లేదు., గుండె ఇప్పుడిప్పుడే సరియైన స్థితిలోకి వస్తోంది. అసలు ఆ ఆ రోజుకు అంతటితో ఆపేసి మర్నాడు మరొక ప్రేమ లేఖను రాస్తే ? ఆమె మాట్లాడితే బావుణ్ణు.

అతను విమల వైపు చూశాడు. ఆమె చెక్కిళ్ళ మీదుగా కన్నీరు కారుతోంది. అరె ! ఎంత పని జరిగింది ! ఆమె ఏడుస్తోంది.

"నన్ను క్షమించండి. మీకు ఇంత బాధ కలిగిస్తాననుకోలేదు. నా ప్రేమ నాచేత ఈ పిచ్చి పని చేయించింది. మిమ్మల్ని ప్రేమించడం వల్ల మీకు కష్టం కలిగిస్తున్నాననుకోలేదు. నేను చాలా కసాయిత్వున్ణి. అరెరె ! మీరు కన్నీరు —— "

"ఇవి కన్నీరు కావు. ఆనంద బాష్పాలు." అంది విమల గద్గద కంఠంతో.

"ఆ ! అయితే మీరు —— —— " అని ఆమె మొహాన్ని తన చేతులతో పైకెత్తి, సంతోషంతో, ఆమె మొహం వైపు కొద్ది నిముషాలు చూశాడు. ఆమె అతని వైపు ప్రేమగా చూస్తోంది.

"విమలా !" అన్నాడు రామారావు ప్రేమగా. జవాబుగా "వూ" అంది, విమల. "నన్ను వివాహం చేసుకుంటావా ?" అనడిగాడు గాలిలో తేలిపోతున్న హృదయంతో. "మీరేం చెయ్యమంటే అది చేస్తాను." అంది విమల గోముగా.

రామారావు మనసులో మల్లెలు మాలలుగా జేరిపూగ నారంభించాయి.

"ఏమిటిది ? రామారావు గారూ ! మీరేదో పెద్దమనుషులను కొన్నాను. ఇలా ప్రవర్తిస్తారనుకోలేదు." అని అప్పుడే అక్కడికొచ్చిన రవికుమార్ అంటూంటే రామారావు అతణ్ణి చూసి, "మిష్టర్ రవి కుమార్ ! మేమిద్దరం, త్వరలో 'రిజిస్టర్డు మారేజి' చేసుకో బోతున్నాం." అన్నాడు. రవి కుమార్, "ఆ !" అని నోరు వెళ్ళబెట్టాడు.

14

"అసలు ఆమె మనసు అకస్మాత్తుగా మారినట్లు కన్పిస్తోంది, తమ్ముడూ" అన్నాడు బుచ్చిశాస్త్రి ప్రసాద్‌తో, రాత్రి ఎనిమిది గంటలకు దుర్గయ్య గదిలో ఇద్దరూ మాట్లాడుకుంటూ, అప్పటికింకా తక్కిన వారెవ్వరూ రాలేదు. ప్రసాద్, కమలని రాత్రిపూట ఆమె గదిలో కలుసుకుందామని వెళ్ళి అప్పుడే వారం రోజులైంది. రామారావు గారి మేడ మీద నుండి విసిరిన వుత్తరాన్ని ఆమె చింపి ముక్కలుగా చేసిన దగ్గర్నుంచీ ఆమెకు తన మీద కోపం వచ్చిందని గ్రహించి అందుకు కారణమేమిటూ అని ఆలోచించ సాగాడు. ఆమెకెలాగైనా ఒక వుత్తరం అందించాలని ఎంత ప్రయత్నం చేసినా వీలు కాలేదు. చివరికి బుచ్చిశాస్త్రి తరుచుగా సుబ్బయ్య గారింటికి వెళ్తున్నాడు కాబట్టి అతని ద్వారా పంపాలని నిశ్చయించాడు.

ఆరోజు ప్రొద్దున్నే పూజ చేయించడానికి సుబ్బయ్య గారింటికి వెళ్ళిన బుచ్చిశాస్త్రి, రుద్రాభిషేకం చేయించిన తరువాత కమల ఒక్కర్తీ గదిలో వుండడం చూసి, కాబోయే పెళ్ళి కూతురుకి ప్రసాదం ఇస్తానని ఆమె వద్దకు వెళ్ళాడు. ప్రసాదం ఇస్తూ, "ప్రసాద్ వుత్తరం ఇచ్చాడు." అని మెల్లిగా, ఆమెకు మాత్రమే విన్పించేట్లు అన్నాడు. కమల ముందు తెల్లబోయింది. తరువాత, ప్రసాద్ తన స్నేహితుడని బుచ్చిశాస్త్రి చెప్పాక, "అటువంటి రౌడీ యువకులతో మీరు స్నేహం చెయ్యకండి. ఈసారి గనుక ఆయన నాకేదైనా వుత్తరం పంపడానికి ప్రయత్నిస్తే, మా నాన్న గారికి తెలియబర్చి తగిన చర్య తీసుకునేట్లు చేస్తాను." అని కోపంగా అంది. అంతటితో మరి ఆమెకు ఉత్తరం ఇవ్వడం సాధ్యం కాదని తిరిగి వచ్చేశాడు.

ఆ విషయం సాయంకాలం ప్రసాద్‌కు తెలియజేశాడు బుచ్చిశాస్త్రి. అప్పటి నుండి ఆమెకు ఇంత కోపం కలుగడానికి కారణం ఏమిటూ ? అని ఇద్దరూ ఆలోచించ సాగారు. పరిస్థితుల్ని కూలంకషంగా చర్చించాక ప్రసాద్, కమల మనసు మారడానికి కారణం ఆరాత్రి అంటే తను ఆమెను కలుసుకోడానికి వెళ్ళిన నాటి రాత్రి, జరిగిన సంఘటనలే కారణమనీ, అప్పటి నుంచే ఆమె మనసు మారి పోయిందనీ, అంతకు ముందు బాగానే వుండనీ అన్నాడు.

అయితే ఆ రాత్రి జరిగిన విషయాలన్నీ తనకు చెప్పమని బుచ్చిశాస్త్రి అడిగాడు. ప్రసాద్ తను కమల గదిలోకి వెళ్ళడం, అంతలో రవికుమార్ రావడం, తరువాత తను మంచం క్రింద దాక్కోవడం, తరువాత రవికుమార్‌ని జడిపించి తను వరండాలోకి వెళ్ళి, నీటి గొట్టం ద్వారా క్రిందికి దిగడం, కొట్లో దాక్కోడం, అక్కడ బొంగురు గొంతుక మిత్రుడి పరిచయం, తరువాత రవికుమార్‌కి జరిగిన సన్మానం, మొదలైన విషయాలు పూర్తిగా చెప్పాడు. బుచ్చిశాస్త్రి అతను చెప్పిందంతా శ్రద్ధగా విని, "నాకు కొద్దికొద్దిగా బోధ పడుతోంది. ఆ రోజు నీకు కొట్లో తటస్థ పడిన వ్యక్తి ఎవడో దొంగ అన్నమాట. సుబ్బయ్య గారింటిని దోచుకునే నిమిత్తం వచ్చాడు. కాని నీ రాకవల్ల పరిస్థితులన్నీ తారుమారై అతనికి ఆ అవకాశం దొరకలేదు. అందుకని అతను కూడా నీతో కలిసి బయటికి వచ్చేశాడు." అన్నాడు. ప్రసాద్ నిజమేనన్నాడు.

"అతను దొంగేనని నాకు పూర్తిగా నమ్మకం వుంది. కాని ఘరానా దొంగలాగ వున్నాడు. లాగూ, చొక్కా, కోటూ, దర్జాగా వేసుకున్నాడు. కాలికి రబ్బరు జోళ్ళున్నాయి. మంచి ఒడ్డూ పొడుగూ వున్నాడు."

"అందుకే రవికుమార్‌ని బంధించ గలిగాడు. ఆ దొంగ కూడా నీతో వున్నాడని తెలియని వాళ్ళు, నువ్వే ఆపని చేశావనుకుంటారు."

"నిజమే నండోయ్. కమలకు దొంగ సంగతి తెలిసుండదు. ఆమె బహుశా, నేనే రవికుమార్ తల మీద దెబ్బ కొట్టి, కాళ్ళూ, చేతులూ బంధించానుకొని వుంటుంది. అందుకే కోపం వచ్చిందేమో"


"అవునోయ్, తన అన్నను ఆ విధంగా అవమానించిన వ్యక్తంటే ఏ స్త్రీకి ఇష్టం వుంటుంది. అంతే కాదు నువ్వా విధంగా అర్ధరాత్రి ఆ యింట్లో చొరబడడం, మేడ దూకడం, రవికుమార్ కాళ్ళూ చేతులూ కట్టేసి పారిపోవడం, ఇవన్నీ తెలుసుకొని, నిన్నొక గజదొంగగా ఆమె భావించవచ్చు."

"అంతే నంటారా ?" అన్నాడు ప్రసాద్ దిగులుగా.


"ఆహా, అక్షరాలా. ఒక సంపన్న కుటుంబంలోని పిల్ల గౌరవ మర్యాదలు గల యువకుడికి తన మనసు సర్పించ గలదు గాని, ఖూనీకోర్లకూ, గజదొంగలకూ, దారి దోపిడీ గాళ్ళకూ ఎలా ఇవ్వగలదు ? ఒకవేళ ప్రమాదవశాత్తూ తెలియక అటువంటి వానికి మనసిచ్చినా, అతని స్వభావం తెలియగానే తన మనసు తను వెనకకు లాగేసుకుంటుంది. ఆమెది లేత మనస్సు, జాలి గుండె, సూక్ష్మమైన బుద్ధి, సున్నిత స్వభావం; అలాంటి అమ్మాయి బండ గుండెగల మొండి మొగవాడిని ఎలా ప్రేమించ గలదు ? అది అసంభవం."

"అయితే నేనంత దుర్మార్గుడి నంటారా ?" అన్నాడు ప్రసాద్ విచారంతో.

"ఇంకా సందేహమా ? ఆమె నిన్ను ఒక బుద్ధిమంతుడైన యువకుడనుకొని ప్రేమించింది ఈ సంఘటనతో నీ నిజ స్వరూపం బయట పడింది. నువ్వొక గోముఖ వ్యాఘ్రానివనీ, పయోముఖ విషకుంభానివనీ, నమ్మించి గొంతుకలు కోస్తావనీ తెలుసుకుంది. బహుశా పోలీసు రికార్డులలో నువ్వు



మీరూ అంగీకరిస్తారు



టాటా-ఫిన్లే
టీ

పోటిలేని టీ!

తాజా టీ

తాజాగా వుంచుటకు టాటా-ఫిన్లే టీని ప్రత్యేకమైన ప్యాకింగ్‌లో సురక్షితముగా భద్రపరచుతారు.


పరిమళమైన టీ

అతి సున్నితమైన పరిమళమిచ్చుటకు కావలసిన కోమలమైన ఆకులను మొగ్గలనే టాటా-ఫిన్లే టీలో ఉపయోగిస్తారు.

ఉత్తమ టీ

టాటా-ఫిన్లే టీ మిశ్రణ (బ్లెండింగ్) అతి నిపుణతతో చేస్తారు. కనుకనే ఈ టీ చిక్కగా రుచికరంగా వుంటుంది.

టాటా-ఫిన్లే టీ త్రాగండి; ఆనందము అందుకోండి!



ఈ క్రింది రకాలలోను, ప్యాకింగ్స్‌లోను
టాటా-ఫిన్లే టీ దొరుకుతుంది:-
ప్రెస్టిజ్ డార్జిలింగ్-సుందరమైన టిన్
లలిత్-బంగారు రంగు ప్యాకెట్
మిలాప్-వెండి రంగు ప్యాకెట్
షాన్-నీలి రంగు ప్యాకెట్



BI-TFN-5-TEL

మనసున మల్లెలు

పోత ఖైదీవయ్యుండచ్చును. నీ కోసం అప రాధ పరిశోధకులు వెతుకుతూ వుండి వుండచ్చు. గోడలు దూకడం, మేడల మీద నుండి గెంతడం, మనుష్యుల కాళ్ళూ చేతులూ కట్టెయ్యడం ఇవి ఇవి నీకు సహజంగా అబ్బిన విద్యలని నమ్మింది."

"మీరింకా ఇలాగే మాట్లాడితే, నాకు ఆత్మ హత్య చేసుకో బుద్ధేస్తుంది." అన్నాడు ప్రసాద్ ఆయన మాటలు భరించ లేక.

"దానివల్ల లాభం లేదు. ఏదో దెబ్బలాటలో నువ్వు ప్రాణాలు పోగొట్టుకున్నావను కుంటుంది. దాంతో ఆమెకు నీ మీద కలిగిన అనుమానాలన్నీ స్థిర పడతాయి." అన్నారు అడ్డంగా తల తిప్పుతూ బుచ్చిశాస్త్రి గారు.

"అబ్బబ్బ. అయితే ఏం చెయ్యమంటారో చెప్పరూ ? చంపక."

"ప్రస్తుతం చెయ్యగలిగిందేమీ లేదు. ఏదైనా అవకాశమొస్తే కొన్ని మంచి పనులు చేసి, నీ సద్బు ద్ధిని, నిరూపించుకోవడమేనూ."

"ఈ లోపల, ఆ పెళ్ళి కొడుకు వచ్చి ఆమెను చేసుకుంటే."

"ఋణాను బంధ రూపేణా పశుపత్ని సుతా లయా అన్నారు. ఎవరి కెవరో ?"

ఇంతట్లో వామన మూర్తి ప్రవేశించాడు. "ఏమిటండోయ్ శాస్త్రిగారు. ఋణాల పాలయిం దెవరండోయ్ ? కొంపతీసి మీరు కాదు కదా ?" అన్నాడు.

"అబ్బే కాదండీ. మావాడొకడి సంగతి చెప్తు న్నాను."

"అయితే సరే మళ్ళీ ఇప్పుడే వస్తా" నని బయ టకు వచ్చాడు ప్రసాద్. కమల మనసును మళ్ళీ తన వైపు మళ్ళించు కోవడం ఎలాగా అని ఆలోచిస్తూ హోటలు వైపు వెళ్ళాడు. హోటలు పనంతా అయిపోయి, దుర్గయ్య ఇక తన గదిలోకి వెళ్దామనుకుంటున్నాడు. ప్రసాద్‌ను చూసి, "తక్కినవాళ్లంతా వచ్చారా ?" అనడిగాడు చేతులు కడుక్కుంటూ దుర్గయ్య. "శాస్త్రి, కవి, వచ్చారు అని జవాబిచ్చాడు ప్రసాద్.

"నువ్వెక్కడికి వెళ్తున్నావ్."

"కాస్త టీ త్రాగి, అలా తిరిగి వస్తాను."

"సరే తొందరగా రా. ఇవాళ మూడు ముక్కలు, వేద్దామనుకుంటున్నాం." అని దుర్గయ్య వెళ్ళి పోయాడు. ప్రసాద్ మెల్లిగా టీ డికాషన్ లో పాలు పోసుకుని, పంచదార వేసుకుని కలుపుకో నారంభిం చాడు.

"సార్ !" అని రామం ప్రసాద్‌ని పిల్చాడు. రామం భోజనం చేస్తున్నాడు. వాడు ప్రసాద్‌ను చూడగానే, ఆప్త మిత్రుణ్ణి చూసినట్లు భావిస్తాడు.

"ఓయ్ !" అన్నాడు ప్రసాద్.

"సెలవు సార్ !"

"ఏమిటీ ?"

"సెలవంటున్నాను సార్. ఇక మరి నన్ను చూడరు సార్" అన్నాడు రామం, అన్నంలో సాంబారు పోసుకుంటూ.

"అదేమిటి రామం, అలాగంటున్నావు ?" అనడిగాడు ప్రసాద్ ఆశ్చర్యంతో.

మనసున మల్లెలు

ఒక గ్లాసుడు మంచినీళ్లు త్రాగి, ఒక చేతో అప్పడం పట్టుకుని, "నళిని నన్ను పొమ్మంది సార్." అన్నాడు ఏడుపు మొహం పెట్టి, అప్పడం ముక్క కొరికాడు.

"ఏమిటి? నిజంగానే? ఎందుకూ? అసలేం జరిగింది?"

అప్పడం సాంబారులో నంచుకుని తినేసి "రెండు రోజుల్నుంచి ప్రయత్నిస్తూంటే, ఇవాళ సాయంకాలం, కలుసుకోవడం జరిగింది సార్, ఆమె నన్ను చూసి, కోపంతో మండి పడి పోయింది సార్. నీ మొహానికి ప్రేమ కూడానా? అంది సార్. రాచ్చిప్పలాంటి మొహంట సార్ నాది." అని ఏడుస్తూ మజ్జిగ అన్నం కలుపుకో సాగాడు.

"ఏమిటీ అంత మాటందా?"

"అవును సార్. తన వెంటబడ్తే పోలీసులను పిలుస్తానంది సార్!"

"హా!" అని ప్రసాద్ దిగులులో పడిపోయాడు: "స్త్రీలెంత అమాయకులు! తమని మనసారా ప్రేమించి వచ్చిన పురుషుల్ని కుక్కలలా హీనంగా చూసి, 'పోలీసుల్ని పిలుస్తాం,' 'పెద్ద వాళ్లతో చెప్తాం' అంటారు. మళ్లీ వాళ్లే, తాము ఏనాడూ ముక్కూ మొహం ఎరుగని (ఏ రామయ్య గారి) అబ్బాయినో పెళ్లాడి జీవితాంతం బాధ పడ్తారు. అందుకే 'జగమే మాయా! బతుకే మాయా!' అని గోలెత్తాడు దేవదాసు. గోల ఎవరైనా విన్పించుకుంటేనా!' అనుకున్నాడు ప్రసాద్. అసలే తను గాయపడ్డ హృదయంతో బాధ పడ్తూంటే, మరొక వ్యధిత హృదయం తనకు తటస్థ పడడం సృష్టి వైచిత్రం. అయినా ప్రసాద్ ధీరోదాత్తుల కోవకి చెందినవాడు కాబట్టి తన దుఃఖాన్ని దిగమింగుకొని, రామంని వోదార్చడం ప్రారంభించాడు.

"ఇదిగో దిగులు పడకు. రామం. నళినికి నేను నచ్చ చెప్తాను. ఆమె ఎలాగైనా, నీదయ్యేటట్లు చేస్తాను. నా మాట విను." అన్నాడు.

"లాభం లేదు సార్. ఆమె ఇంకొకడి వలలో పడి పోయింది. లేకపోతే నన్నంతలా నిరాకరించదు." అని, "హుం — హుం — హుం — హుం — హుం" అంటూ ఏడవడం మొదలెట్టాడు. ప్రసాద్‌కి జాలి అంతా కోపంగా మారి పోయింది. ఎంత బాధయినా బొత్తిగా, ఆడ దానిలా ఏడవడం అతనికి మంటగా వుంది. రామం చెవి పట్టుకొన్నాడు. "ఏయ్ రామం! ఏమిటిది? నువ్వు మగాడివి కాదా? నీకు పౌరుషం లేదూ? సిగ్గు లేదూ? జవాబు చెప్పు. ఊ! జవాబు చెప్పు!"

"లేదు సార్ — — అహహ — — ఉంది సార్." అన్నాడు బెక్కుతూ.

"అయితే నే చెప్పింది విని, నేను చెప్పినట్లు చేస్తావా?"

"అలాగే సార్. కాని లాభం లేదు సార్."

"లాభం వుంటుంది. రేపు రాత్రిలోగా, నళినిని ఎవడు వలలో వేసుకున్నాడో వాడిని మనిద్దరం కలిసి పచ్చడి చేసేద్దాం. అప్పుడు ఆ పచ్చడిని వడి లేసి, ఈ 'రాచ్చిప్ప మొహం' వెనకాల పడ తీరు తుంది, నళిని."

ప్రసాద్ మాటలు వింటూంటే రామానికి కొంత ధైర్యం వచ్చింది. "నిజమే నంటారా?" అన్నాడు రామం ఏడ్పు మానేసి.

"ఓ! సందేహం లేకుండా. ఆడవాళ్లు, బలం కల మగాళ్లంటే పడి చస్తారనుకో. ఆమెను వలలో వేసుకున్న వాడెవడో, వాజమ్మ అయి వుంటాడు. నీ శరీరం. వర్కింగులో బాగా గట్టి పడి కండలు తిరిగి వుంది. వాణ్ణి మెల్లిగా ఆ మాటా ఈ మాటా చెప్పి ప్లాటుఫారం మీదికి తీసుకొస్తాను. నువ్వు వాణ్ణి చావ గొట్టేయ్. అవసరమైతే నేనూ ఒక ఒక వైపు నుంచి కాస్తాను. ఆ దెబ్బతో వాడు ఈ ఊరు వదిలి పారిపోతాడు. నళిని, నీ శక్తికి మెచ్చుకుని అమాంతం నీ కాళ్ల మీద పడ్తుంది. అయినా నువ్వు ప్రేమించిన అమ్మాయిని వలలో వేసుకోడానికి వాడికి ఎన్ని గుండెలున్నాయి? మేమంతా ఇక్కడ లేమను కున్నాడా? తల్చుకుంటే వాణ్ణి ఈ క్షణంలో హత మార్చెయ్య గలం. అయినా ఎందుకని ఇన్నాళ్లూ ఊరుకున్నాం. ఇహ వూరుకునేది లేదు." అని ప్రసాద్ లెక్చరిచ్చే సరికి రామం దిగులంతా పోయింది.

"మీరు చాలా మంచివారు సార్. మీ మేలు ఈ జన్మలో మర్చిపోలేను సార్"

"ఆ. ఇప్పుడు చెప్పు. ఆమెను వలలో వేసుకున్న వాడెవడో?"

"ఎవడో తెలియదు సార్?"

"అదే! ఇందాక తెలుసు నన్నావ్?"

"కాదు సార్! మరొకడి వలలో పడిందను కొన్నాను గాని, వాడెవడో తెలియదు సార్! మీరిప్పుడు, ఇంత ధైర్యం ఇస్తున్నారు కాబట్టి, వాడెవడో కనుక్కుంటాను.

"సరే అయితే. రేపలా ఎలాగైనా వాకబు చేసి, ఆమె ఎవడి వలలో పడిందో తెలుసుకో. తరువాత వాడి పని పట్టేద్దాం." అన్నాడు ప్రసాద్. అతనికి ఇలా ఒకరు ప్రేమించిన అమ్మాయిల్ని వలలో వేసుకునే వాళ్లంటే చాలా అసహ్యం. వాళ్లని ఏం చేసినా పాపం లేదు, అనుకున్నాడు. హోటలులో రామంతో, అలా తిరిగి వస్తానని చెప్పి, తరువాత మెల్లిగా నడుచుకుంటూ ప్లాటుఫారం మీద కాస్సేపు పచారు చెయ్య సాగాడు. కమల మనస్సుని మళ్లీ తన వైపు తిప్పుకోవాలంటే, 'ఏదైనా మంచి పని చెయ్యాలి.' అని బుచ్చిశాస్త్రి ఇచ్చిన సలహా బాగానే వుంది. మంచి పనంటే ఏమిటి? తన దగ్గిర డబ్బుంటే, ఎవరైనా బీద వాళ్లకిచ్చి దాన ధర్మాలు చేస్తాడనే ప్రఖ్యాతి పొందచ్చు. కాని అది తనకు సాధ్యం కాదు., ఎందుకంటే తనవద్ద అసలు డబ్బుం టేగా, దానం చెయ్యడానికి? ఇహ అది వీలు కాన ప్పుడు ఎవరి ప్రాణాలైనా రక్షించి, కొంత ఖ్యాతి గణించ వచ్చు. కాని ఎవరి ప్రాణాలైనా రక్షించా లంటే, వాళ్ల ప్రాణాలకి ప్రమాదం రావాలి కదా? తిరి కూచుని ఎవరైనా తమ ప్రాణం మీదకు ప్రమాదం తెచ్చుకుంటారా? ఆ పని అంతకన్నా కష్ట సాధ్యంగా కన్పించింది. పోనీ ఎవరి ఇల్లైనా తలగబడి పోతూంటే వెళ్లి టపీమని ఆ యింటిని ఆర్పేసి, సరిగ్గా విరిగిన దూలం మీద పడి పోతున్న సమయంలో గబగబ చంటి పిల్లల్ని బయటికి లాక్కొచ్చి, జనం అందరి ముందరా హీరోగా నుల్చుందామంటే, అది శీతాకాలం అవటం చేత, కావాలని నిప్పంటిస్తే తప్ప ఎవరిల్లూ కాలేటట్లు

లేదు. ఇలా ఎన్ని మంచి పనుల గురించి ఆలోచించినా అన్నీ అసాధ్యంగానే కన్పించాయి. చివరికి, తన దారి లోకి ఏదో ఒక మంచి పని తగిలేటట్టు చెయ్యమని భగవంతుణ్ణి ప్రార్థించడం కన్నా చెయ్య గలిగిందేదీ కన్పించలేదు. భగవంతుడిని తలుచుకోగానే ప్రసాద్ మనసులో, తను కోవెలకు వెళ్ళి చాలా కాలమైందను కున్నాడు. పరీక్షల ముందర అందరి లాగే దేవుడి మీద అమిత భక్తి శ్రద్ధలు ప్రకటించడమే కాని, కష్టాల్ని ఎదుర్కొనే టప్పుడు దేముడి సాయం తను కోరటం లేదు. మర్నాటి నుంచీ రోజూ సాయంకాలం పూట విధిగా కోవెలకు వెళ్ళాలని నిశ్చయించాడు. రామనగరంలో స్టేషన్ కవతల ఒక ఫర్లాంగు దూరంలో ఒక వేంకటేశ్వర స్వామి కోవెలా, దాని ప్రక్కన శివాలయం వున్నాయి. తనింత వరకూ ఎన్నడూ అటు వైపైనా వెళ్ళలేక పోయి నందుకు ప్రసాద్‌కి విచారం కలిగింది.

స్టేషను అంతా నిశ్శబ్దంగా వుంది. కొందరు ప్రయాణీకులు అక్కడక్కడ ప్లాటుఫారం మీద పడుకున్నారు. స్టేషను మాష్టరు గారి ఆఫీసులో లైటు వెలుగుతోంది. మాష్టరు గారు ఏదో రాసుకుంటూ కూర్చున్నారు. ప్రసాద్, దుర్గయ్య హోటలు లోకి వెళ్ళాడు. రామం నిద్రపోతూ, “ నళినీ ! ” అని కలవరిస్తున్నాడు. మళ్ళీ రాత్రి బండీ వచ్చే ముందర, సర్వర్లిద్దరూ లేచి టీ తయారు చెయ్యడం మొదలెట్టారు. రామ నగరం వూరంతా నిద్ర పోతోంది. కమల ఏం చేస్తూ వుంటుందా ? అని ఆలోచించాడు. తను ఎలాగైనా కమలను దక్కించుకోవాలి. లేకపోతే ఈ జీవితమే వృథా అనుకున్నాడు.

15

సుబ్బయ్య గారింట్లో దొంగలు పడ్డారని, తెల్లవారేసరికల్లా రామా నగరం అంతా గుప్పుమంది. రాత్రి పన్నెండు గంటల తరువాత జరిగి వుంటుందనీ, తెల్లవారు జాముప అయిదు గంటలకు, ఇంట్లో వాళ్ళు మామూలుగా లేచి చూసేసరికి, తలుపులన్నీ బార్లా తీసి వున్నాయనీ, ఇనప్పెట్టె తాళం తీసి వుందనీ అప్పుడు అందరూ లేచి ఏమేమిపోయాయో చూసుకోవడం మొదలెట్టారనీ అందరికీ తెలిసింది. వెంటనే, కరణం గారూ, పంచాయతీ బోర్డు ప్రెసిడెంటూ, మరిద్దరు వర్తకులూ, ఇంకా చాలా మంది పరిచితులూ, అంతా సుబ్బయ్య గారింటికి వచ్చి పరామర్శించ సాగారు. ఒక గంటసేపు, ఇల్లూ, వాకిలీ, పెరడూ, అన్నీ వెతికి చూసుకున్నాక పోయిన వస్తువుల వైనం తేలింది. సుమారు ఏభై తులాల బంగారం పోయింది. రెండు రాళ్ళ నెక్లెసులూ, చంద్రహారం, వగైరా నగలు, ముఖ్యంగా కమల కోసం చేయించినవి పోయాయి. అప్పటికి రెండు రోజుల క్రితమే కంసాలి వాటిని చేసి తెచ్చాడు. తక్కిన ఆడవాళ్ళ నగలు చాలా వరకూ వారి వంటి మీదనే వున్నాయి కాబట్టి పోలేదు. రొక్కం అయిదు వందల కన్నా, ఎక్కువ ఇంట్లో వుంచరు కాబట్టి, అంతకన్నా ఎక్కువ పోలేదు. వెండి సామాను, సుమారు వెయ్యి తులాల సామాను పోయింది. అంతా కలిపి సుమారు ఏడెనిమిది వేల రూపాయల సరుకు పోయింది. చాలా వరకూ బంగారం, డబ్బూ, బాంకులో వుంచారు కాబట్టి,

మనసున మల్లెలు

ఆయనకు పెద్ద దెబ్బ తగులలేదు. కాని, మరొక రెండు రోజులలో కమల పెళ్ళి వారు రాబోతూండడం, ఆ సమయంలో ఆమె ధరించడానికి చేయించిన నగలు పోవడం, అందరికి మనసులో కష్టం అనిపించి, ఎంతో వెడ్డగా తోచ సాగింది. సుబ్బయ్యగారు, ఇంట్లో ఆడవాళ్లు ఏడా రిస్తూంటే, వారిని విచారించవద్దని కేక లేశారు. వచ్చిన వారందరితో కూడా "కానీండి. ఏం చేస్తాం? అన్నిటికీ ఆ రాముడే వున్నాడు. ఇంత వరకూ నేను అనేక కష్టాలు చవి చూశాను. కాని నా ఇంట్లోకి దొంగ ప్రవేశించడం ఇదే మొదటి సారి. సరే ఈ అనుభవం కూడా అయింది." అని అంటూ విర క్తిని ప్రదర్శించారు కాని, మనసులో 'అయ్యో సరిగ్గా పిల్ల పెళ్లి తల పెట్టిన సమయంలో లోనే ఈ పని జరిగిందే. దాని కోసం చేయించినవి దొంగలెత్తుకు పోయారే అని' బాధ పడక పోలేదు. తరువాత పోలీసు సబ్ ఇన్స్పెక్టరు దర్యాప్తుకు వచ్చినప్పుడు, ఆయన అదే అన్నారు. "అయ్యా! సబ్ ఇన్స్పెక్టరుగారూ! నాకు మా చిన్న మ్మాయి ప్రధానం కోసం చేయించిన నగలు పోయాయని చాలా విచారంగా వుంది. దొంగని వస్తువులతో పట్టుకుంటే గాని నాకు మనశ్శాంతి లేదు. మీరు గాని, పైవారు గాని, దొంగని పట్టుకుని, వస్తువుల్ని తిరిగి తెస్తే, మంచి బహుమతి ఇస్తాను." అన్నారు. పోలీసులు స్టేట్మెంటులు తీసుకున్న తరువాత వెళ్లిపోయారు. దొంగ ఇంట్లోకి ఎలా ప్రవేశించాడో ఎవరికీ బోధ పడలేదు. ఎక్కడా కన్నం వెయ్యలేదు. గోడ దూకి వచ్చుంటాడని అనుకున్నారు. వెళ్లి పోయేటప్పుడు మాత్రం తలుపులు తీసుకుని వెళ్లి

పోయాడు. ఆ రోజంతా కమలా, విమలా, సుబ్బయ్య గారి భార్యా విచారంగానే వున్నారు.

రవికుమార్, దొంగను ఎలా పట్టుకోవడమా అని ఆలోచిస్తూ వున్నాడు. మధ్యాహ్నం మద్రాసు నుంచి వుత్తరం అందింది. సరిగ్గా ఆ మర్నాడు కాక మూడో నాడు, రామయ్యగారూ, ఆయనభార్యా, వారబ్బాయీ, కమలను నిశ్చయం చేసుకోడానికి, వస్తున్నామని వ్రాశారు. అది చదువుకుని సుబ్బయ్యగారు, భగవం తుడు ఎప్పుడూ ఒక మంచి, ఒక చెడ్డా కలిపి తీసుకు వస్తూంటాడనీ, అంధకారంలో ఆశాకిరణం చూపిస్తూంటాడనీ అనుకుని నిట్టూర్చారు.

కమల మనసులో ఆ రోజంతా అనేక రకాలైన భావాలు మెదుల్తున్నా, ఒక విచారం మట్టుకు బాగా బాధించసాగింది. ఈ దొంగతనం ప్రసాద్ వలన జరిగిందని ఆమె అనుమానించడమే కాక, తప్పక అతను చేసి ఉంటాడనే నిశ్చయానికి వచ్చింది. కొన్ని రోజుల క్రిందట అర్ధరాత్రి సాహసంగా తన ఇంట్లోకి ప్రవేశించడమే కాక, రవికుమార్ చావబాది, కాళ్లూ చేతులూ కట్టేసిన దగ్గర్నుండి, ప్రసాద్ అంటే గల మంచి అభిప్రాయం ఆమెలో పూర్తిగా మారిపోయింది. అతనొక రౌడీ అని సుబ్బయ్యగారన్న మాటలలో ఎంత మాత్రం అబద్ధం లేదనిపించింది. అసలతను ఏదో దురుద్దే శంతో తన మీద ప్రేమ ప్రదర్శిస్తున్నాడని ఆమె అనుమాన పడుతూనే ఉంది. అటువంటి ఒక దుర్మార్గుడికి తన హృదయాన్నర్పించడం తన పొరపాటనుకుంది. కానీ అప్పుడప్పుడు అతని

మాటలూ చేష్టలూ, జ్ఞాపకం వచ్చి అంత అందమైన యువకుడు అలాంటి వాడయి ఉంటాడా? అని, అతనిలో చదువూ, సంస్కారమూ కన్పిస్తు న్నాయి కదా, ఇలాంటి పనులెందుకు చేస్తాడు? అనే సందేహం కలుగుతూండేది. మళ్ళీ అసలతను తన వూరేమిటో, తన పనేమిటో, రామనగరం ఎందుకు వచ్చాడో చెప్పక పోవడానికి కారణం ఏమిటి? ఏ ఉద్యోగమూ, సద్యోగమూ లేకుండా కేరాఫ్ ప్లాటు ఫారంగా ఎందుకు తిరగాలి? ఇదంతా నటన. అతనొక ఘరానా దొంగ అయివుంటాడు. రామ నగరానికి వచ్చి, సుబ్బయ్యగారు బాగా డబ్బున్న వ్యక్తి కదా అని డబ్బు మీద ఆశచేత, కమలని వివాహం చేసుకుందామని చూసి ఉంటాడు. కాని అలాంటి పని జరుగకుండా సుబ్బయ్యగారు తగిన జాగ్రత్త తీసుకునే సరికి, ఇంక ఆ పద్ధతి లాభం లేదని, ఏకంగా ఆయన ఇంట్లో దొంగతనమే చేసి చేతి కందింది పట్టుకు పోయాడు. అయినా తనెంత నిర్భాగ్యురాలు! ఎందమావుల్ని చూసి భ్రమించింది. తన హృదయాన్ని హరించిన యువకుడు కేవలం ఒక గజ దొంగ కావడం ఎంత దురదృష్టం. ఛీ, పాడు బ్రతుకు! అనుకుంటూ గదిలో ఆమె ఒక్కర్తే కూచొని ఏడ్వసాగింది. బల్లమీద తల పెట్టుకుని ఆ సమయంలో విమల ఆ గదిలోకి ప్రవేశించింది.

"ఏమిటే చిన్నా? నగలు పోయాయని ఏడుస్తున్నావా?" అని చెల్లెలు తలని తన చేతు లోకి తీసుకుని వోదార్చ సాగింది. "ఛ! అలా విచారిస్తారా? నాన్నగారు మళ్ళీ వెంటనే కొంటా నంటున్నారు. నువ్వు బెంగపెట్టుకోకు." అంది.

"అది కాదక్కా! ఆయన ఇలాంటి వారనుకో లేదు."

"ఎవరు? ప్రసాదా?"

"అవును."

"అయితే ఈ పని ప్రసాద్ చేశాడంటావా? పొరపాటు పడుతున్నావు"

"లేదక్కయ్యా. నాకు తెలుసు." అని, ప్రసాద్ తన గదిలోకి రాత్రి పూట వచ్చిన నాటి సంఘటన చెప్పింది. ప్రసాదే, రవికుమార్ కాళ్లూ చేతులూ కట్టేశాడని తన కొక్కర్తికే తెలుసుననీ, అందుకే ఈ దొంగతనం కూడా ప్రసాదే చేసిఉంటాడని, అంది. విమల ఆమెతో ఎంత మాత్రం ఏకీభవించలేదు.

"ఇందులో ఏదో రహస్యం ఉంది. తరువాత నీకు ప్రసాద్ ఉత్తరాలు రాయలేదా? అందులో ఈ విషయం గురించి రాయలేదా?"

"ఆయన తరువాత రెండుసార్లు నాకు ఉత్తరాలు అంద జెయ్యాలని చూశారు. కాని నేనసలు అవి తీసుకోలేదు. అప్పయ్య నలా చేశారని, నాకు కోపం వచ్చింది. అందుకని వాటిలో ఏం రాశారో తెలియదు."

"అక్కడే పొరపాటు చేశావు. సరే అయిందేదో అయింది. ప్రసాద్ అలాంటి వాడు కాదని నాకు గట్టి నమ్మకం ఉంది. ఒక వేళ ఇది అతని పనే అయితే ఈ పాటికి అతను ఈ వూరు నుంచి పారిపోయే ఉంటాడు. సాయంకాలం రామారావుగారు మనిం టికి వచ్చినప్పుడు, అతను ఇంకా ఈ వూళ్లోనే ఉన్నాడో, ఎక్కడికైనా వెళ్లాడో కనుక్కుందాం. అతను వూళ్లోనే ఉన్నట్లయితే నిర్దోషిగా భావించవచ్చు." అంది విమల. (సశేషం)



ఇల్లు తగలడిందని మీరేనా? ఫోన్ చేశారు!
అంత తొందరగా వచ్చేశారే? మళ్లా యిల్లు కట్టేశాం?

సరాగమాల

వి.ఎ.కె. రంగారావు

ఆత్రేయావారి మొదటి చిత్రం మొదటి పాట మల్లాదివారు మీరిది చదివేనాటికి వ్రాయటం, అశ్వత్థామ దానికి వరస చేయటం నిర్మాత ఎం. కె. రెడ్డి, దర్శకుడు కె. హేమాంబరధరరావు వినటం పూర్తయి ఉంటుంది. నవ్యోత్సాహంగల (వయసులో) చిన్న దర్శకులంటే మల్లాది వారికి అత్యంతాభిమానం. ఇక హేమాంబరధరరావుగారికి వారంటే ఏనాటినుంచో గౌరవం. వీరిద్దరి బాంధవ్యం మూడు పూవులు సంవత్సరానికి ఆరు పాటలుగా వర్థిల్లాలని నా ఆశయం. ఈ సమయాన మల్లాది అశ్వత్థామ కలయికను సాధించిన ఎం. కె. రెడ్డిని అభినందించకుండా ఉండలేకపోతున్నాము. ఈ కలయికకు "రేచుక్క" వంటి ఆర్థిక సంపదా, "కలిమిలేములు" వంటి కళా సంపదా, "చిన్న కోడలు" వంటి సంగీత సంపద సమకూరుతాయని ఆశిస్తున్నాము.

అపర్ణావారి 'రాజద్రోహి' చిత్రానికికూడా మల్లాది అశ్వత్థామల సాహిత్య సంగీతాలు. ఇక్కడ ఈ కలయికను సాధించినది పత్రికా సంపాదకుడు, రచయిత అయిన గౌతమ్.

* * *

ఆ మధ్య ఎవరో సాంస్కృతికోత్సవాలు జరుపుతూ ఒక పోటీకి మీరు బహుమతి ఇవ్వాలనుకుంటున్నాము. ఏవైనా పంపండి అని వ్రాశారు. నన్నడిగారు కదా అని నాలుగు మంచి రికార్డులు ఎంచి పంపించాను. కాని అవి ప్రైజుగా ఇవ్వలేదట. ఎందుకంటే అవి యిస్తే వాటితోబాటు గ్రామఫోను కూడా ఇవ్వాలట. ఇదే మాట గంధర్వ ప్రశ్నల సమయంలో కూడా అన్నారు. ఇదే తర్కం అన్నిటికీ అవలంబిస్తే రజిత పాత్రలు ఇచ్చేటప్పుడు అవి పెట్టుకోడానికి అద్దాల బీరువాలు ఇవ్వాలి, పుస్తకాలు ఇస్తే (వాటిని చదివి ఆనందించగల శక్తి ఆ బహుమతి అందుకున్న వానికి లేకపోయిన యెడల) అవి విడమరిచి చెప్పించుకునేందుకు టీచరుని ఏర్పాటు చేయాలి. సువర్ణ పతకం ఇస్తే అది తగిలించుకోడానికని ఒక ఉలెన్ కోటు ఇవ్వాలి. ఆఖరికి ఒక ప్రశంసా పత్రంతో సరిపెడదామనుకున్నా ఆ పత్రం చూసి ఉద్యోగం ఇచ్చేవాడిని మనమే చూసిపెట్టాలి. మహాశయా! ఇలా వాదిస్తే దానికి వారధి ఎక్కడ! అయితే మీ వూరి వారికి రసికతలోనేకాని తర్కంతో ప్రముఖ పరిచయం లేదన్నమాట.

* * *

సరాగమాల పాఠకులలో సరిదె లక్ష్మీనరసమ్మ అంటే ఫలానా అని తెలుసుకోగలిగిన వారు నూటికి ఒక్కరూ కూడా ఉండరంటే అతిశయోక్తి కాదు. కళావర్ రింగ్ అంటే మరికొద్ది మందికి తెలుస్తుందేమో! ఈనాటి పాఠకులకు తెలియకపోయినా, సంగీత నృత్యాలందు అభిమానమున్న ప్రతి వ్యక్తికీ, మూడు నాలుగు దశాబ్దాల క్రిందట కళావర్ రింగ్ పేరు బాగా తెలిసి ఉండేది.

కళావర్ రింగ్ పుట్టడం పేద కుటుంబంలో పుట్టినా పెరగటం విజయనగరంలో, సకల శృంగార కళలకు ఆలవాలమైన విజయనగరంలో. ఉన్నంతలో గొప్పదైన కళావంతుల ఇంట్లో పెరిగింది. వంశ మర్యాద ప్రకారం ఆటా, పాటా నేర్చింది. రెండు దశాబ్దాల శ్రోతలను ఆంధ్రదేశమంతటా ఒక వూపు వూపింది.

నాకు చిన్నతనం నుంచి ఆమె పాడిన "రాత్రి నాటకమైనది మొదలుగా రాదుగాదా విదుర" అన్న పాట చాల ఇష్టం. అందువలన ఆమెను కలుసుకోవాలని ఎన్నో రోజులనుంచి అనుకుంటున్నా, ఆ కోరిక రెండేళ్ల క్రితమే తీరింది. ఏదో పనిమీద ఆ వూరు వెళ్లితే ఒ. రామకృష్ణయ్య కళావర్ రింగ్ ఇంటికి తీసుకువెళ్లారు. అదే ఆమెను నేను మొదటి మారు చూడటం. పాపం చాలా ముసలితనం కనబడుతున్నది ముఖంలో, వాలకంలో అనుకున్నాను. ప్రసంగవశాత్తు ఆమె చిన్ననాడు పాడిన పాటల గురించి ముచ్చటిస్తూ ఉండగా "యాగము వలదు సుమీ" అన్న పాట ప్రశక్తి వచ్చింది. ఈ పాట చేతిలో శూలము ధరించి పాడేదట. (వాడుద్దేశం సతీదేవి దక్షునితో వాదించే పాట) ఓహో అలాగా అని నేనంటే వెంటనే ఆనాటి శూలం తెప్పించి దుమ్ము దులిపి మొదటి పల్లవి, చరణం కళావర్ రింగ్ పాడింది. ఇరవై అయిదేళ్ల క్రితం ఆమె నటించిన ఒకేఒక చిత్రం "రాణీ ప్రమీలా" ఇందులో పాటలుకూడా నేను గుర్తుచేయగా రెండు పాటలు పాడింది. మొదట చూసినప్పుడు అంత వార్ధక్యం కనిపించినా పాటలు పాడేసరికి ఆమెలో ఎంత ఉత్సాహం పొంగు వచ్చిందో చెప్పలేను. సుమారు రెండు గంటలు కూర్చున్నాను అక్కడే. పాత ఫోటోలను చూస్తూ పాత విషయాల గురించి ముచ్చటిస్తూ ఆనాటి విషయాలు ఎన్నో చెప్పింది. తనకు కళావర్ రింగ్ అనేపేరు ఎలా వచ్చిందోకూడ తెలుసుకున్నాను. ఆమె చిన్నతనంలో ఎంతో ముచ్చటపడి కళావరు మార్కులాంటి ఉంగరం చేయించుకుందట. ఒక ఆకతాయి పిల్లవాడు వేళంలో ఆ ఉంగరాన్ని చూపి ఓ కళావర్ రింగ్ పిల్లా అన్నాడట. అప్పటికి ఆమె వయస్సు పది, పదకొండు. అప్పటినుంచి ఆ పేరే స్థిరమైపోయింది.

కళావర్ రింగ్ చేసిన దానధర్మాలు జాబితా పూర్తిగా బహుశః ఎవరికీ తెలియదేమో. విజయనగరం దగ్గరనే ఉన్న రామతీర్థాలలో ఎన్నో వేలు ఖర్చుపెట్టి ఒక సూయి త్రవ్వించింది. సుమారు ఒక వంద పేద విద్యార్థులకు అన్నదానం, విద్యాదానం చేసి ఉంటుంది. నిజం చెప్పుకోవాలంటే ఆమెకు అంతో ఇంతో ఋణపడి ఉన్నవారు మద్రాసు చిత్రసీమలో ఎంతోమంది ఉన్నారు. ఘంటసాల ఎప్పుడు అటు వెళ్లినను ఆమెను చూడకుండా వచ్చేవారు కారట.

అటువంటి స్థితిగతులలో ఉన్న చాలమంది వలెనే కళావర్ రింగ్‌కూడ కృష్ణభక్తురాలు. శరీరం ఏమిటి చేసినా 'వాని'పై మనసు ఉంచగలిగితే ఆ దోషం అత్మకంటదు అని ఆమె నమ్మకమని నేను గ్రహించాను. ఆమె నేడు నేలతో స్వర్గస్థురాలైనది.


వారికి ఆత్మశాంతి కలిగించమని భగవంతుని ప్రార్థిస్తున్నాను. ★



'అగ్గిపిడుగు'లో కృష్ణకుమారి, ఎన్. టి. రామారావు.

భారీయెత్తున దేశరక్షణకు

ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి



క్కినేనితో గోష్ఠి జరుపుతున్న యు. ఎస్. ఐ. ఎస్. చీఫ్ తెలుగు ఎడిటర్ శ్రీ బి. యస్. ఆర్. కృష్ణ, ఫీచర్ రైటర్ శ్రీ ఏ. ఎం. రాజా.

అమెరికాలో అక్కినేని పర్యటన అనుభవాలు

మద్రాసు గోష్ఠిలో వివరణ

ప్రఖ్యాత సినీనటుడు, నిర్మాత శ్రీ అక్కినేని నాగేశ్వరరావు అమెరికాలో రెండు నెలల పర్యటన అనంతరం స్వదేశానికి తిరిగివచ్చారు. మద్రాసులో ఒక ఇంటర్వ్యూలో ఆయన తన అనుభవాలను గురించి చెబుతూ అమెరికన్ కళాశాలల్లోనూ, విశ్వవిద్యాలయాల్లోనూ లలిత కళల బోధనకు ఇస్తున్న ప్రాముఖ్యం తన కెంతో నచ్చిందని అన్నారు.

అమెరికన్ జీవితంలో ప్రతి అంశమూ పరిశీలించానన్నారాయన. వైద్య, న్యాయశాస్త్రం బోధనకు ఎంత ప్రాముఖ్యం ఇస్తున్నారో, లలిత కళల బోధనకు కూడా అమెరికాలో అంతటి ప్రాముఖ్యం ఇస్తున్నారు. "విశ్వవిద్యాలయ చదువులు లలిత కళలకు ప్రాతిపదికలుగా ఉండటం నాకెంతో నచ్చింది", అన్నారు శ్రీ అక్కినేని.

శ్రీ నాగేశ్వరరావు అమెరికా విదేశాంగశాఖవారి ఆహ్వానంపై ఆ దేశంలో 60 రోజులు పర్యటించారు. ఈ పర్యటనలో ఆయన పలు అమెరికన్ రాష్ట్రాలకు వెళ్ళి అనేక విశ్వవిద్యాలయాలూ, కళాశాలలూ, నాటక మందిరాలూ, నాటక పాఠశాలలూ, ఫిల్ము స్టూడియోలు చూచారు.

"ఒక కళాకారునిగా, అమెరికన్ ప్రజలు లలిత కళలకు ఇస్తున్న ప్రాముఖ్యం నాకు గర్వకారణంగా కనుపించింది. కళలు మానవుని జీవితంలో సౌరస్యాలు కల్గిస్తాయి. ఆ విధంగా అతనిలో నిజమైన మానవత్వాన్ని పెంపొందిస్తాయని నా భావం" అన్నారు శ్రీ అక్కినేని.

శ్రీ నాగేశ్వరరావు అనేక వృత్తి నాటక సమాజాల థియేటర్లు— న్యూయార్కులోని లింకన్ రిపర్టరీ థియేటర్, మినియాపొలిస్‌లోని గ్రరీ థియేటర్, క్లీవ్‌లెండ్ వాషింగ్టన్, బఫెలో, సియాటిల్ నగరాలలోని థియేటర్లు, ఇంకా అనేక థియేటర్లు చూచారు. అయితే, విశ్వవిద్యాలయాల థియేటర్లు అన్నింటికంటే తనకు బాగా నచ్చాయన్నారాయన. "వృత్తిరీత్యా నాటకాలు వేసేవారు ఏ లోపం కనపడనీయకుండా చక్కగా చేస్తారు. కాగా విశ్వవిద్యాలయాల థియేటర్లలో, రకరకాల నాటక ప్రదర్శనల గురించి ప్రయోగాలు చేస్తుంటారు" అన్నారు శ్రీ అక్కినేని నాగేశ్వరరావు.

అమెరికాలో అభినయ కళలు (పెర్ఫార్మింగ్ ఆర్ట్సు) ప్రతి రంగంలోనూ ఎంతో పురోగమించాయనీ, అక్కడ అనుసరించబడుతున్న కొత్త పద్ధతులను భారతదేశంలోకూడా ప్రయోజనకరంగా అనుసరించవచ్చుననీ, ఆయన చెప్పారు.

క్లీవ్‌లెండ్‌లో శ్రీ నాగేశ్వరరావు కరాము థియేటర్, క్లీవ్‌లెండ్ ప్లేహౌసు చూచారు. ఈ రెండు థియేటర్లు స్కూలుపిల్లల కోసమని ఉదయం మధ్యాహ్నం ప్రత్యేక నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తాయనీ, వీటిని చూడటానికి బడిపిల్లలను ఈ థియేటర్లకు బస్సులలో తీసుకువస్తారని చెప్పారాయన. "ఇందువల్ల పిల్లలో పిన్నతనంలోనే లలిత కళలపట్ల అభిరుచి ఏర్పడి, వృద్ధిచెందుతుంది" అన్నారు శ్రీ అక్కినేని.

అమెరికన్ ప్రజలలో లలిత కళలపట్ల ఎంతో శ్రద్ధాసక్తులున్నాయి. వారు ఈ కళలకు గొప్ప నైతిక బలాన్ని చేకూర్చటమేగాక, ఉదారంగా విరాళాలిచ్చి పోషిస్తుంటారు అని చెప్పారాయన.

హాలీవుడ్‌లో

లాస్ ఏంజలిస్‌లో శ్రీ నాగేశ్వరరావు ట్వెంటియత్ సెంచరీ ఫాక్సు స్టూడియో, వాల్ట్‌డిస్నీ ప్రొడక్షన్స్, యూనివర్సల్ పిక్చర్స్, మెట్రో— గోల్డ్విన్— మేయర్ స్టూడియోలతో సహా అనేక చలన చిత్ర నిర్మాణ సంస్థలను సందర్శించారు.

అమెరికన్ చలనచిత్ర నిర్మాతలు తమపై తామే స్వయంగా కొన్ని సెన్సార్ నిర్బంధాలు విధించుకొంటున్నారని, ఆ విధంగా సెన్సార్ నిబంధనలను తమలో ఎవరూ ఉల్లంఘించకుండా స్వీయ నిగ్రహ పద్ధతిని అనుసరిస్తున్నారని శ్రీ నాగేశ్వరరావు చెప్పారు. "ఈ స్వీయ నిగ్రహ పద్ధతి చాల బాగుంది. ఇండియాలో మనంకూడా దీనిని ప్రవేశపెట్టుకోవచ్చునని నా అభిప్రాయం" అన్నారాయన.

ఈ ప్రముఖ సినీ నటుడు మినియాపొలిస్‌లో ఒక చిన్న రైతు కుటుంబంవారితో కొన్ని రోజులున్నారు. "100 ఎకరాలకు పైగా ఉన్న కమతాన్ని ఆ రైతు కుటుంబంవారే స్వయంగా చేసుకొంటున్నారు. వారి పిల్లలు బడినుంచి రాగానే తలితండ్రులకు సహాయపడతారు. వేషభాషలు తప్ప అమెరికన్ రైతులు, భారతీయ రైతులు ఒకే రకంగా ఉంటారు. వారి కుటుంబంలో ఒకడుగా వారు నన్ను చూచుకొనేవారు. ఇది నిజంగా అద్భుతమైన అనుభవం" అన్నారు రైతు కుటుంబంనుంచి వచ్చిన శ్రీ అక్కినేని నాగేశ్వరరావు.

అమెరికన్ ప్రజల ఆదరణ, ఆప్యాయత, అరమరికలులేనివారి మర్యాదలు శ్రీ అక్కినేని హృదయం మీద చెరగని ముద్రవేశాయి. "నేను అమెరికాలో ఎక్కడికి వెళ్ళినా స్వగృహానికి వెళ్ళినట్లే అనిపించేలా చూచారు. అతిథి మర్యాదలో వారికివారే సాటి, ఇందుకు వారిని అభినందించాలి" అన్నారాయన.

తన అమెరికా పర్యటన అనుభవాలను త్వరలో పుస్తక రూపంలో వెలువరించాలనుకుంటున్నారీ అనుభవజ్ఞుడైన నట ప్రముఖుడు. [యు.ఎస్.ఐ.ఎస్.]

మద్రాస్ సినీమా వార్తలు

మరొక అరవచిత్రానికి దర్శకుడుగా ఆదుర్తి సుబ్బారావు

అన్నై మూవీస్ వారి "తాయిన్ మడియిల్" అనే తమిళ చిత్రానికి ఆదుర్తి సుబ్బారావు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో కథానాయకీ నాయకులుగా బి. సరోజాదేవి, యం. జి. రామచంద్రన్ ఉంటారు. ఎస్. ఎం. సుబ్బయ్య నాయుడు సంగీతం వహిస్తారు.

అభయ ఫిలింస్ వారి ప్రొడక్షన్ నెం. 1

అభయ ఫిలింస్ వారు తమ ప్రథమ చిత్రాన్ని సాంఘికంలో తీయ నున్నారు. ఈ చిత్రానికి రచన పినిసెట్టి శ్రీరామమూర్తి. ఈ చిత్రం పూర్తిగా సస్పెన్స్ — థ్రిల్లింగ్ — డిటెక్షన్‌తో కూడి వుంటుందని తెలుస్తుంది. ఈ చిత్రం మొత్తంపై 7 పాటలను ఉంచటానికి నిర్ణయించినట్లుగా తెలుస్తుంది. వీరు త్వరలోనే సెట్సు పైకి వెళ్ళనున్నారు.

సినిమా వార్తలు

ఈ చిత్రంలో జగ్గయ్య, కృష్ణకుమారి, ప్రభాకరరెడ్డి, పద్మనాభం, గీతాంజలి, స్వర్ణ, బాలయ్య మొదలగువారున్నారు.

ఛాయ : యం. జి. సింగ్., కళ : రాజేంద్ర కుమార్., కూర్పు: అంకిరెడ్డి., సంగీతం: అశ్వద్ధామ., స్టూడియో . వీనస్., నిర్మాత : యం. కె. రెడ్డి., దర్శకుడు : కె. హేమాంబరధరరావు.

అనుపమా ఫిలింస్ ఔట్ డోర్‌లో రెండు పాటల చిత్రీకరణ

అనుపమా ఫిలింస్ వారు ఈమధ్య అవుట్ డోర్ షూటింగ్ అమలాపురం, కొత్తపేట, నర్సాపురం మొదలగు ప్రాంతాలలో జరిపేరు. ఈ షూటింగ్‌లో

" ఉంగరాల జుత్తు వాడా . . . . . "

" కాయందరు ఓరి నాయనా . . . ."

అనే రెండు పాటలను కృష్ణకుమారి, కొంత మంది బృందం; హాస్యజంట చలం, గిరిజాకుమారితో చిత్రీకరించారు. ఈ చిత్రీకరణలో కథా నాయకుడు జగ్గయ్య, ప్రభాకరరెడ్డి మొదలగువారు కూడా వుంటారు.



'దాగుడు మూతలు'లో బి. సరోజా దేవి.

ఇంకా ఈ చిత్రంలో గుమ్మడి, రమణారెడ్డి, సూర్యకాంతం, వాసంతి, చదలవాడ, లక్ష్మీకాంతమ్మ మొదలగు వారున్నారు.

సంభాషణలు : పినిసెట్టి శ్రీరామమూర్తి, పాటలు : ఆరుద్ర, కొసరాజు రాఘవయ్య చౌదరి నిర్మాత — దర్శకుడు : కె. బి. తిలక్.

హాస్యనటుడు రేలంగి

శ్రీ రేలంగి నటించిన 200వ, చిత్రం త్వరలోనే విడుదల కాబోతుంది. రేలంగి త్వరలోనే రెండు వందల చిత్రాలు పూర్తిచేసి ' డబుల్ సెంచరీ ' చేయబోతున్నట్లు వార్త.

విజయభట్ మూవీస్‌లో భానుమతి

విజయభట్ మూవీస్ వారు నిర్మిస్తున్న సాంఘిక చిత్రం తమిళంలో విజయవంతమైన "కర్పగం" చిత్రం మూలకథగా చిత్రీకరిస్తున్నారు. షూటింగ్ ప్రారంభమైంది. ఇంతవరకు ఈ చిత్రానికి నామకరణం చేయలేదు. ప్రొడక్షన్ నెం. 1గా చిత్రీకరించబడుతుంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా శ్రీమతి పి. భానుమతి నటిస్తున్నట్లు తెలుస్తుంది. హీరోగా యన్. టి. రామారావు నటిస్తున్నారు. వీరు గాక ఇంకా ఈ చిత్రంలో యస్. వి. రంగారావు రమణారెడ్డి, నాగయ్య, రామకృష్ణ, నాగభూషణం, జమున, గీతాంజలి మొదలగువారు నటిస్తున్నారు.

ఆదుర్తి సుబ్బారావు, శ్రీమతి భానుమతి కలిసి పని చేసిన తొలిచిత్రం ఇదే.

"వీరాభిమన్యు"

రాజలక్ష్మి ప్రొడక్షన్సువారు "వీరాభిమన్యు" చిత్రాన్ని తెలుగు, తమిళ భాషలలో నిర్మిస్తున్నారు. రెండు భాషల చిత్రాలకు యువదర్శకుడు వి. మధుసూధనరావు దర్శకత్వం వహిస్తారు. తమిళ చిత్రానికి మాటలు—, పర్యవేక్షణ : ఏ. ఎస్. ఏ. స్వామి చూసుకుంటారు. తెలుగు మాటలను సముద్రాల రాఘవాచార్య వ్రాస్తారు. పాటలు పలుగురైదుగురుచే వ్రాయిస్తారని తెలుస్తుంది. సంగీతం : కె. వి. మహదేవన్, ఛాయ : రవికాంత్ నిగాయిజ్, కళ: యస్. కృష్ణారావు రెండు భాషలకు వీరే బాధ్యత వహిస్తారు. నిర్మాతలు శ్రీ సుందరలాల్ నహాతా అండ్ డూండీ.

ఈ చిత్రంలో కృష్ణుడుగా యన్. టి. రామారావు, అర్జునుడుగా కాంతారావు, దుర్యోధనునిగా రాజనాల, సుభద్రగా యస్. వరలక్ష్మి, ఉత్తరగా నూతన నటి కాంచన నటిస్తారు.

శ్రీ సుందరలాల్ నహాతా

శ్రీ సుందర్‌లాల్ నహాతా దక్షిణ భారత ఫిల్ము వాణిజ్య మండలికి కోశాధికారిగా ఏకగ్రీవంగా 1964—65కు ఎన్నిక అయినారు.

అనుపమా వారి "పట్నాటి యుద్ధం"

అనుపమావారు ప్రప్రథమంగా సాంఘిక చిత్రం "అనురాగం"ను ఆంధ్రులకు సమర్పించి వారి మన్ననలను అందుకున్నారు. వారి ద్వితీయ

చిత్రానికి సంబంధించిన ఛోగట్టాలను కళా దర్శకుడు గోఖలే తెలుసుకోవడంలో ఎక్కువ కృషి చేశారు. దేవాలయాల మీద ఉన్న శాసనాలు ఫోటోలు తీశారు. పల్లెపట్టు వాతావరణం వెళ్లి వారు క్షుణ్ణంగా గ్రహించారు. ప్రస్తుతం కళా దర్శకుడు "స్కెచెస్" వేయడం, ప్రిన్సు పర్సు పూర్తి చేస్తుండటం జరుగుతుంది. ఈ మధ్య శ్రీమతి పి. భానుమతి పాడగా ఒక పాట రికార్డు చేస్తారు. త్వరలోనే సెట్సుమీదకు వెళ్తారు.

ఈ చిత్రంలో బ్రహ్మయ్య నాయుడుగా యున్. టి. రామారావు, నాయకురాలి నాగమ్మగా శ్రీమతి భానుమతి వేస్తున్నారు. అలరాజుగా కాంతారావు, ఫలగామరాజుగా గుమ్మడి వేస్తారు. పిచ్చిక గుంట కథకులు— ఇతర బుర్రకథ దళాల వాళ్లు —పల్నాటి వీరగాథను అభినయ పూర్వకంగాను, ఎంతో రసవత్తరంగాను చెబుతూంటే వెళ్లిన వారు వినడం జరిగింది. ఈ చిత్రంలో ఉపయోగించే కత్తులను, అలంకారాలను కొన్నిటిని కళా దర్శకుడు శ్రీ గోఖలే అక్కడనే చేయవలసిందిగ ఆర్డరు ఇచ్చి వచ్చేరు.

ఈ చిత్రానికి సంగీత దర్శకుడు యుస్. రాజేశ్వరరావు.

'తేనె మనసులు'

బాబూ మూవీస్‌వారు నూతన తారాగణంతో తాజాగా నిర్మిస్తున్న "తేనె మనసులు" చిత్రంలోనికి రెండు పాటలు రికార్డు చేశారు. ఈ రెండు పాటలు ఆచార్య ఆత్రేయ వ్రాశారు. ఒకటి పి. బి. శ్రీనివాస్, రెండవది పి. సుశీల పాడేరు. ఈ చిత్రంలో ముఖ్య పాత్రధారులతో చిత్రీకరిస్తారు. ఈ చిత్రంలో నలుగురు ముఖ్య పాత్రధారులు కృష్ణ, సంధ్యారాణి, రామమోహన్, సుకన్య. బాబూ మూవీస్ ఆఫీస్‌లో ట్రయినింగ్ అయినారు. వీరుగాక ఇంకా ఈ చిత్రంలో పి. వెంకటేశ్వరరావు, పుష్పకుమారి, యం.వి. చలపతిరావు, రాధాకుమారి, కోటేశ్వరరావు, వాణిబాల, జి. యస్.ఆర్. మూర్తి, బేబి రోజారాణి మొదలగువారు.

ఈ చిత్రానికి కథాసృష్టి— కవిత్రయం ఆదుర్తి సుబ్బారావు, ఆచార్య ఆత్రేయ, ముళ్ళపూడి వెంకట రమణ, సంభాషణలు— పాటలు— ఆచార్య ఆత్రేయ. సంగీతం— కె.వి. మహాదేవన్, ఛాయ—పి.ఎల్.రాయ్, సహాయ దర్శకుడు—కె. విశ్వనాథం, దర్శకుడు— ఆదుర్తి సుబ్బారావు, నిర్మాత పి. సుందరం.

డి. బి. ఎస్. ప్రొడక్షన్సు 'దాగుడు మూతలు'

డి. బి. ఎస్. ప్రొడక్షన్సు వారి "దాగుడు మూతలు" చిత్రం పూర్తి అయింది. త్వరలో విడుదల కానున్న చిత్రాలలో ఇదొకటి.


ఈ చిత్రంలో యున్. టి. రామారావు, బి. సరోజాదేవి, గుమ్మడి, రమణారెడ్డి, సూర్యకాంతం, పద్మనాభం, శారద, అల్లు రామలింగయ్య, రాధాకుమారి మొదలగు వారు నటించారు. శ్రీ నాగయ్య గెస్టుగా నటించారు.

ఈ చిత్రానికి కథ, మాటలు : ముళ్ళపూడి

ఆడంబరాలను విడనాడండి
దేశసంపదను వృథా కానీయకండి

కొంతమంది పాఠకులు సినిమానటీనటుల చిరునామాలు తెలుపమని వ్రాస్తున్నారు. ఇది సాధ్యంకాదు! ఇటువంటి వివరాలు కావలసినవారు ఏ సినిమా డైరీలోనో చూసుకుంటే మంచిది. (సం.)

సినిమా వార్తలు



రామారావు ముఖ్యమంత్రి నిధికి విరాళమిచ్చిన చెక్కు బొమ్మ యిది.

వెంకటరమణ, పాటలు : ఆత్రేయ, ఆరుద్ర, దాశరథి, సంగీతం : కె. వి. మహదేవన్, ఛాయ : పి. ఎల్. రాయ్, నృత్యం : పి. ఎస్. గోపాలకృష్ణన్, కళ : ఎస్. కృష్ణారావు, కూర్పు : టి. ఎస్. కృష్ణ, దర్శకుడు: ఆదుర్తి సుబ్బారావు, నిర్మాత : డి. బి. నారాయణ.

'వివాహ బంధం'

భరణీవారి 'వివాహబంధం' చిత్రంలో కన్నాంబ పాత్ర స్థానే సూర్యకాంతంను నియమించారు—

నటుడు రామకృష్ణ— గౌరి ప్రొడక్షన్‌లోను, విజయభట్ మూవీస్‌లోనూ ఈ రెండు తెలుగు కంపెనీలలోనూ, రెండు కన్నడ చిత్రాలు "కలా జ్యోతి", "మిస్ లీలావతి"లోనూ నటిస్తున్నట్లు తెలుస్తుంది

ఆర్. ఆర్. పిక్చర్సు తెలుగు చిత్రం

ఆర్. ఆర్. పిక్చర్సు వారు తమిళంలో విజయవంతమైన 'పెరియిడత్ పెణ్' చిత్రాన్ని తెలుగులో నిర్మిస్తున్నారు. ఈ మధ్య షూటింగ్ జోరుగా సాగిస్తున్నారు. ఇప్పటికి సుమారు 7 రీళ్ల చిత్రం పూర్తి అయింది. ఈ చిత్రంలో యన్. టి. రామారావు, కృష్ణకుమారి, రమణారెడ్డి, రాజనాల, పద్మనాభం, ప్రసాద్, జగ్గారావు, వాసంతి, గీతాంజలి, సంధ్య మొదలగువారు నటిస్తున్నారు.

రచన : ఆత్రేయ, ఛాయ : మల్లియరాపి, సంగీతం : పెండ్యాల నాగేశ్వరరావు, దర్శకుడు : బి. ఎస్. మూర్తి, నిర్మాత : ఆర్. ఆర్. పిక్చర్స్ తరఫున టి. ఆర్. చక్రవర్తి.

యస్. ఆర్. మూవీస్ "ప్రమీలార్జునీయం"

యస్. ఆర్. మూవీస్ వారు నిర్మిస్తున్న పౌరాణిక చిత్రం "ప్రమీలార్జునీయం" చిత్రంలో యన్. టి. రామారావు, కాంతారావు, రేలంగి, పద్మనాభం, మిక్కిలినేని, బాలకృష్ణ, శోభన్ బాబు, బి. సరోజాదేవి, గిరిజ, ఛాయాదేవి, రాజశ్రీ మొదలగువారు నటిస్తున్నారు. మాటలు : పాటలు : పింగళి నాగేంద్రరావు, సంగీతం : పెండ్యాల నాగేశ్వరరావు, కళ : గోఖలే, ఛాయ : రవికాంత్ నిగాయిజ్, నిర్మాతలు : నాగమణి, ఆదిబాబు, దర్శకుడు : మల్లికార్జునరావు.

పి. ధర్మారావు. ★

'డాక్టర్ చక్రవర్తి' చిత్రసమీక్ష

జ్వాలలు రగిలించే దొకరు. దానికి బలి అయిపోయేది మరొకరు. వాస్తవాలు తెలియక పోవటం, దాని ఫలితంగా అపార్థాలు సంభవించటం తరచుగా జరిగే విచిత్రం.

తెలుగులో ఈ మధ్య వస్తున్న సినిమాలలో చాల వరకు ప్రేమతో ప్రారంభమయి, విరహాన్ని దాటుకొంటూ, వివాహంతోను, చల్లగాలిలో షికారుతోను అంతమవుతున్నాయి. ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో సీరియల్‌గా ప్రచురింపబడిన కుమారి కోడూరి కౌసల్యాదేవిగారి 'చక్రభ్రమణం' నవలను ఆధారంగా చేసికొని 'వాకవక్యం'తో రూపొందించబడిన 'డాక్టర్ చక్రవర్తి' చిత్రం దాదాపు వివాహంతోనే ప్రారంభమవుతుంది.



'డా॥ చక్రవర్తి'లో నాగేశ్వరరావు

చక్రవర్తి చిన్ననాటనే తల్లిదండ్రులను కోల్పోయి చెల్లెలు సుధను ఆప్యాయంగా చూసికొంటూ, ఉంటాడు. ఒక ధనికుడు సుధను ప్రేమించిపెళ్లి చేసుకోవటం, ఈలోపుగా పెద్దవాడైన చక్రవర్తి బావగారి సహాయంతో డాక్టర్ కావటం జరిగిపోతాయి. విదేశాలలో చక్రవర్తి చదువు ముగించుకొని, చెల్లెలు సుధను చూడాలన్న కుతూహలంతో ఇంటికి వస్తాడు. సుధ కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నదన్న వార్త అతణ్ణి క్రుంగదీస్తుంది. ఆ కేన్సర్ వ్యాధి తీవ్రంగా పరిణమించి, సుధకే అంతం కల్పిస్తుంది. రెండు కుటుంబాలు వేర్వేరు కాకూడదన్న అభిప్రాయంతో ఆఖరిక్షణాల్లో చనిపోబోతూన్న సుధ, తన అన్నయ్య చక్రవర్తికీ, వదిన నిర్మలకూ వివాహం జరిపిస్తుంది. డాక్టర్ చక్రవర్తి అంతకు ముందు తాను డాక్టర్ శ్రీదేవిని ప్రేమించినా, సోదరి మాట కాదనలేక నిర్మలనే వివాహం చేసికొంటాడు. ఇంతలో మిత్రుడు రవీంద్ర, అతని భార్య మాధవిలతో డాక్టర్ చక్రవర్తికి సాన్నిహిత్యం ఏర్పడుతుంది. మాధవిని చెల్లెలుగా చూసుకుంటున్న చక్రవర్తిని నిర్మల అపార్థం చేసికొని, వారిరువురి సాన్నిహిత్యాన్ని శంకిస్తుంది. వంటకత్తె యిచ్చిన ప్రోత్సాహంతో ఉత్తరాల్ని వ్రాసి మాధవి, కాపురంలో నిర్మల కలతలు లేవదీస్తుంది. రవీంద్ర కూడా మాధవిని అనుమానించి పుట్టింటికి పంపివేస్తాడు. ఈ విధంగా కథ మంచి పట్టుతో కొంత దూరం సాగి, చివరకు అందరి అనుమానాలు తీరిపోవటం, ఈలోగా ప్రసవించిన మాధవికి పుట్టిన పిల్లవానికి 'చక్రవర్తి' అని నామకరణం చేయటంతో కథ ముగుస్తుంది.

కథలో కంటె, కథ చెప్పిన తీరులో కొత్తదనం ఉంది. సంఘటనల అల్లిక కొంత వరకు బాగున్నా, చివరకు వచ్చేసరికి కథను కావాలని సాఢిగించినట్లనిపిస్తుంది దీనికి ఉపకథగా ఉన్న 'హాస్యకథ' బావుంది.

ఈ చిత్రంలో కొన్ని వినూత్న ప్రయోగాలను చేకొర్చి, కొత్త తరహా వాతావరణాన్ని ఏర్పరచటానికి విజయవంతమైన కృషి జరిగింది.

సంభాషణలు వాస్తవంగాను, హృదయాన్ని స్పందింపజేసేగను రూపొందించిన ఆచార్య ఆత్రేయను ఎలా అభినందించాలో తెలియటం లేదు ! పాటలు అన్నీ బాగున్నాయి ! "పాడమని నన్నడగ వలెనా", "జ్వాలలు రగిలించేదొకరు"— ఈ రెండు పాటలు కలుగురి నోళ్లలో నాలుగు నాళ్లు ఉంటాయి. బాంగ్రా నృత్యమూ, దాని కోసం శ్రీ దాశరధి రచించిన పాట— రెండూ బాగా ఉన్నాయి

నటన— ఒకటి రెండు చిన్న పాత్రలు మినహాయిస్తే, లోపం ఎవరి నటనలోనూ లేదు. డాక్టర్ చక్రవర్తిగా అక్కినేని, రవీంద్రగా జగ్గయ్య పోటీ పడి నటించారా అనిపిస్తుంది. నిర్మలగా జావిత్రి, మాధవిగా సావిత్రి ఆయా పాత్రలకు బాగా సరిపోయారు. సుధగా నటించిన గీతాంజలి మరి కొంత కృషి చేయవలసిన అవసరం కనిపిస్తుంది. హాస్యపాత్రలు పద్మనాభం, చలం, సూర్యకాంతం ప్రశస్తులు చక్కని హాస్యాన్నే అందించారు. మాధవి సోదరుడు శ్రీధర్‌గా గుమ్మడి కొద్దికాలమే కనుపించినా, ఆ కొద్ది కాలంలోనూ బాగా నటించారు. గెస్ట్ ఆర్టిస్ట్‌గా కృష్ణకుమారి నటన సహజంగానే ఉంది.

మధురమైన సంగీతం వినిపించిన రాజేశ్వరరావుగారు అక్కడక్కడ ఒకటి రెండు పాశ్చాత్య బాణీలనే వినిపించారు

మామూలు కథనే ఇంత పటిష్ఠంగా రూపొందించిన ఘనత దర్శకుడు శ్రీ ఆదుర్తికి దక్కాలి.

ఏమైనా. . . . ఒకింత సుకులు లేకుండా సాగించిన చిత్రం ఇది. ఒకటి, రెండు సందర్భాలలో విసుగు అనిపించినా, చిత్రం మొత్తం మీద కులాసాగా, హాయిగా ఉంటుంది.


వాసిరాజు ప్రకాశం

'సంగమ్' చిత్రం కథ

అవీ - ఇవీ - అన్నీ

ప్రేమలెన్ని రంగులలో, వాటినిమించిన హంగులలో కనుపిస్తాయి ఈ చిత్రంలో!

ఇద్దరు ఆత్మీయులైన మిత్రులు— వారిద్దరికీ కే ఆత్మీయురాలు ఉండటం జరిగింది. అంద ైన అమ్మాయి రాధ ఆ అమ్మాయికోసం సుందర్, పాల్ అనే ఇద్దరు తహతహలాడిపోతుంటారు. రాధ కూడా (ఒకరిని ప్రేమించాలి కాబట్టి) గోపాల్‌ను ప్రేమిస్తుంది. ఈ లోగా సుందర్ కూడా రాధను ప్రేమిస్తున్నాడన్న సంగతి తెలిసికొన్న గోపాల్ తన ప్రేమను త్యాగం చేస్తాడు. తదుపరి సుందర్, రాధలు వివాహం చేసుకొంటారు. ఒకనాడు అంటే— హనీమూన్, కులాసాలు గడిచిన తరువాత సుందర్, రాధ వద్ద ఒక ప్రేమలేఖను చూసి, ఆ వృత్తాంతం ఏమిటని నిలదీసి అడుగుతాడు. సరియైన సమాధానం రాకపోవటంతో సుందరం క్షోభించి ఆత్మహత్యకు సన్నద్ధుడవుతున్న సమయంతో రాధ అతనివద్దనున్న 'పిస్తోలు' తీసికొని గోపాల్ వద్దకు పరిగెడుతుంది. సుందర్ కూడా అక్కడకు వెళ్తాడు. అంతకుపూర్వమే 'రాధ' గోపాల్‌ను ప్రేమించిన దన్న సంగతి తెలిసికొని, 'రాధ'ను గోపాల్‌కు అప్పగించబోతాడు. కాగా, కథ అడ్డం తిరగటం, గోపాల్ ఆత్మహత్య చేసికోవటం జరుగుతాయి. గోపాల్ మంచితనాన్ని, త్యాగనిరతిని గ్రహిస్తాడు సుందర్. గంగానదిలో గోపాల్ అస్థికలను సుందర్ నిమజ్జనం చేయటంతో కథ ముగుస్తుంది.



మెరికా పర్యటన ముగించుకొని వచ్చిన శ్రీ అక్కినేనిని 'ఆంధ్రపత్రిక అభ్యుదయ కళా మండలి' సభ్యులు నారాయణస్వామి, ధనకోటిగారల, నాయకత్వాన వెళ్ళి కుశలప్రశ్నలు వేసినప్పటి చిత్రం.

* * *

న్యూఢిల్లీలోని అమెరికన్ సమాచార శాఖ వారు ప్రచురించిన "జాన్. ఎఫ్. కెన్నడీ స్పీక్స్" అనే ఆంగ్ల గ్రంథం మా కార్యాలయానికి చేరింది. మానవ స్వాతంత్ర్యానికి, సమానతకు అవిరళ కృషి చేస్తూ, ఒకానొక వ్యక్తి అసూయకు బలి అయిన మహావ్యక్తి కెనెడీ వివిధ సందర్భాలలో చేసిన విలువైన పదకొండు ఉపన్యాసాలను ఈ చక్కని గ్రంథంలో పొందుపరిచారు. వివిధ సందర్భాలలో తీసిన శ్రీ కెనెడీ ఫోటోలను కూడా చక్కని 'ఆర్టు' పేపరు మీద ముద్రించటం జరిగింది. ప్రముఖ అమెరికన్ కవి రాబర్ట్ ఫ్రెస్ట్ రచించిన దేశభక్తి గీతం ఈ పుస్తకం తొలిపేజీలలో కనుపిస్తుంది. ధర వివరం తెలుపలేదు. ప్రచురణ కర్తలు: అమెరికన్ సమాచారశాఖ, ఇంద్రరోడ్, న్యూఢిల్లీ—1. ★

Edited, Printed and Published by S. Radhakrishna at the AndhraPatrika Press; 6 &7 Thambuchetty Street Madras-1. Phone; 22244 & 23713. Chief Editor S. Sambhu Prasad.



"అగ్గిపిడుగు" లో కృష్ణకుమారి.



బేబి షకీల